www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 5-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 217 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: పౌర్ణమి రా. 6:49 తదుపరి పాడ్యమి, నక్షత్రం: అశ్విని ఉ.9.40 తదుపరి భరణి, వర్జ్యం: శేషం ఉ. 7:33 వరకు, రా. 6:01-7:25, దుర్ముహూర్తం: ఉ.11:36-12:21, అమృతఘడియలు: రా.2:23-3:46., రాహుకాలం: ఉ.12:00-1:30, సూర్యోదయం: 6:19, సూర్యాస్తమయం: 5:38 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బిజినెస్

వరంగల్ ● బుధవారం 5 నవంబరు 2025



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,22,460 ▼	1,12,250 ▼	1,65,000 ▼
విజయవాడ	1,23,000 ▼	1,17,000 ▼	1,49,000 ▼
విశాఖపట్నం	1,24,020 ▼	1,13,000 ▼	1,65,000 ▼
రాజమండ్రి	1,22,450 ▼	1,12,250 ▼	1,49,000 ▼
ప్రొద్దుటూరు	1,20,800 ▼	1,11,140 ▼	1,50,000 ▼
ముంబై	1,20,419 ▼	1,10,304 ▼	1,46,150 ▼

ఎస్‌బీఐ @ రూ.100 లక్షల కోట్లు

సరికొత్త రికార్డు స్థాయికి బ్యాంక్ మొత్తం వ్యాపారం ● ఆస్తుల మొత్తం విలువ పరంగా ప్రపంచంలో 43వ అతిపెద్ద బ్యాంక్

ముంబై: దేశీయ ప్రభుత్వ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) సరికొత్త రికార్డును సృష్టించింది. బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.100 లక్షల కోట్లకు చేరుకుందని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి మంగళవారం తెలిపారు. ఈ మార్చి చివరి నాటికి మరో రూ.5 లక్షల కోట్ల మేర పెరిగి రూ.105 లక్షలకు చేరుకోవచ్చని ఆయన అంచనా వేశారు. మొత్తం ఆస్తుల విలువపరంగా ప్రపంచంలో 43వ అతిపెద్ద బ్యాంక్‌గా నిలిచిందని సెప్టెంబరు త్రైమాసిక ఫలితాల విడుదల సందర్భంగా శెట్టి వెల్లడించారు. ప్రస్తుతం 23,050 శాఖలను నిర్వహిస్తోన్న ఎస్‌బీఐ.. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) చివరికల్లా మరో 500 బ్రాంచీలను ప్రారంభించాలని అనుకుంటున్నట్లు చెప్పారు.

» క్యూ2 లాభం రూ.21,137 కోట్లు

» యెస్ బ్యాంక్‌లో వాటా విక్రయం ద్వారా రూ.4,593 కోట్ల రాబడి



క్యూ2 లాభంలో 6.84 శాతం వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) ఎస్‌బీఐ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 6.84 శాతం వృద్ధితో రూ.21,137 కోట్లకు పెరిగింది. ప్రైవేట్ రంగానికి చెందిన యెస్ బ్యాంక్‌లో వాటా విక్రయం ద్వారా రూ.4,593 కోట్లు సమకూరడం ఇందుకు దోహదపడింది. కాగా, ఈ క్యూ2లో బ్యాంక్ స్టాండ్ ఎలోన్ లాభం 10 శాతం పెరిగి రూ.20,160 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇదే కాలంలో లాభం రూ.18,331 కోట్లుగా ఉంది. ఈ జూలై-సెప్టెంబరులో బ్యాంక్ రుణాలు 12.73 శాతం వృద్ధి చెందినప్పటికీ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) మాత్రం కేవలం 3.28 శాతం పెరిగి రూ.42,984 కోట్లకు పరిమితమైంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 0.17 శాతం తగ్గి 2.97 శాతానికి జారుకోవడం ఇందుకు కారణమైంది.

రుణ వృద్ధి అంచనా 12-14 శాతానికి పెంపు

ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి రుణ వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 11 శాతం నుంచి 12-14 శాతానికి పెంచుతున్నట్లు శెట్టి తెలిపారు. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు, ఆదాయం పన్ను శ్లాబుల్లో మార్పులు, ఆర్‌బీఐ నిబంధనల సడలింపులు సహా ఈ మధ్య కాలంలో ప్రభుత్వం చేపట్టిన విధానపరమైన చర్యలు ఇందుకు దోహదపడనున్నాయని ఆయన పేర్కొన్నారు. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు అమల్లోకి వచ్చాక రుణాలు, ముఖ్యంగా వాహన విభాగంలో భారీగా పుంజుకున్నాయని అన్నారు. గతంలో ప్రకటించిన విధంగా ఈ ఆర్థిక సంవత్సరానికి ఎన్ఐఎం 3 శాతంగా నమోదుకావచ్చని ధీమా వ్యక్తం చేశారు.

ఎన్‌పీఏలు 1.73 శాతం

బ్యాంక్ ఆస్తుల నాణ్యత విషయానికొస్తే, ఈ జూలై-సెప్టెంబరులో కొత్తగా రూ.4,754 కోట్ల రుణాలు మొండి బకాయిలుగా మారాయి. అయితే, ఈ సెప్టెంబరు చివరి నాటికి బ్యాంక్ మొత్తం మొండి బాకీలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) 1.73 శాతానికి తగ్గాయి. గడిచిన రెండు దశాబ్దాల్లో ఇదే అత్యల్పమని ఎస్‌బీఐ చైర్మన్ శెట్టి అన్నారు. కాగా, క్యూ2లో బ్యాంక్ కేటాయింపులు రూ.5,400 కోట్లకు పెరిగాయి.

అమెరికా సుంకాల ప్రభావం లేదు..

భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాలు ఆగస్టు చివర్లో అమలులోకి వచ్చినందున వాటి ప్రభావాన్ని అంచనా వేసేందుకు సెప్టెంబరు త్రైమాసికాన్ని పరిగణనలోకి తీసుకోలేమని శ్రీనివాసులు శెట్టి అన్నారు. ఇప్పటివరకైతే బ్యాంక్ రుణ వృద్ధి, ఆస్తుల నాణ్యతపై ట్రంప్ సుంకాల ప్రభావం లేదన్నారు. సమీక్షా కాలానికి బ్యాంక్ విదేశీ రుణాల వాటా రూ.6.76 లక్షల కోట్లు కాగా, అందులో అమెరికా మార్కెట్ వాటా 25 శాతంగా ఉందన్నారు.

రుణగ్రహీత వాదన విన్నాకే మోసపూరిత ఖాతాల ప్రకటన

సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మోసపూరిత బ్యాంకు ఖాతాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక ఖాతాను మోసపూరిత ఖాతాగా ప్రకటించే ముందు.. ఆ ఖాతాదారుడి వాదన వినడంలో బ్యాంకులకు వచ్చిన ఇబ్బంది ఏమిటని సూటిగా ప్రశ్నించింది. ఎస్‌బీఐ.. ఒక సంస్థ రుణ ఖాతాను మోసపూరిత ఖాతాగా ప్రకటించడాన్ని ఆక్షేపిస్తూ ఆ సంస్థ కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించింది. కోల్‌కతా హైకోర్టు ఈ కేసులో రుణగ్రహీత వాదన విన్న తర్వాతే ఆ ఖాతాను మోసపూరిత ఖాతాగా ప్రకటించాలని స్పష్టం చేసింది. ఎస్‌బీఐ దీన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ అప్పీల్‌ను విన్న జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం.. ఒక ఖాతాను మోసపూరిత ఖాతాగా ప్రకటించే ముందు రుణగ్రహీత వాదన వినడంలో బ్యాంకులకు వచ్చిన ఇబ్బంది ఏమిటని ప్రశ్నించింది. తదుపరి ఈ కేసు విచారణను సర్వోన్నత న్యాయస్థానం ఈనెల 18కు వాయిదా వేసింది.

ఫోర్బ్స్ బెస్ట్ ఎంప్లాయర్స్ జాబితాలో అమర రాజా గ్రూప్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమర రాజా గ్రూప్ మరో ఘనత సాధించింది. ఈ సంవత్సరానికి ఫోర్బ్స్ పత్రిక రూపొందించిన 'వరల్డ్స్ బెస్ట్ ఎంప్లాయర్స్-2025'లో స్థానం సంపాదించింది. ఫోర్బ్స్ పత్రిక ఈ సంవత్సరం ఇందుకోసం మొత్తం 31 కంపెనీలను ఎంపిక చేయగా అమర రాజా గ్రూప్ అందులో నూటికి 63.65 పాయింట్లతో 28వ స్థానంలో నిలిచింది. ఈ సంవత్సరం ఈ జాబితాలో మన దేశం నుంచి మొత్తం 6 కంపెనీలకు స్థానం లభించగా అందులో తమ గ్రూప్ ఒకటని అమర రాజా తెలిపింది.

పెరిగిన ఇండిగో నష్టాలు

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో రూ. 2,582.10 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. విదేశీ మారక (ఫారెక్స్) నష్టాలు, వ్యయాలు లాభదాయకతపై తీవ్ర ప్రభావం చూపించాయని కంపెనీ పేర్కొంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ నష్టాలు రూ. 986.7 కోట్లుగా ఉన్నాయి. అయితే ఈ ఏడాది జూన్ త్రైమాసికంలో రూ. 2,176.30 కోట్ల లాభాన్ని ఆర్జించింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం 10 వృద్ధితో రూ.17,759 కోట్ల నుంచి రూ.19,599.5 కోట్లకు పెరిగింది.

మహీంద్రా లాభం రూ.3,673 కోట్లు

ముంబై: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) లిమిటెడ్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ. 3,673 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.2,867 కోట్లు)తో పోల్చితే లాభం 28 శాతం వృద్ధి చెందింది. ఆటోమొబైల్‌తో పాటు వ్యవసాయ యంత్రాలు, పరికరాల విభాగాల్లో మెరుగైన పనితీరు కనబరచటం కలిసి వచ్చిందని మహీంద్రా గ్రూప్ సీఈఓ, ఎండీ అనిష్ షా తెలిపారు. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా రూ.37,924 కోట్ల నుంచి రూ. 46,106 కోట్లకు పెరిగింది.

అపోలో హాస్పిటల్స్‌తో నవీ ముంబై ఎయిర్‌పోర్ట్ జట్టు

ముంబై: విమానాశ్రయ ఉద్యోగులు, ప్రయాణికులకు నిరంతరాయంగా సమగ్ర ఆరోగ్య సంరక్షణ సేవలందించేందుకు నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంతో (ఎన్ఎంఐఏఎల్) అపోలో హాస్పిటల్స్ చేతులు కలిపింది. ఇటీవలే లాంఛనంగా ప్రారంభమైన ఈ విమానాశ్రయం నుంచి విమానాల రాకపోకలు డిసెంబరు ప్రథమార్థం నుంచి ప్రారంభమవుతాయి. ఉభయ సంస్థల మధ్య కుదిరిన అంగీకారం ప్రకారం విమానాశ్రయం టెర్మినల్ 1లో అపోలో హాస్పిటల్స్ 24 గంటలూ పని చేసే ఒక వైద్య కేంద్రాన్ని ప్రారంభించనుంది. ఈ కేంద్రంలో ఎమర్జెన్సీ వైద్య సేవలతో పాటు వైపరీత్య నిర్వహణా సదుపాయాలు కూడా ఉంటాయని అపోలో హాస్పిటల్స్ తెలిపింది.

● ఆప్టికల్, మెజర్‌మెంట్ సొల్యూషన్ల విభాగంలో అగ్రగామి అయిన జెస్ హైదరాబాద్‌లో క్వాలిటీ ఎక్సలెన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. ఇది కంపెనీకి 7వ క్యూఈసీ. భారత ఏరోస్పేస్, అడ్వాన్స్‌డ్ తయారీ రంగాల్లో ఇన్నోవేషన్ విషయంలో తమ కట్టుబాటుకు ఇది నిదర్శనమని పేర్కొంది. 4,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసింది.

● ధరన్ ఇన్‌ఫ్రా-ఈపీసీ లిమిటెడ్ (గతంలో కేబీసీ గ్లోబల్) అనుబంధ సంస్థ ధరన్ ఇన్‌ఫ్రా సోలార్.. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన స్కైమ్యాక్స్ ఇన్‌ఫ్రా పవర్ నుంచి రూ.215 కోట్ల విలువైన కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. ఆర్డర్‌లో భాగంగా మహారాష్ట్రలో స్కైమ్యాక్స్ కోసం 75 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుదుత్పత్తి ప్రాజెక్ట్ డిజైన్, ఇంజనీరింగ్, స్థాపన, కమీషనింగ్‌ను చేపట్టాల్సి ఉంటుంది.

● సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో జీహెచ్‌వీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ రూ.183.76 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.11.02 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. జూన్ త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 128%, లాభం 138% వృద్ధి చెందింది. కాగా సెప్టెంబరు 31 నాటికి కంపెనీ ఆర్డర్ బుక్ రూ.8,500 కోట్లుగా ఉంది.



ధర రూ.7.89 లక్షలు

మార్కెట్లో హ్యుండయ్ సరికొత్త వెన్యూ

న్యూఢిల్లీ: హ్యుండయ్ మోటార్ కంపెనీ సరికొత్త హంగులతో తయారుచేసిన కాంపాక్ట్ ఎస్‌యూవీ వెన్యూను మార్కెట్లో విడుదల చేసింది. దీని ధర రూ.7.89 లక్షలు (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్). ఇది పెట్రోల్, డీజిల్ వెర్షన్లలో మాన్యువల్, ఆటోమేటిక్ ఇంజన్లతో అందుబాటులో ఉంటుంది. రూ.1,500 కోట్ల పెట్టుబడితో అభివృద్ధి చేసిన ఈ కొత్త తరం వెన్యూ కారును కొత్తగా ప్రారంభించిన పుణె ప్లాంట్‌లోనే ఉత్పత్తి చేస్తామని త్వరలో ఎండీ, సీఈఓగా బాధ్యతలు చేపట్టనున్న ప్రస్తుత చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తరుణ్ గార్గ్ చెప్పారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే కార్లు దేశీయ అవసరాలకే కాకుండా 30 దేశాలకు కూడా ఎగుమతి చేస్తామని ఆయన తెలిపారు. కాంపాక్ట్ ఎస్‌యూవీ విభాగంలో ఈ కారు మారుతి బ్రెజ్జా, టాటా నెక్సన్, కియా సోనెట్‌తో పోటీ పడుతుంది.

రూ.2.71 లక్షల కోట్ల సంపద నష్టం

సెన్సెక్స్ 519 పాయింట్లు పతనం

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాల నేపథ్యంలో మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడటంతో పాటు విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ కారణంగా దేశీయ ఈక్విటీ సూచీలు మంగళవారం భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్ 519.34 పాయింట్లు క్షీణించి 83,459.15 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 165.70 పాయింట్లు కోల్పోయి 25,597.65 వద్ద ముగిసింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.2.71 లక్షల కోట్లు తగ్గి రూ.469.80 లక్షల కోట్లకు పడిపోయింది.

నేడు మార్కెట్లకు సెలవు

గురునానక్ జయంతి సందర్భంగా బుధవారం స్టాక్ మార్కెట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. గురువారం మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	575
వరంగల్	572	గోదావరి	585
చిత్తూరు	603	విశాఖపట్నం	570
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	109
వరంగల్	107	గుంటూరు	113
కరీంనగర్	107	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	105
కర్నూలు	107	నెల్లూరు	110
విశాఖపట్నం	108	అనంతపురం	110
గోదావరి	109		


పండగల సీజన్‌లో రుణ వితరణ అదుర్స్

బజాజ్ ఫైనాన్స్

న్యూఢిల్లీ: ఈ ఏడాది పండగల సీజన్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లకూ బాగానే కలిసొచ్చింది. బజాజ్ ఫైనాన్స్ ఈ ఏడాది సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 26 మధ్య కాలంలో రికార్డు స్థాయిలో దాదాపు 63 లక్షల రుణాలు మంజూరు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది విలువపరంగా 29 శాతం, పరిమాణపరంగా 27 శాతం ఎక్కువని తెలిపింది. జీఎస్‌టీ 2.0 సంస్కరణలు, కేంద్ర బడ్జెట్‌లో ఆదాయ పన్ను తగ్గించడం ఇందుకు ప్రధాన కారణమని బజాజ్ ఫైనాన్స్ చైర్మన్ సంజీవ్ బజాజ్ తెలిపారు. ఈ ఏడాది పండగల సీజన్‌లో 23 లక్షల మంది కొత్త ఖాతాదారులు కంపెనీ నుంచి రుణాలు తీసుకున్నారు. వీరిలో 52 శాతం మంది జీవితంలో తొలిసారి రుణాలు తీసుకున్న వ్యక్తులని బజాజ్ ఫైనాన్స్ తెలిపింది.

స్పోర్ట్స్

27న ఢిల్లీలో డబ్ల్యూపీఎల్ వేలం



న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) క్రికెటర్ల వేలాన్ని ఈనెల 27న ఢిల్లీలో నిర్వహించనున్నారు. ఈ మేరకు లీగ్‌లోని అన్ని జట్లకు బీసీసీఐ సమాచారం ఇచ్చింది. ఈసారి వేలం పూర్తి స్థాయిలో జరగనుంది. ప్రతి జట్టు ఐదుగురు ప్లేయర్లను తిరిగి అట్టి పెట్టుకోవచ్చు. ఇందులో ముగ్గురు స్వదేశీ, ఇద్దరు విదేశీ క్రికెటర్లు ఉండాలి. వేలానికి ప్రతి జట్టుకు రూ.15 కోట్ల పర్సు కేటాయించారు. అట్టిపెట్టుకునే క్రికెటర్లను ఐదు విభాగాలు (రూ.3.5 కోట్లు, రూ.2.5 కోట్లు, రూ.1.75 కోట్లు, రూ.1 కోటి, రూ.5 నుంచి 50 లక్షలు)గా విభజించారు.

ఐసీసీ జట్టులో స్మృతి, దీప్తి, జెమీమా

దుబాయ్: మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో విశేషంగా రాణించిన ప్లేయర్లతో టీమ్ ఆఫ్ ద టోర్నమెంట్‌ను ఐసీసీ ప్రకటించింది. ఇందులో ఫైనల్‌కు చేరిన రెండు జట్ల నుంచి ఆరుగురికి చోటు దక్కింది. అలాగే భారత్ నుంచి స్మృతీ మంధాన, దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్ ఎంపికయ్యారు. టీమ్ కెప్టెన్‌గా వోల్వార్ట్‌ను నియమించగా, దక్షిణాఫ్రికా నుంచే కాప్, డిక్లెర్క్ ఉన్నారు. ఇతర క్రికెటర్లలో గార్డ్‌నర్, సదర్లాండ్, అలన కింగ్ (ఆస్ట్రేలియా), సిద్రా నవాజ్ (పాక్ కీపర్), ఎకెల్‌స్టోన్, సివర్ బ్రంట్ (ఇంగ్లండ్) ఉన్నారు.



మంధానను దాటేసి..



నెం.1 బ్యాటర్ వోల్వార్ట్

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ టాప్-10లో జెమీమా

దుబాయ్: టీమిండియా స్టార్ బ్యాటర్ స్మృతీ మంధాన వన్డేల్లో నెంబర్ వన్ స్థానాన్ని కోల్పోయింది. గతవారం ముగిసిన మహిళల వన్డే ప్రపంచ కప్‌లో అత్యధిక పరుగుల (571)తో రికార్డు సృష్టించిన దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ టాప్ ర్యాంక్‌కు చేరుకుంది. మంగళవారం ఐసీసీ ప్రకటించిన మహిళల వన్డే ప్రపంచకప్ బ్యాటర్ల జాబితాలో రెండు స్థానాలు ఎగబాకిన వోల్వార్ట్.. 814 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. మంధాన (811) రెండో ర్యాంక్‌కు పడిపోయింది. వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియాతో సెమీఫైనల్లో సూపర్ సెంచరీతో ఆకట్టుకున్న టీమిండియా యువ కెరటం జెమీమా రోడ్రిగ్స్ ఏకంగా తొమ్మిది స్థానాలు ఎగబాకి పదో ర్యాంక్‌తో టాప్-10లో నిలిచింది. సారథి హర్మన్‌ప్రీత్ 14వ స్థానంలో ఉంది. బౌలర్లలో సోఫీ ఎకెల్‌స్టోన్ టాప్‌లో ఉండగా, భారత్‌కు చెందిన దీప్తీ శర్మ ఐదో ర్యాంక్‌లో కొనసాగుతోంది.

మిథాలీ రాజ్: అప్పట్లో మ్యాచ్‌కు రూ. 1000 ఇచ్చారు



న్యూఢిల్లీ: ఇప్పుడంటే భారత మహిళల క్రికెట్‌లో ఏదైనా పెద్ద టోర్నమెంట్ గెలిస్తే, జట్టు సభ్యులు నజరానాల రూపంలో రూ. కోట్లు అందుకుంటున్నారు. వార్షిక కాంట్రాక్టుల రూపంలో రూ. లక్షలు దక్కుతున్నాయి. ఆర్థికంగా క్రికెటర్లు భారీగానే లాభపడుతున్నారు. కానీ, గతంలో మహిళా క్రికెటర్లకు కనీసం మ్యాచ్ ఫీజులు కూడా లేవని టీమిండియా మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ ఓ ఇంటర్వ్యూలో గుర్తు చేసుకుంది. 'ఒకప్పుడు మాకు మ్యాచ్ ఫీజులు, వార్షిక కాంట్రాక్టులు లేవు. 2005 ప్రపంచ కప్‌లో రన్నరప్‌గా నిలిచాం. అప్పుడు మాకు ఒక్కో మ్యాచ్‌కి రూ. 1000 చొప్పున ఇచ్చారు. అది కూడా ఆ టోర్నీ వరకే. అప్పట్లో మహిళల క్రికెట్ నుంచి వచ్చే ఆదాయం తక్కువ. అందుకే మ్యాచ్ ఫీజులు కూడా ఉండేవి కావు. మహిళల క్రికెట్ సంఘం.. బీసీసీఐలో విలీనం అయ్యాక మ్యాచ్ ఫీజులు, వార్షిక కాంట్రాక్టులు మొదలయ్యాయి. మొదట్లో మాకు సిరీస్‌కు ఇంత అని ఇచ్చేవారు. ఆ తర్వాత ఒక్కో మ్యాచ్‌కు వేతనం చెల్లించారు. ఇప్పుడు పురుషుల జట్టుతో సమానంగా మహిళల జట్టుకు వేతనాలు అందిస్తున్నారు' అని నాటి పరిస్థితులను మిథాలీ వివరించింది. 1973 నుంచి 2006 వరకు భారత్‌లో మహిళా క్రికెట్ కార్యకలాపాలను మహిళల క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూసీఏఐ) పర్యవేక్షించింది. 2006 చివర్లో డబ్ల్యూసీఏఐని బీసీసీఐలో విలీనం చేశాక మహిళా క్రికెటర్ల వేతనాల్లో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది.

బ్రాండ్ వాల్యూ రయ్..రయ్

న్యూఢిల్లీ: తొలిసారిగా మహిళల వరల్డ్‌కప్‌ను సాధించిన భారత క్రికెటర్ల దశ తిరిగింది. ఇప్పటికే ఐసీసీ నజరానాతో పాటు బీసీసీఐ సైతం భారీ స్థాయిలో నగదును ప్రకటించింది. దీనికి తోడు ఆయా సంస్థలు, రాష్ట్రాలు కూడా తమ ప్లేయర్లపై కనకవర్షాన్ని కురిపిస్తున్నాయి. అలాగే పలువురు క్రికెటర్లను తమ కంపెనీల ఉత్పత్తుల ప్రచారానికి కార్పొరేట్ సంస్థలు ముందుకు వస్తున్నాయి. అటు చాంపియన్ హోదాలో ఆటగాళ్ల బ్రాండ్ విలువ కూడా 25 నుంచి 100 శాతం పెరిగినట్టు సమాచారం. స్మృతీ మంధాన, హర్మన్‌ప్రీత్, జెమీమా, దీప్తి శర్మ, షఫాలీల వెంట ఇప్పుడు కంపెనీలు క్యూ కడుతున్నాయి. అటు సోషల్ మీడియాలోనూ వీరికి ఫాలోవర్ల సంఖ్య ఎక్కువే. బ్రాండ్ ఎండార్స్‌మెంట్ కోసం ఆయా ప్లేయర్ల ఏజెన్సీలను సంప్రదించినప్పుడు వారు రెండింతల నుంచి మూడింతల వరకు రేటు చెబుతున్నారట. అంతేకాకుండా ఇప్పటికే కొనసాగుతున్న సంస్థలు తమ ఒప్పందాలను రెన్యువల్ చేసుకునేందుకు ముందుకు వస్తున్నాయి. ముఖ్యంగా సెమీస్‌లో సెంచరీతో ఆస్ట్రేలియాను ఓడించిన జెమీమా బ్రాండ్ విలువ ఏకంగా వంద శాతం పెరగడం గమనార్హం. వాస్తవానికి ఆసీస్‌తో మ్యాచ్ ముగిసినప్పటి నుంచే జెమీమాతో ఒప్పందం కోసం తమకు విపరీతంగా కాల్స్ వస్తున్నట్టు జేఎస్ డబ్ల్యూ ఏజెన్సీ పేర్కొంది. ఇప్పుడు ఆమె ఒక్కో బ్రాండ్‌కు రూ.75 లక్షల నుంచి రూ.1.5 కోట్ల వరకు వసూలు చేస్తోంది. అటు మంధాన ఇప్పటికే 16 బ్రాండ్లతో అందరికన్నా ముందుండగా, ఒక్కో ప్రకటనకు ఆమె రూ.1.5 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు తీసుకుంటోంది.

ఎవరికి ఎంత మొత్తం..

విశ్వకప్ గెలుచుకున్న భారత మహిళా జట్టు ప్లేయర్లు కోటీశ్వరులు కాబోతున్నారు. విజేతగా నిలిచినందుకు ఐసీసీ దాదాపు రూ.40 కోట్లను ప్రైజ్‌మనీగా అందించింది. దీనికి తోడు బీసీసీఐ సైతం రూ. 51 కోట్లను ఇవ్వనుంది. అంటే రెండు కలిపితే సుమారు రూ. 91 కోట్లు. ఈ మొత్తాన్ని క్రీడాకారిణులు, కోచింగ్ సిబ్బంది (హెడ్ కోచ్, బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లు), సహాయక సిబ్బంది (ఫిజియో, ట్రైనర్, ఎనలిస్టు, డాక్టర్, లాజిస్టిక్స్.. తదితరులు)తోపాటు మరికొంతమంది పంచుకోవాల్సివుంటుంది. దీంతో జట్టులో ఒక్కో ప్లేయర్‌కు ఎంత మొత్తం దక్కనుందనే ఆసక్తి వ్యక్తమవుతోంది. కానీ ఈ వివరాలను అధికారికంగా ప్రకటించలేదు. అయితే ఆటగాళ్లు 70 శాతం, కోచింగ్ స్టాఫ్ 10 శాతం, సహాయక సిబ్బంది 7 శాతం అందుకుంటారని చెబుతున్నారు. ఇంకా సెలెక్టర్లు..ఇతరత్రా సిబ్బంది కూడా ఉంటారు. ఇది కాకుండా పేసర్లు రేణుకా సింగ్, క్రాంతి గౌడ్‌లకు వారి రాష్ట్రాల నుంచి రూ. కోటి చొప్పున.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కు పంజాబ్ నుంచి రూ.11 లక్షలు, అమన్‌కు రూ.5 లక్షలు దక్కనున్నాయి. ఇక సూరత్ వ్యాపారి ఆటగాళ్లందరికీ వజ్రాల ఆభరణాలను ఇవ్వనున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే.

ఢిల్లీ చేరుకున్న క్రికెటర్లు

భారత మహిళా క్రికెటర్లు ముంబైనుంచి మంగళవారం న్యూఢిల్లీ చేరుకున్నారు. హోటల్ వద్ద వారికి అభిమానులు బాణాసంచాతో ఘన స్వాగతం పలికారు. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమవుతారు.

2028 ఒలింపిక్స్ నుంచి మీరాబాయి కేటగిరి తొలగింపు

53 కిలోలకు మారనున్న భారత లిఫ్టర్



న్యూఢిల్లీ: భారత స్టార్ లిఫ్టర్, టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత మీరాబాయి చాను ప్రస్తుతం పోటీపడుతున్న 49 కిలోల బరువు విభాగాన్ని వచ్చే 2027 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ నుంచి తొలగించారు. విశ్వక్రీడల మహిళల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ ఈవెంట్లను 12 (పురుషులు 6, మహిళలు 6)కు పెంచడంలో భాగంగా ఇప్పటిదాకా ఉన్న అతి తక్కువ వెయిట్ కేటగిరిని 49 నుంచి 53 కిలోలకు ఐఓసీ మార్చినట్టు అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య (ఐడబ్ల్యూఎఫ్) తెలిపింది. వాస్తవానికి మీరాబాయి.. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో 49 కిలోల విభాగంలోనే రజతం సాధించింది. ఐఓసీ తాజా నిర్ణయంతో రానున్న ఒలింపిక్స్‌లో మీరా 53 కిలోల విభాగం నుంచి బరిలోకి దిగే అవకాశముంది. అయితే వచ్చే ఏడాది ఆసియా క్రీడల వరకు మీరా, తన పాత కేటగిరి 49 కిలోల్లోనే పోటీపడుతుంది. తాజా ఐఓసీ నిర్ణయం ప్రకారం వచ్చే ఒలింపిక్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్‌లో మహిళల విభాగం నుంచి 53, 61, 69, 77, 86, 86+ కిలోలు, పురుషుల తరఫున 65, 75, 85, 95, 110, 110+ కిలోల విభాగాల్లో లిఫ్టర్లు పోటీపడాల్సి ఉంటుంది.

అభిరథ్ అజేయ శతకం

హైదరాబాద్ విజయం ● హిమాచల్‌తో రంజీ


అభిరథ్

నదౌన్ (హిమాచల్ ప్రదేశ్): ఓపెనర్ అభిరథ్ రెడ్డి (175 నాటౌట్) భారీ శతకంతో అదరగొట్టాడు. దీంతో హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన రంజీ ట్రోఫీ గ్రూప్ 'డి' ఎలీట్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 4 వికెట్ల తేడాతో నెగ్గింది. 344 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ మంగళవారం తమ రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 347 పరుగులు చేసి గెలిచింది. రాహుల్ రాదేశ్ (66), హిమతేజ (33), తనయ్ (29) సహకరించారు. ఆర్యమాన్‌కు మూడు వికెట్లు దక్కాయి. అంతకుముందు హిమాచల్ తొలి ఇన్నింగ్స్‌లో 318, హైదరాబాద్ 278 పరుగులు చేయగా.. హిమాచల్ రెండో ఇన్నింగ్స్‌లో 303 పరుగులకు ఆలౌటైంది.

ఐసీసీ మీటింగ్‌కు నక్వీ డుమ్మా!

కరాచీ: ఐసీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశానికి పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చైర్మన్ మొహిసిన్ నక్వీ గైర్హాజరయ్యే అవకాశం ఉంది. ఎందుకంటే ఈ మీటింగ్‌లో బీసీసీఐ తమ జట్టుకు అందాల్సిన ఆసియాకప్‌పై చర్చించే అవకాశం ఉంది. మంగళవారం దుబాయ్‌లో ఆరంభమైన ఐసీసీ బోర్డు సమావేశం మరో మూడు రోజుల పాటు కొనసాగుతుంది. పాక్ ప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరిస్తున్న నక్వీ స్థానిక రాజకీయ వ్యవహారాల కారణంగా రాలేకపోతున్నారని పీసీబీ వర్గాలు పేర్కొంటున్నాయి. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత ఆటగాళ్లు చాంపియన్‌గా నిలిచాక నక్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకునేందుకు ఇష్టపడలేదు. దీంతో నక్వీ ఆ ట్రోఫీని తీసుకెళ్లి తన ఆఫీసులో పెట్టి తాళం వేసుకున్న విషయం తెలిసిందే. నక్వీ స్థానంలో పీసీబీ సీఓఓ సుమైర్ సయ్యద్ హాజరయ్యే అవకాశం ఉంది.

అర్జున్ శుభారంభం

పనాజీ: తెలుగు గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ ఫిడే వరల్డ్‌కప్‌లో శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన రెండో రౌండ్ తొలిగేమ్‌లో అర్జున్ 37 ఎత్తుల్లో మార్టిన్ పెట్రోవ్ (బల్గేరియా)పై నెగ్గాడు. అర్జున్‌కు తొలి రౌండ్‌లో బై లభించడం తెలిసిందే. అరవింద్ చిదంబరంతో గేమ్‌ను ఆంధ్ర జీఎం కార్తీక్ వెంకట్రామన్ డ్రా చేసుకున్నాడు. గుకేష్, ప్రజ్ఞానంద, విదిత్ గుజరాతి, ఎస్ఎల్ నారాయణ్ కూడా రెండో రౌండ్ తొలి గేమ్‌లను డ్రాగా ముగించారు.

అండర్-19 వన్డే చాలెంజర్ ట్రోఫీకి ద్రవిడ్ చిన్న కొడుకు



న్యూఢిల్లీ: దిగ్గజ ఆటగాడు రాహుల్ ద్రవిడ్ చిన్న కుమారుడు అన్వయ్ అండర్-19 వన్డే చాలెంజర్ ట్రోఫీకి ఎంపికయ్యాడు. బుధవారం నుంచి హైదరాబాద్ వేదికగా జరిగే ఈ టోర్నీలో 'సి' జట్టు తరఫున 17 ఏళ్ల అన్వయ్ పాల్గొంటున్నాడు. టాపార్డర్ బ్యాటర్, వికెట్ కీపర్‌గా అన్వయ్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఆరోన్ జార్జ్ జట్టు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఏ, బి, సి, డి జట్లు పోటీపడే ఈ టోర్నీ 11న ముగియనుంది. కాగా, ద్రవిడ్ పెద్ద కుమారుడు సమిత్.. మహారాజా టీ20 కేఎస్‌సీ ట్రోఫీలో ఆడిన తెలిసిందే.



గూడ్స్, ప్యాసింజర్ రైళ్ల ఢీ

8 మంది మృతి.. 14 మందికి గాయాలు 10

ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ వద్ద ప్రమాదం

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 5-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 217 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్


రోడ్లపై గుంతలుంటేనే..

వాహనాలు మెల్లగా వెళ్తాయి.. ప్రమాదాలు జరగవు

ఎంత మంచిగుంటే.. అంత ఎక్కువగా ప్రమాదాలు

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలు 12

బస్సు ప్రమాదానికి బీఆర్ఎస్సే కారణమని ధ్వజం



అగ్రవర్ణాల గుప్పిట్లో సైన్యం

10 శాతం ఉన్న వారు.. సైన్యాన్నీ నియంత్రిస్తున్నారు

ఎన్నికల ప్రచారంలో రాహుల్ వివాదాస్పద వ్యాఖ్యలు

గతంలోనూ సైన్యంపై వ్యాఖ్యలు.. సుప్రీం చీవాట్లు 10

మోదీది నకిలీ డిగ్రీ.. ప్రచారంలో రాహుల్ విమర్శలు



పేదలను ఓటేయనీయొద్దు

పోలింగ్ బూత్ వరకు రాకుండా అడ్డుకోండి 10

జేడీయూ నేత, కేంద్రమంత్రి లలన్ సింగ్ వ్యాఖ్య

సోషల్ మీడియాలో వైరల్.. పోలీసు కేసు నమోదు

వివరణ ఇవ్వాలంటూ కేంద్రమంత్రికి ఈసీ నోటీసులు





జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని శ్రీరాంనగర్‌లో నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

కుమ్మక్కయ్యారు

ఫార్ములా-ఈ కేసులో కేటీఆర్ అరెస్టుకు అనుమతివ్వరేం?

కాళేశ్వరం కేసు సీబీఐకి ఇస్తే 48 గంటల్లో అరెస్టన్నరు?

కేసీఆర్, హరీశ్‌లను పోలింగ్ లోగా అరెస్టు చేస్తారా?

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్

ఎప్పటికైనా బీఆర్ఎస్ బీజేపీలో విలీనమయ్యేదే

మీరు ఆత్మహత్య చేసుకొని బీఆర్ఎస్‌ను గెలిపించే కుట్ర

బీజేపీ నాయకత్వంపై విరుచుకుపడ్డ ముఖ్యమంత్రి

పదేళ్లు మునిసిపల్ మంత్రిగా ఉన్న చెత్తనాకొడుకు

హైదరాబాద్‌లో చెత్త గురించి మాట్లాడుతున్నడు

రోజంతా చెత్తకుండీ దగ్గర కట్టేస్తే తెలుస్తుంది

ఎన్నికల తర్వాత జూబ్లీహిల్స్‌కు 4 వేల ఇందిరమ్మ ఇళ్లు

30 వేల మెజారిటీతో గెలుస్తాం.. రోడ్డు షోలో రేవంత్

హైదరాబాద్ సిటీ, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్, బీజేపీల మధ్య చీకటి ఒప్పందం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేసీఆర్‌కు లొంగకపోతే, రెండు పార్టీల మధ్య ఫెవికాల్ బంధం లేకపోతే జూబ్లీహిల్స్ పోలింగ్ తేదీలోగా కాళేశ్వరం కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, కేసీఆర్, హరీశ్‌లను అరెస్టు చేయాలని సవాల్ విసిరారు. ఫార్ములా-ఈ కారు రేసు వ్యవహారంలో 50 కోట్ల రూపాయలు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో కంపెనీ నుంచి వసూలు చేశారని, ఆధారాలతో సహా ఏసీబీ కేసు కట్టి కేటీఆర్‌ను అరెస్టు చేయడానికి

మిగతా 11వ పేజీలో...

కాంగ్రెస్ అలర్ట్!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సీఎం 7

పార్టీ నేతలకు దిశానిర్దేశం

ప్రచార సరళిపై అధిష్ఠానం ఆరా!

ఈ వారం రోజులూ క్షేత్రంలోనే మంత్రులు, ముఖ్యనాయకులు

వంద మంది ఓటర్లకో ఇన్‌చార్జి

మహిళా ఓటర్ల బాధ్యత మీనాక్షి ఏడుగురు మహిళా నేతలకు

అజారుద్దీన్‌కు మైనారిటీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ 12

శాఖలు కేటాయిస్తూ ఉత్తర్వులు



నా బెంచ్‌ను తప్పించుకొనే

ఎత్తుగడ!

విచారణ చివరలో విస్తృత ధర్మాసనాన్ని కోరడమా?

కేంద్ర ప్రభుత్వంపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ఆగ్రహం

వాదనలు ముగించాకే నిర్ణయం తీసుకుంటానని స్పష్టీకరణ

ట్రైబ్యునల్స్ సంస్కరణల చట్టంపై విచారణ 7కు వాయిదా

న్యూఢిల్లీ, నవంబరు 4: కేంద్ర ప్రభుత్వం తన ధర్మాసనం నుంచి తప్పించుకోవాలని చూస్తోందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. కేసు తుది వాదనలు వినడానికి సిద్ధమైన తర్వాత కేంద్ర ప్రభుత్వం ఐదుగురు సభ్యుల విస్తృత ధర్మాసనం విచారణను కోరుకోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం-2021 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లో పిటిషనర్ వాదనలు విన్న తర్వాత విస్తృత ధర్మాసనాన్ని కోరడమంటే ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని తప్పించుకొనే ఎత్తుగడేనని అభిప్రాయపడ్డారు. జస్టిస్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం మద్రాస్ బార్ అసోసియేషన్ దాఖలు చేసిన కేసులో వాదనలు వింది. ఈ సందర్భంగా అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి విస్తృత ధర్మాసనాన్ని కోరుతూ దరఖాస్తు చేశామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి ఎత్తుగడలకు పాల్పడుతుందని మేం ఊహించలేదు అని మరో 20 రోజుల్లో పదవీ విరమణ చేస్తున్న సీజేఐ అన్నారు. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం

మిగతా 10వ పేజీలో...

‘సిగాచి’ మృతులకు రూ.కోటి ఇచ్చారా?

ప్రమాద బాధ్యులను అరెస్టు చేయలేదేం?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

నిపుణుల కమిటీ నివేదికపై 2 వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయండి 12

బాధితులకు ఇప్పటిదాకా చెల్లించిన పరిహారం వివరాలను తెలియజేయండి

సర్కారును ఆదేశించిన న్యాయస్థానం

తదుపరి విచారణ 27కు వాయిదా

ఎస్ఎల్‌బీసీ సొరంగానికి..

టైగర్ రిజర్వ్ అడ్డంకి లేనట్టే!

న్యూ ఆస్ట్రేయిన్ విధానంలో తవ్వకం.. 4 మీటర్ల వరకే బ్లాస్టింగ్ వేవ్స్ పరిమితం

పని ప్రారంభించాకే.. ఆడిట్ ఏర్పాటుపై స్పష్టత.. షీర్ జోన్ ఉంటే క్రాస్ సెక్షన్ చేసుకొని టన్నెల్ తవ్వకాన్ని పూర్తిచేసే దిశగా కసరత్తు: నిపుణులు.. వారంలో సర్వే పూర్తి.. తర్వాత15 రోజుల్లో నివేదిక





సర్వే హెలికాప్టర్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (ఫైల్)

మహబూబ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పర్యావరణానికి, జంతుజాలానికి, టైగర్ రిజర్వ్ సమతుల్యతకు ఎలాంటి ఆటంకాలూ లేకుండానే శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌ను పూర్తిచేయవచ్చని ప్రభుత్వం నియమించిన నిపుణులు చెబుతున్నారు. రెండేళ్ల వ్యవధిలో ప్రాజెక్టును పూర్తిచేయవచ్చని వారు పేర్కొంటున్నారు. ఈ టన్నెల్‌ను ప్రారంభించినప్పుడు టీబీఎం (టన్నెల్ బోరింగ్ మిషన్) పద్ధతిలో చేపట్టిన సంగతి తెలిసిందే. ఏళ్ల తరబడి పనులు నిలిచిపోవడం, భూపొరల్లో వచ్చిన మార్పుల కారణంగా ఈ ఏడాది పనులు పునఃప్రారంభించిన సమయంలో టన్నెల్ కూలిపోయి ఎనిమిది మంది కార్మికులు చనిపోయారు. టీబీఎం కూడా పూర్తిగా ధ్వంసమైంది. మిగిలిన 9 కిలోమీటర్లనూ పూర్తిచేస్తే 3 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడంతో పాటు.. పైసా ఖర్చు లేకుండా 30 టీఎంసీల వరకూ నీటిని తీసుకోవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. కానీ.. టీబీఎం పద్ధతిలో టన్నెల్ పూర్తిచేయడానికి వీలు లేదు కాబట్టి.. డీబీఎం (డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్) పద్ధతిలో చేయాలని నిర్ణయించింది. అయితే టన్నెల్ ఉన్న ప్రాంతం మొత్తం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో ఉండటం, భూ పొరల్లో మార్పుల వల్ల షీర్ జోన్లు ఇంకా ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియకపోవడంతో.. దేశంలోనే తొలిసారి

మిగతా 12వ పేజీలో...

డాక్టర్ డ్రగ్స్ దందా

మత్తుకు బానిసై స్నేహితులతో కలిసి వ్యాపారం 9

రూ.3 లక్షల విలువైన మాదక ద్రవ్యాలు స్వాధీనం

వైద్యుడి అరెస్టు, పరారీలో మరో ముగ్గురు

గచ్చిబౌలిలో డ్రగ్స్ పార్టీ భగ్నం

నైజీరియన్ సహా 11మంది అరెస్టు.. రూ.6లక్షల డ్రగ్స్ సీజ్

ఈ వేదన తీరనిది!

ప్రమాద ఘటన నుంచి తేరుకోలేకపోతున్న బాధితులు

సొంతూళ్లలో బస్సు ప్రమాద మృతుల అంత్యక్రియలు

ముగ్గురు కూతుళ్ల మాటను తల్లి విని ఉంటే బతికేవారే

ప్రమాదానికి ముందు రోజే వెళ్తామంటే.. మర్నాడు వెళ్లండంటూ ఆపిన తల్లి.. ప్రమాదంలో ముగ్గురూ మృతి

డ్రైవర్ వెనక సీట్లో కాకుండా నాపక్కనే కూర్చుంటే బతికేదేమో.. భార్య మృతిని తట్టుకోలేకపోతున్న ఓ భర్త

బస్సు ప్రమాదంపై నివేదిక ఇవ్వండి

ప్రభుత్వశాఖలకు టీహెచ్ఆర్‌సీ ఆదేశాలు 8

బాధితులకు పరిహారం పంపిణీ

19 మంది మృతులకు 7 లక్షల చొప్పున సాయం

ఓ కుటుంబానికి చెక్కు అందజేసిన స్పీకర్ 8

తనవంతుగా రూ.లక్ష ఇచ్చిన ప్రసాద్‌కుమార్

హైదరాబాద్-బీజాపూర్ రహదారి విస్తరణ షురూ

రాయదుర్గంలో డ్యుయిష్ బోర్స్ జీసీసీ

రెండేళ్లలో వెయ్యి ఉద్యోగాలు

జర్మనీ కాన్సుల్ జనరల్ వెల్లడి

మరిన్ని పెట్టుబడులు పెట్టాలని సీఎం రేవంత్ విజ్ఞప్తి 12

స్థానిక యువతకు జర్మన్ భాష నేర్పించాలని సూచన

సీఎం రేవంత్‌రెడ్డితో అమెజాన్ వెబ్ సర్వీస్ ప్రతినిధుల భేటీ

‘ఫీజు’పై సిఫారసులకు కమిటీ

15 మందితో ఉన్నతస్థాయి కమిటీ నియామకం

చైర్మన్‌గా సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

సభ్యులుగా కంచ ఐలయ్య, కోదండరాం, ఫాతీ ప్రతినిధులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి ట్రస్ట్ బ్యాంకు ఏర్పాటుకు

ఉన్నత విద్యను మెరుగుపరచడానికి సిఫారసులు

మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని సర్కారు ఆదేశాలు 7

రెండోరోజూ కాలేజీలు బంద్ 7

రూ.450 కోట్లిస్తాం.. సమ్మె ఆపాలన్న అధికారులు

సగం బకాయిలిస్తేనే: ఫాతీ

కాలేజీలకు తాళాలతో విజిలెన్స్ అధికార్లు వెనక్కి

అకాల వర్షం.. ఆగమాగం

మార్కెట్లలో తడిసిన పత్తి, మక్కలు 9

అధికంగా తరుగు తీసి కొన్న వ్యాపారులు

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో జోరు వాన



కరీంనగర్ జిల్లా సిర్సపల్లిలో నీళ్లలో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుకుంటున్న రైతు దంపతులు

రెండో పెళ్లి చేసుకోవాలంటే మొదటి భార్య వాదన వినండి

ఆమె అభిప్రాయం తెలుసుకున్న తర్వాతే రిజిస్టర్ చేయండి

ముస్లిం వివాహాలపై కేరళ హైకోర్టు సూచన

10



గోపీచంద్ హిందూజా కన్నుమూత 10

లండన్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన హిందూజా గ్రూప్ చైర్మన్

భారతీయులకు కెనడా మొండిచెయ్యి!

ప్రతి నలుగురిలో ముగ్గురు విద్యార్థుల వీసాలు తిరస్కరణ

తాత్కాలిక వీసాలనూ గంపగుత్తగా రద్దు చేసే యోచన 10



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రోదసీలో ఆత్మనిర్భరత

ఇస్రో చరిత్రలో అత్యంత బరువైన నాలుగువేల నాలుగు వందల పదికిలోల కమ్యూనికేషన్ శాటిలైట్ నిర్దేశిత కక్ష్యలోకి దిగ్విజయంగా ప్రవేశించింది. భారత నౌకాదళ సమాచార అవసరాలు తీర్చడానికి ఉద్దేశించిన ఈ అత్యాధునిక ఉపగ్రహాన్ని జియో సింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి ప్రవేశపెట్టడానికి ఎప్పటిలాగానే బాహుబలి రాకెట్ వాహనమైంది. చంద్రయాన్ 3లో వాడిన లాంచ్ వెహికల్ మార్క్–3ని సాంకేతికంగా మరిన్ని మెరుగులు దిద్ది, శక్తిని సైతం మరో పదిశాతం పెంచి ఈమారు వినియోగించారు. నలభైమూడున్నర మీటర్ల ఎత్తున్న ఈ వాహక నౌకకు ఇది ఐదో ప్రయాణం. రాబోయే రోజుల్లో మానవసహిత అంతరిక్ష యాత్రలకు ఈ రాకెట్‌నే వాడబోతున్నందున ఈ ప్రయోగం అనేక కారణాల రీత్యా కీలకమైనది. అత్యంత బరువైన ఉపగ్రహాల ప్రయోగానికి ఇతరదేశాల ప్రైవేటు సంస్థలపై ఆధారపడుతున్న నేపథ్యంలో ఈ ఆత్మనిర్భరత ప్రశంసనీయమైనది.

పన్నెండేళ్ళక్రితం ఫ్రెంచ్ గయానానుంచి ప్రయోగించిన జీశాట్ 7 కాలపరిమితి ముగియడంతో దానిస్థానంలో మరింత ఆధునికమైన, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ కొత్త ఉపగ్రహం వచ్చి చేరింది. మరో పదేళ్ళపాటు సువిశాల భారతీయ తీరప్రాంతాన్ని కాపలాకాయడంలో మన నౌకాదళానికి తన సమర్థవంతమైన, వేగవంతమైన సేవలతో సహకరించబోతోంది. భారీ ఉపగ్రహాన్ని భద్రంగా దాచుకున్న ఓ అతిభారీ రాకెట్ శ్రీహరికోట సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ నుంచి నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకుపోయిన ఈ దృశ్యాలు చూసినవారికి 1960లలో మన శాస్త్రవేత్తలు సైకిల్ మీద ఒక రాకెట్ విడిభాగాన్ని మోసుకుపోతున్న అలనాటి బ్లాక్ అండ్ వైట్ చిత్రం గుర్తుకు వచ్చేవుంటుంది. 1963లో తిరువనంతపురం సమీపంలోని తుంబా ప్రయోగక్షేత్రం నుంచి ఏడువందల పదమూడు కేజీల బరువున్న రాకెట్ ఓ ముప్పైకేజీల పేలోడ్‌ని రెండువందల ఏడు కిలోమీటర్ల ఎత్తు వరకూ మోసుకుపోవడంతో ఈ ప్రయాణం ఆరంభమైంది. చిన్నచిన్న అడుగులతో ప్రస్థానం కొనసాగి జీఎస్ఎల్వీవంటి భారీ రాకెట్‌తో, తరువాత దానిని సైతం పలు రీతుల్లో ఆధునికీకరించుకుంటూ దేశం చేసిన సాహసాలు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.

ఎడ్లబండి మీద ఉపగ్రహాన్ని తీసుకుపోయిన కాలంనుంచి అంతరిక్షకేంద్రం నిర్మాణానికి నడుంబిగించడం వరకూ సాగిన 'ఇస్రో' ప్రస్థానం మనసు పులకింపచేస్తుంది. బడ్జెట్ కేటాయింపుల్లో పాలకులు ప్రదర్శించే కాపీనాన్నీ తట్టుకొని నిలిచి, తనకు ఇచ్చినదానితోనే అనేకానేక ప్రయోగాలు చేసింది. ఆంగ్లచిత్రాలకంటే తక్కువ ఖర్చుతో అంతరిక్షయాత్రలు చేసివస్తోంది. గగనయానాలు, చంద్రయానాలు, సూర్యనమస్కారాలు, అంగారక అధ్యయనాలతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తోంది. ఒకేమారు వంద ఉపగ్రహాలను విభిన్నమైన కక్ష్యల్లోకి వెదజల్లగలిగే సమర్థతను పెంచుకుంది. శతాధిక రాకెట్ ప్రయోగాలతో ఐదువందల యాభై ఉపగ్రహాలను నింగికి చేర్చింది. విదేశీ ఉపగ్రహ ప్రయోగ వ్యాపారం చేస్తూ దేశానికి సంపాదించిపెడుతోంది. అంతరిక్షంలో రెండుఉపగ్రహాలను అనుసంధానించి, మళ్ళీ విడదీసిన స్పేడెక్స్ ప్రయోగం సాంకేతిక అద్భుతమే కాదు, అంతరిక్ష కేంద్రం నిర్మాణం కలను సాకారం చేయడంలో మరో అడుగు. నేడు అగ్రరాజ్యాల సరసన దేశం తలెత్తుకొని నిలబడటంలో సోవియట్ యూనియన్ సహకారం విస్మరించలేనిది. తదనంతరం ఆ సహకారానికీ, పరిజ్ఞానం బదలాయింపుకీ అడ్డుపడిన అమెరికా మనను పెట్టిన కష్టాలు ఎప్పటికీ విస్మరించలేనివి.

భారతదేశం నుంచి రోదసీలోకి వెళ్ళబోతున్న గగన్‌యాన్ వ్యోమగాములు నలుగురిని ప్రధాని మోదీ గత ఏడాది దేశానికి పరిచయం చేస్తూ, నలభైయేళ్ళ తరువాత భారతీయులు అంతరిక్షంలోకి వెడుతున్నారు అని ఓ మాటన్నారు. మంచి గతాన్ని స్మరించడం మోదీకి ఇష్టం ఉండదు కానీ, ప్రజలకు మాత్రం రాకేశ్ శర్మ అంతరిక్షయానం, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రశ్నకు 'సారే జహాసే అచ్ఛా' అంటూ అతడిచ్చిన సమాధానం గుర్తుకొచ్చాయి. నలుగురు వీరులను అంతరిక్ష యాత్రకు సిద్ధం చేసే క్రమంలో మొన్న జూన్‌లో శుభాంశు శుక్లా రోదసిలో కాలూనిన రెండవ భారతీయుడుగా, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో అడుగిడిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించాడు. 'నాసా'కు ఆరువందలకోట్లు చెల్లించి మరీ ఈ యాక్సియం4 యాత్రలో పాలుపంచుకున్న శుక్లాకు లభించిన అనుభవం, నైపుణ్యం భారత భవిష్యత్ అంతరిక్ష యాత్రలకు ఉపకరిస్తుంది. మరో పదేళ్ళలో సొంత అంతరిక్ష కేంద్రం కట్టుకోవాలని, మరో పన్నెండేళ్ళకు చంద్రుడిమీద మన వ్యోమగాములు కాలూనాలని లక్ష్యాలు పెట్టుకొని దేశాన్ని స్పేస్ సూపర్‌పవర్‌గా తీర్చిదిద్దుతున్నందుకు ఇస్రోను అభినందించాలి.

జేపీ, లోహియా ప్రభావం కోల్పోని బిహార్



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

ఒకరు తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని అక్బర్‌పూర్‌కు చెందిన బనియా. మరొకరు తూర్పు ఉత్తరప్రదేశ్, బిహార్‌ల మధ్య ఉండే సితాబ్దియారాకు చెందిన కాయస్థుడు. ఇద్దరూ 20వ శతాబ్ది ప్రథమార్థంలో విదేశాలకు వెళ్లి చదువుకున్నారు. తిరిగి వచ్చి కాంగ్రెస్ గొడుగు క్రింద స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ శిష్యులుగా కాంగ్రెస్‌లోని సోషలిస్టు శిబిరంలో కొనసాగారు. ఇరువురూ తర్వాత నెహ్రూకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ఒకరు రామ్ మనోహర్ లోహియా, మరొకరు జయప్రకాశ్ నారాయణ్.

లోహియా జర్మనీలో చదువుకున్నారు. అమెరికాలోనూ, యూరప్‌లోనూ జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడారు. వెనుకబడిన వర్గాలకు రాజకీయ అధికారం, పాలనలో 60 శాతం వాటా కావాలని ఆయన అప్పుడే ప్రతిపాదించారు. పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకించారు. మార్క్సిజమూ ఆయనకు నచ్చలేదు. దేశీయ సోషలిజాన్ని అన్వయించుకుని సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం పోరాడారు. ప్రభుత్వాలు ప్రజలకు పాలకులుగా కాకుండా సేవకులుగా ఉండాలన్నారు. అధికార వికేంద్రీకరణ కోరుకున్నారు. ఇంగ్లీషును సామ్రాజ్యవాద భాషగా అభివర్ణించారు. గోవా విముక్తికై పోరాడి అరెస్టయ్యారు. సోషలిస్టు పార్టీ సభ్యుడిగా లోక్‌సభలో రైతుల సమస్యలపై గళమెత్తారు. కోట్లాది భారతీయులు కేవలం మూడణాల ఆదాయంపై జీవిస్తున్నారని ఎలుగెత్తారు. ఆయన కృషి వల్లే 1967లో ఏడు ఉత్తరాది రాష్ట్రాల్లో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. జయప్రకాశ్ నారాయణ్ ఉన్నత విద్యాభ్యాసానికి అమెరికాలోని విస్కాన్సిన్ విశ్వవిద్యాలయానికి వెళ్లారు సామాజిక శాస్త్రాలను అధ్యయనం చేశారు. మార్క్స్, ఎంగెల్స్ సిద్ధాంతాలను అధ్యయనం చేసి కమ్యూనిస్టుగా మారారు. భార్య ప్రభావతి ప్రభావంతో గాంధేయవాదిగా మారి కాంగ్రెస్ కార్యకలాపాల్లో పాలు పంచుకున్నారు. 1970లలో పోటెత్తిన కాంగ్రెస్ వ్యతిరేక ప్రభంజనంలో ఆయన కాంగ్రెసేతర శక్తులన్నిటికీ నాయకుడుగా మారి సంపూర్ణ విప్లవానికి పిలుపునిచ్చారు. ఎమర్జెన్సీ అనంతరం తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం అధికారంలోకి రావడం ఆయన ఉద్యమ స్ఫూర్తి వల్లే సాధ్యమయింది.

లోహియా, జయప్రకాశ్ ఇరువురూ అధికారానికి వెంపర్లాడలేదు. ఎన్నడూ ఏ మంత్రి పదవినీ ఆశించ లేదు. సోషలిస్టు సమాజ స్వప్నం నెరవేరకుండానే లోహియా 1967లో మరణించారు. తాను కారకుడైన కాంగ్రెసేతర జనతా ప్రభుత్వం అధికార కుమ్ములాటల్లో కుప్పకూలిపోతుంటే జయప్రకాశ్ విషాదగ్రస్తుడై మరణించారు. బిహార్‌లోనూ, ఉత్తరప్రదేశ్‌లోనూ ఇవాళ వెనుకబడిన వర్గాల ప్రాబల్యం విస్మరించలేని స్థానంలో ఉండేందుకు లోహియా, జేపీ నిర్మించిన పునాదులే కారణం. లాలూప్రసాద్ యాదవ్, నితీశ్ కుమార్ ఆ మహానాయకుల ప్రభావంతో ఎదిగిన వారే. ఆ ఇరువురు లోహియా స్కూలులో చదువుకుని జేపీ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ పొందారని సంకర్షణ్ ఠాకూర్ అనే సీనియర్ జర్నలిస్టు 'బ్రదర్స్ బిహారీ' అనే పుస్తకంలో రాశారు. దేశ రాజకీయాల్లో లాలూ, నితీశ్ నిర్వహించిన పాత్ర తక్కువేమీ కాదు. బిహార్‌లో కాంగ్రెస్‌ను దెబ్బతీసే క్రమంలో ఇరువురూ కీలకపాత్ర పోషించారు. జాతీయ స్థాయిలో సంకీర్ణ ప్రభుత్వాలు తమ మద్దతు లేకుండా ఏర్పడని పరిస్థితి కల్పించారు. లాలూతో విభేదాల వల్ల నితీశ్ వేరుపడి బీజేపీతో చేతులు కలిపినప్పటికీ ఇరువురూ బిహార్ రాజకీయాల్లో ఇప్పటికీ తమ ప్రాబల్యం కోల్పోలేదు.

భారతీయ జనతా పార్టీ ఇవాళ కేంద్రంలో నితీశ్ మద్దతుపై ఆధారపడి కొనసాగుతుండడమే కాక బిహార్‌లో ఆయన లేకుండా పోటీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. నితీశ్ తన మనుగడ కోసం బిహార్‌లో బీజేపీ ప్రవేశానికి చేయూతనిస్తే, లాలూప్రసాద్ యాదవ్ బిహార్‌లో ఆ పార్టీ ప్రవేశాన్ని, ప్రభావాన్నీ అడ్డుకునేందుకు తీవ్ర యత్నం చేశారు. కేంద్రంలో పది సంవత్సరాలు యూపీఏ ప్రభుత్వం కొనసాగేందుకు దోహదం చేశారు. ఇప్పుడు తన కుమారుడు తేజస్వి వెనుక ఒక కొండలా నిలుచున్న లాలూ ప్రభావాన్ని తక్కువ అంచనా వేసేందుకు వీలు లేదు. ఒక రకంగా చెప్పాలంటే లాలూ, నితీశ్ ఇద్దరూ బిహార్‌లో వెనుకబడిన వర్గాలు రాజకీయ ప్రాభవం కోల్పోకుండా, జాతీయ పార్టీలు తమ మీద ఆధారపడి ఉండేందుకు కారణమవుతున్నారు. అంతే కాదు, ఎన్నికల అనంతరం ఆర్‌జేడీ, జేడీ(యు) చేతులు కలిపితే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగిన పరిస్థితి దాదాపు ప్రతి ఎన్నికల ఫలితాల అనంతరం కనపడుతుంది. ఆ రకంగా లోహియా, జేపీల వారసత్వాన్ని కొనసాగిస్తున్నట్లేనని అర్థమవుతోంది. నిజానికి వాజపేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే నితీశ్‌ను గుర్తించి ఆయనను ముఖ్యమంత్రిగా చేసేందుకు వీలు కల్పించారు. ఆ పరిస్థితి లాలూకు వీపీ సింగ్ హయాంలోనే లభించింది. 29వ ఏట లోక్‌సభ సభ్యుడైన అయిన లాలూ 42 సంవత్సరాల వయస్సులో ముఖ్యమంత్రి అయ్యారు.

> మధుబనిలో మోదీ కండువా ఊపినా, బెగుసరాయ్ చెరువులో రాహుల్ దూకినా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ కలిపి వంద సీట్లు అధిగమిస్తాయో లేదో చెప్పలేని పరిస్థితి. సిద్ధాంతాలకు అతీతంగా వెనుకబడిన, మైనారిటీ వర్గాల మనసుల్లో ఆలోచనలను ప్రతిఫలింపజేసే ఏకైక రాష్ట్రం బిహార్. ఆ ఘనత లోహియా, జేపీలకే దక్కుతుందనడంలో అతిశయోక్తి లేదు.



ఈ నేపథ్యంలో 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికలను అర్థం చేసుకోవల్సి ఉంటుంది. నితీశ్, లాలూ పార్టీలు తమ ప్రాధాన్యాన్ని అదే విధంగా కొనసాగిస్తారా లేదా అన్నదే ఈ ఎన్నికల ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. 74 సంవత్సరాల నితీశ్ సంపూర్ణ ఆరోగ్యంతో లేకపోవచ్చు గానీ, ఆయన ప్రాధాన్యం కోల్పోయిన నాయకుడు ఎంతమాత్రం కాదు. మెజారిటీ పరిశీలకులు ఆయన ప్రభుత్వం పట్ల ప్రజా వ్యతిరేకత లేదని విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు అత్యధిక సంఖ్యలో మద్దతునిస్తున్నారు. విద్యార్థినులకు సైకిల్ పంపిణీ పథకం ఆయనకు మంచి పేరు తెచ్చింది. నితీశ్ ఆరోగ్యం పట్ల ఏ వ్యతిరేక ప్రచారం జరిగినా, ఆయనను ఈ సారి బీజేపీ ముఖ్యమంత్రి చేయబోదన్న అభిప్రాయం వ్యాప్తి చెందినా అది ఆయన పట్ల సానుభూతికే దారితీస్తున్నదని ఒక అంచనా. ఏ విధంగానైనా తాను పోటీ చేసిన సీట్లలో కనీసం సగం సీట్లు, అంత కంటే ఎక్కువ సీట్లు గెలుచుకునే శక్తి నితీశ్‌కు ఉన్నదని చెప్పేందుకు ఆస్కారం ఉన్నది. ఇక ఆర్‌జేడీ పట్ల కూడా గడచిన రెండు ఎన్నికల్లో వ్యతిరేకత అంతగా కనపడలేదు. 2015లో 80, 2020లో 75 సీట్లు గెలుచుకున్న ఆర్‌జేడీ అన్ని పార్టీల కంటే ముందంజలోనే ఉన్నది. ఈ సారి కూడా దాదాపు అన్నే సీట్లు, లేదా అంతకంటే ఎక్కువ సీట్లు వచ్చే అవకాశాలు లేకపోలేదని చెబుతున్నారు. పైగా గతంలో కంటే ఇప్పుడు తేజస్వి ప్రాబల్యం, ఆదరణ పెరిగిందని పార్టీ వర్గాల భావిస్తున్నాయి. ఈ రీత్యా ఇప్పుడు కూడా అసెంబ్లీలో మెజారిటీ సీట్లు జేడీ(యు), ఆర్‌జేడీలే గెలుచుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అంటే బిహార్‌లో ఈ ఎన్నికల్లో కూడా వెనుకబడిన వర్గాల ప్రాధాన్యత పెద్దగా తగ్గకపోవచ్చు. అయితే లాలూ, నితీశ్ పార్టీలలో దేనికి ఎక్కువ సీట్లు లభిస్తాయన్నదే కోటి రూకల ప్రశ్న.

ఈ ఎన్నికల్లో బిహార్‌లోని 243 సీట్లలో బీజేపీ 101 సీట్లకు, కాంగ్రెస్ 61 సీట్లకు మాత్రమే పోటీ చేస్తున్నాయి. దీన్నిబట్టి ఆ రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్‌ల ప్రాధాన్యత ఎంత మేరకు ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రధాన లక్ష్యం బిహార్‌లో బీజేపీ పోటీ చేసిన సీట్లలో మెజారిటీ సీట్లు సాధించడమే. జేడీ(యు), ఆర్‌జేడీలు సాధించిన వాటి కంటే ఎక్కువ సీట్లు సాధించి ప్రథమ స్థానం సాధించేందుకు బిహార్‌లో ఆయన విస్తృతంగా పర్యటిస్తున్నారు. గత ఎన్నికల్లో ఆయన బీజేపీని 74 సీట్లతో తన లక్ష్యానికి దాదాపు చేరువలోకి తీసుకువచ్చేందుకు కారకుడయ్యారు. ఇప్పుడు బిహారీ ప్రజలు బీజేపీని ఎంతవరకు ఆదరిస్తారనే విషయమై విస్తృతంగా చర్చ జరుగుతోంది. అక్కడ బీజేపీని గెలిపించేందుకు పలుకుబడి గల స్థానిక నాయకుడు ఎవరూ లేరు. ప్రతి సీటులోను బీజేపీ గెలుపు మోదీపైనే ఆధారపడి ఉంటుంది. రాష్ట్ర అధికార యంత్రాంగం ఆయనకు అండగా ఉన్నది. 2020 ఎన్నికల్లో దాదాపు 52 సీట్లు కేవలం వేయి ఓట్ల తేడాతో నిర్ణయమయ్యాయి. వీటిలో అత్యధిక సీట్లు ఎన్డీఏ కూటమికి చెందినవే. అంతేకాక ఈ సారి దాదాపు 15 సీట్లలో స్వతంత్ర అభ్యర్థులు గెలిచే అవకాశాలున్నాయి. వీరిలో అన్ని పార్టీలకు చెందిన తిరుగుబాటు అభ్యర్థులు ఉన్నారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం ఏర్పాటులో వీరు కీలక పాత్ర పోషించవచ్చు.

కాంగ్రెస్ 61 సీట్లకు పోటీ చేస్తున్నప్పటికీ దాదాపు 9 సీట్లలో స్నేహపూర్వక పోటీ జరుగుతున్నందువల్ల 52 సీట్లలోనే పోటీ చేస్తున్నట్లు లెక్క. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ సభలకు జనం హాజరవుతున్నప్పటికీ వాటిని ఓట్లుగా మార్చే యంత్రాంగం కాంగ్రెస్‌కు లేదనే చెప్పుకోవాలి. దళితుడిని బిహార్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిని చేయడం ద్వారా దళిత ఓట్లను ఆకర్షించే ప్రయత్నం చేశామని, ముస్లింల ఓట్లను తమ వైపు తిప్పుకునేందుకు బలమైన ప్రయత్నాలు చేశామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అందువల్ల ఈ సారి సగం సీట్లయినా కాంగ్రెస్ గెలుచుకోగలిగితేనే ఆ పార్టీ తన ప్రభావం నిలుపుకోగలుగుతుంది. విచిత్రమేమంటే మొదటి దశ పోలింగ్‌కు ప్రచార ఘట్టం ముగిసినప్పటికీ మహాఘట్‌బంధన్, ఎన్డీఏల మధ్య గట్టి పోటీ కొనసాగుతోందని. ప్రజలు ఎటు వైపు మొగ్గుతున్నారో తేలని పరిస్థితి ఉన్నదని నివేదికలు చెబుతున్నాయి. మధుబనిలో మోదీ కండువా ఊపినా, బెగుసరాయ్ చెరువులో రాహుల్ దూకినా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ కలిపి వంద సీట్లు దాటుతాయో లేదో చెప్పలేని పరిస్థితి. సిద్ధాంతాలకు అతీతంగా వెనుకబడిన, మైనారిటీ వర్గాల మనసుల్లో ఆలోచనలను ప్రతిఫలింపజేసే ఏకైక రాష్ట్రం బిహార్. ఆ ఘనత లోహియా, జేపీలకే దక్కుతుందనడంలో అతిశయోక్తి లేదు.

(ఆంధ్రజ్యోతి డిల్లీ ప్రతినిధి)

కేంద్రం 'తీపి' కబురులో పెన్షనర్లకు దాగున్న చేదు!

ఈ ఏడాది జనవరిలో జరిగిన ఢిల్లీ ఎన్నికల సందర్భంగా 'కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ సంఘం నియమిస్తా'మని ప్రకటించిన కేంద్రం, ఎట్టకేలకు బిహార్ ఎన్నికల ముందు దీన్ని నియమించింది. ఈ ఎనిమిదవ వేతన సవరణ సంఘానికి విధివిధానాలనూ ఖరారు చేసింది. 'కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇది తీపి కబురు' అంటూ మీడియా ఊదరగొడుతున్నది. కానీ నిజానికి పెన్షనర్లకు సంబంధించి ఇది చేదు వార్తే! కేంద్రం ఖరారు చేసిన విధివిధానాలను అనుసరించే ఈ ఎనిమిదవ వేతన సంఘం నివేదిక తయారవుతుంది. ఈ విధివిధానాలలోని మూడవ అంశం అతి ప్రమాదకరమైంది. దీని ప్రకారం 'నాన్ కంట్రిబ్యూటరీ' (ఉద్యోగి విరాళం లేని) 'అన్ ఫండెడ్' (నిధులు సమకూర్చబడని) పెన్షన్ పథకాలకు అయ్యే వ్యయాన్ని లెక్కగట్టి దానికి అనుగుణంగా సిఫారసులు చేయాలన్నారు. ఏప్రిల్ 1, 2004 కంటే ముందు ఉద్యోగంలో చేరి, జనవరి 1, 2026 కంటే ముందు రిటైర్ కాబోయే వారికి ఇది వర్తిస్తుంది.

ఉద్యోగి తన వేతనంలోంచి కొంత భాగాన్ని భవిష్యత్తులో రాబోయే పెన్షన్ కోసం విరాళంగా జమ చేసే పద్ధతి మన దేశంలో 2004 తర్వాత మొదలైంది. అప్పటిదాకా ప్రభుత్వాలు తమ వార్షిక బడ్జెట్‌లలో ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల కోసం నిధులు కేటాయించేవారు. 'మీ వేతనంలోంచి మీరు కొంత ఇవ్వండి, ప్రభుత్వం కొంత ఇస్తుంది. దాన్ని షేర్ మార్కెట్‌లో పెట్టి, లాభాలొస్తే దాంతో మీకు పెన్షన్ ఇస్తాం' అనే అమానుష వైఖరితో, పెన్షన్ ఇచ్చే బాధ్యత నుంచి తప్పుకునే ప్రక్రియకు 2004లో వాజపేయి ప్రభుత్వం బీజం వేసింది. ఆ పద్ధతినే ఆ తర్వాత వచ్చిన మన్మోహన్‌సింగ్ ప్రభుత్వమూ కొనసాగించింది. మన రాష్ట్రంలో రాజశేఖర రెడ్డి మొదలుకొని, ఈనాడున్న రేవంత్‌రెడ్డి వరకూ ఇదే బాటలో నడుస్తున్నారు.



> మోదీ ప్రభుత్వం 2025 మార్చి 25న పార్లమెంట్‌లో ఆమోదింపజేసుకున్న చట్టంలో '2026 జనవరి 1 కంటే ముందు రిటైర్ అయిన పెన్షనర్లు – ఆ తర్వాత రిటైర్ కాబోయే పెన్షనర్లు' అనే విభజన రేఖ గీసింది. ఎనిమిదవ వేతన సవరణ సంఘం సిఫారసులు ఆ రిటైర్ కాబోయే పెన్షనర్లకు మాత్రమే వర్తించేటట్టు నిర్దేశించింది. అంతకుముందు రిటైర్ అయిన పెన్షనర్లకు మొండి చెయ్యి చూపే అధికారాన్ని చేతుల్లో ఉంచుకుంది. ఎనిమిదవ వేతన సంఘానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలలో మూడవ అంశం దీన్నే సూచిస్తుంది.

ఇప్పుడు మోదీ ప్రభుత్వం ఇంకాస్త ముందుకు వెళ్లి, 2025 మార్చి 25న ఫైనాన్స్ బిల్లుకు అనుబంధంగా పార్లమెంట్‌లో ఒక చట్టాన్ని ఆమోదింపజేసుకుంది. ఆ చట్టంలో '2026 జనవరి 1 కంటే ముందు రిటైర్ అయిన పెన్షనర్లు– ఆ తర్వాత రిటైర్ కాబోయే పెన్షనర్లు' అనే విభజన రేఖ గీసింది. ఎనిమిదవ వేతన సవరణ సంఘం సిఫారసులు ఆ రిటైర్ కాబోయే పెన్షనర్లకు మాత్రమే వర్తించేటట్టు నిర్దేశించింది. అలా అంతకుముందు రిటైర్ అయిన పెన్షనర్లకు మొండి చెయ్యి చూపే అధికారాన్ని చేతుల్లో ఉంచుకుంది. ఎనిమిదవ వేతన సంఘానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలలో మూడవ అంశం దీన్నే సూచిస్తుంది.

దీని ఫలితంగా ధరలు ఎంత పెరిగినా, జీవన ప్రమాణాలు ఎంత ఎత్తుకు చేరుకున్నా, వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలకు ఆసుపత్రి ఖర్చుల భారం ఎంత మోయలేనిదైనా పెన్షనర్ల పెన్షన్ పెరగదు. బొటాబొటీ వచ్చే నెల భత్యంతో జీవితం సాగవలసిందే. ఇంతకుముందు వేతన సవరణ సంఘాలకు ఇచ్చే మార్గదర్శకాలలో, 'ప్రపంచంలోని ఇతర దేశాలలో అమల్లో ఉన్న పెన్షన్ పథకాల్లో ఉత్తమ విధానాలను పరిశీలించి వాటిని మన దేశంలో ప్రవేశపెట్టే విధంగా ఆలోచించండి' అనే సూచన ఉండేది. ఇది సంక్షేమ రాజ్యం అన్న స్పృహ ఈ సూచనలో వ్యక్తమయ్యేది. ఇప్పుడు ఆ మార్గదర్శకాన్ని తొలగించి ఈ మూడవ అంశాన్ని చేర్చింది మోదీ ప్రభుత్వం.

అయితే, ఇదంతా కేంద్ర ప్రభుత్వంలో పనిచేసి పదవీ విరమణ పొందిన పెన్షనర్లకు సంబంధించిన విషయమేననీ, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు సురక్షితమనీ అనుకోవడానికి వీలు లేదు. ఎనిమిదవ వేతన సవరణ సంఘానికి ఇచ్చిన మార్గదర్శకాలలో నాలుగవ అంశంలో– వారు ఇవ్వబోయే సిఫారసుల ప్రభావం రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక స్థితిగతులపై ఏ విధంగా ఉంటుందో కూడా పరిశీలించమని పేర్కొన్నారు. అంటే– కేంద్ర వేతన సంఘం సిఫారసులను రాష్ట్రాలు అనుసరిస్తాయని చెప్పకనే చెప్పారు. 2004లో కేంద్ర ప్రభుత్వం కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం ప్రవేశపెడితే పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాలు తప్ప అన్ని రాష్ట్రాలు ఆ పథకాన్ని తమ ఉద్యోగులకు వర్తింపజేసాయి. ఆ తర్వాత పెన్షనర్ల, ఉద్యోగుల ఒత్తిడికి తలవంచి అయిదారు రాష్ట్రాలు పాత పద్ధతినే అనుసరిస్తున్నాయి.

పెన్షనర్లు ప్రభుత్వానికి భారం అనే పద్ధతిలోనే 2004 నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. పెన్షనర్లంటే అందరూ అరవై ఏళ్ళు దాటిన వృద్ధులు. శ్రమించగలిగిన కాలాన్నంతా ఉద్యోగ జీవితంలోనే గడిపి నెలనెలా వచ్చే వేతనంతో కుటుంబాన్ని పోషించుకున్నవారు. వారిని వృద్ధాప్యంలో ఇలా వదిలివేయడం ఎంతవరకు సబబు?

మన రాష్ట్రంలో ఇప్పటికే పెన్షనర్లు పలు సమస్యలతో సతమతవుతున్నారు. పదవీ విరమణ పొందాక ప్రభుత్వం నుంచి రావాల్సిన, ఉద్యోగంలో ఉండగా తాము దాచుకున్న డబ్బులే రావటం లేదు. కరువు భత్యం వాయిదాలు పేరుకుపోతున్నాయి. పెన్షన్ సవరణ లేదు. ఆరోగ్య పథకం అమలు కాదు. 'మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా' ఇప్పుడు వారిపై ఎనిమిదవ వేతన సంఘానికి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల రూపంలో మరో ప్రమాదం ఎదురైంది. ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవాలంటే ఉద్యోగులు, పెన్షనర్లు సమష్టిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద ఉద్యమ స్ఫూర్తితో తీవ్రమైన ఒత్తిడి తేవాలి.

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

ఉప వర్గీకరణ లేకుండా బీసీ రిజర్వేషన్లు అప్రజాస్వామికం

బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లును గవర్నర్ దగ్గరకు రాష్ట్ర ప్రభుత్వం పంపింది. అయితే ఈ బిల్లుకు సంబంధించి హైకోర్టులో రెండు కౌంటర్ పిటిషన్లు దాఖలయ్యాయి. ఒకటి, స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు 50శాతానికి మించడం రాజ్యాంగ విరుద్ధం అని. రెండోది, బీసీల్లోని అట్టడుగు సంచార జాతుల కులాల మధ్య వర్గీకరణ జరగకుండా ఈ బిల్లును అమలు కాకూడదని. దీంతో రాష్ట్రంలో బీసీ బిల్లు రాజకీయం తీవ్ర అలజడికి దారితీసింది. 50శాతం రిజర్వేషన్లు మించకుండా 'స్థానిక' ఎన్నికలు నిర్వహించుకోవచ్చని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఇదే అంశాన్ని సుప్రీం కూడా సమర్థిస్తూ, హైకోర్టు ఉత్తర్వులపై జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది.

మన రాష్ట్రంలో సంచారజాతుల వారు చాలా వెనుకబడి ఉన్నారు. వీరు బీసీ–ఏలో ఉన్నారు. వీరికి రాజకీయ రంగంలో ఎలాంటి ప్రాతినిధ్యమూ లేదు. ఇప్పుడు ఉమ్మడిగా 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తే బీసీల్లో ఆర్థికంగా ఎదిగిన కులాలే లబ్ధి పొందుతాయి. మిగతా పేద బీసీ కులాలకు నష్టం జరుగుతుంది. కాబట్టి జీవో 9ని నిలిపివేసి, బీసీ వర్గీకరణతో కొత్త జీవో ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని ఆయా కులాల వారు ఈసీకి నివేదించారు.

ఒకసారి ఉమ్మడి ఏపీకి సంబంధించిన 2013 సంవత్సరం సర్పంచ్‌ల సమాచారాన్ని గమనిస్తే... గౌడ్స్ 818, ముదిరాజ్ 625, మున్నూరు కాపు 549, యాదవ 560, కురుమ 243, పద్మశాలి 215, పెరిక 83 లాంటి ఆర్థికంగా బలంగా ఉన్న కులాలే పంచాయతీ, మున్సిపాలిటీ పదవులలో అత్యధికంగా ఉన్నాయి. అయితే బీసీల్లోని మిగతా 70కి పైగా కులాలు కనీసం వార్డ్ మెంబర్, సర్పంచ్ కూడా కాలేకపోయాయి. గతంలో బీఆర్ఎస్ చేసిన సర్వే ప్రధానంగా కులాల మధ్య విభజన రేఖను గీసి రాజకీయంగా లబ్ధి పొందాలనే ఉద్దేశ్యంతో చేసింది. కాబట్టి బీసీల్లో ఉన్న ప్రధాన కులాలపైనే దృష్టి పెట్టింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సంచార కులాలను విస్మరిస్తున్నది. అయితే, బలమైన ఓబీసీ కులాల మద్దతు కోల్పోతుందనే భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని అమలు చేయడానికి చొరవ చూపడం లేదనేది వాస్తవం. ఓబీసీ వర్గీకరణ జరగకపోతే ప్రస్తుత 'ఓబీసీ రిజర్వేషన్ ఫ్రేమ్‌వర్క్'తో సామాజిక న్యాయం కంటే సామాజిక అన్యాయం జరిగే ప్రమాదమే ఎక్కువగా ఉంది.

– సునీల్ నీరడి

ఏఐ బోధనతో పిల్లల ప్రతిభకు ప్రమాదం

'బాలలకు 'కృత్రిమ మేధ' అవసరమా!' (అక్టోబర్ 28, ఆంధ్రజ్యోతి) అన్న వ్యాసంపై నా అభిప్రాయాలు కొన్ని వెల్లడించదలుచుకున్నాను. వ్యాసకర్త ఆర్.రామానుజం ప్రస్తుతం చాలా అవసరమైన ప్రశ్న వేశారు. ప్రాథమిక పాఠశాల స్థాయిలో 'కృత్రిమ మేధ'కు సంబంధించిన పాఠ్యాంశాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నట్లు, ఆ అధునాతన సాంకేతిక నైపుణ్య బోధనను మూడవ తరగతి నుంచే ప్రారంభించనున్నట్లు రామానుజం తెలియజేశారు. కృత్రిమ మేధ బోధనకు సంబంధించిన పాఠ్య ప్రణాళిక విధి విధానాలు, ఏయే తరగతులలో ఏయే విషయాలు ఉన్నాయో సమగ్రంగా వివరించారు. గమనార్హమైన విషయమేమిటంటే వ్యాస శీర్షికగా ఉన్న ప్రశ్నకు సంబంధించి ఒక్క మాట కూడా ప్రస్తావించలేదు! ఆ పాఠ్య ప్రణాళిక అమలు చేయటంలో ఉండే సాధకబాధకాల గురించి వివరించారు. కానీ 'కృత్రిమ మేధ–బోధన' పాఠశాల స్థాయి నుంచే అవసరమా? అన్న విషయాన్ని చర్చించకపోయినా చివరలో ఒక మంచిమాట అన్నారు: 'ఒత్తిడితో పాఠశాల విధులను నిర్దేశించటం లేదా ప్రభావితం చేయటం, విద్యారంగ దీర్ఘకాలిక లక్ష్యాలకు దోహదం చేయదు. సమాజానికి మేలు జరగదు. కృత్రిమ మేధ బలీయమైన ఆకర్షణ గల సాంకేతికత. అంతేకాదు, దాన్ని వినియోగించుకునే అలవాటు వదిలించుకోలేని వ్యసనంగా మారుతుంది. భావి పౌరులను తీర్చిదిద్దే విద్యాలయాలలో ఈ నవ సాంకేతికతను ఉపయోగించడంలో పై నిర్ణయాలను నిష్పాక్షిక వివేచన, సమగ్ర అవగాహన, నిశిత అంతర్దృష్టితో కూడిన సామాజిక వివేకంతో తీసుకోవలసి ఉంది'. విలువైన మాట, సందేహం లేదు.

అభివృద్ధి చెందిన దేశాలలో ఏఐ సాంకేతికతను ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో అమలు చేయడంలో ఉన్న అనుభవాలు, అధ్యయనాల గూర్చి వ్యాసకర్త కనీసమాత్రంగానైనా పేర్కొనలేదు. మొబైల్ ఫోన్‌లు ఎలా ఉపయోగించాలో నేర్పించాలంటున్నారు. అసలు ఆ వయస్సులో మొబైల్ ఫోన్‌లు అవసరమా? కేవలం దాన్ని అవసరం మేరకే ఉపయోగించటం అనేది సాధ్యపడుతుందా? అది ఉపాధ్యాయుల వల్ల అవుతుందా? అంతేకాకుండా కరోనా విపత్తు కాలంలో ఆన్‌లైన్‌లో విద్యార్థులు స్మార్ట్ ఫోన్‌లు ఉపయోగించారు. చదువు సంగతి ఎలా ఉన్నా, ఆ స్మార్ట్ ఫోన్ల వల్ల పాఠాలకన్నా, సినిమాలు, నీలి చిత్రాల వల్ల ఎంత నష్టం జరిగిందో తరువాత జరిగిన అధ్యయనాలు వల్ల మనందరికీ తెలిసిన విషయమే. 'కృత్రిమ మేధను నేర్పించే క్రమంలో విమర్శనాత్మకంగా ఆలోచించటం బాలలకు నేర్పించాలి' అని రామానుజం అన్నారు. అసలు పాఠశాల స్థాయి చిన్నారులలో సహజంగా ఉండే నైపుణ్యాలను, సృజనాత్మకతను, అభిరుచులను పెంపొందించకుండా ఏఐ లాంటి నవీన సాంకేతికతను వారి మెదళ్లలోకి ఎక్కించటంతో సాధించగలిగేది ఏమిటి? దానివల్ల బాలల్లో ఉండే సహజసిద్ధమైన తెలివితేటలకు ఎనలేని హాని సంభవించే ప్రమాదమున్నది. ఇప్పటికే అనవసరమైన సిలబస్ భారంతో బాలలు కుంగిపోతున్నారు. నిర్బంధంగా ఒత్తిడి చదువులు చదువుతున్నారు. వాటికి తోడు కృత్రిమమేధ లాంటి అధునాతన సంక్లిష్ట సాంకేతికత నేర్చుకోవడం అవసరమా? ఇప్పటికే ఉపాధిరంగంగా భావించి యువతరం అంతా సాంకేతిక విద్య వైపే దృష్టి కేంద్రీకరించింది. తల్లిదండ్రుల ఆలోచనా విధానం కూడా మూసలో పోసిన విధంగా ఉండటం అనేది ఒక విషాదకర పరిణామం. మానవీయ, సామాజిక శాస్త్రాల బోధనపై శ్రద్ధ అడుగంటిపోయింది. భాషా సాహిత్యాలపై ఎక్కడలేని ఉపేక్ష! ఫలితంగానే ఈ రోజు తెలుగు భాష ఉనికికే ప్రమాదం ఏర్పడే పరిస్థితి వచ్చింది. పాలకులు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాల వల్ల ఉద్యోగావకాశాలు కూడా కుంచించుకుపోతున్నాయనే వాస్తవాన్ని విస్మరించకూడదు. పిల్లల్లో సాహిత్యం, లలిత కళలపై ఆసక్తులు నెలకొల్పడంలో ప్రస్తుత చదువులు విఫలమవుతున్నాయి. ఫలితంగా– ఎదిగే క్రమంలో సమాజం గురించి గానీ, మానవ సంబంధాల గురించి గానీ ఈనాటి పిల్లలు ఏమీ నేర్చుకోలేకపోతున్నారు. జీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించుకోలేని వయోజనులుగా పరిణమిస్తున్నారు. ఈ దుస్థితికి ప్రధాన కారణం విద్యావ్యవస్థ కార్పొరేటీకరణ కాదా? ప్రభుత్వాలు సైతం విద్యారంగంపై సరైన దృష్టి పెట్టకపోవటం కూడా గర్హనీయమే.

> పాఠశాల స్థాయి చిన్నారులలో సహజంగా ఉండే సృజనాత్మక ప్రతిభ, ఆసక్తులు, అభిరుచులను పెంపొందించకుండా కృత్రిమ మేధ లాంటి నవీన సాంకేతికతను వారి మెదళ్లలోకి ఎక్కించటం వల్ల ప్రయోజనమేమిటి? ఆ నవీన సాంకేతిక విద్యా బోధనతో బాలల్లో ఉండే సహజసిద్ధమైన మేధో నైపుణ్యాలకు హాని సంభవించే ప్రమాదమున్నది.



అభివృద్ధి చెందిన దేశాలలో ఏఐ సాంకేతికత అదీ ఉన్నత విద్యలో ప్రవేశపెట్టటం అనేది కొంతవరకు సమర్థించదగిన విషయమే. అయితే మనలాంటి వెనకబడిన దేశాలలో ప్రభుత్వాలు పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించకుండా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకుండా ప్రభుత్వ పాఠశాలలు అన్నింటిని నిర్వీర్యం చేస్తోన్న పరిస్థితుల్లో బాలలకు కృత్రిమ మేధ బోధనను ప్రారంభించడమనేది బహుళజాతి కంపెనీల వస్తువులకు మార్కెట్ కల్పించటమే. బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయించలేని ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో చేసే ఈ చర్యలు 'ఉట్టికెక్కలేనమ్మ స్వర్గాన్ని కెక్కిన' చందంగా ఉంటుంది. ఇంకో విషయమేమంటే, ప్రభుత్వాల దృష్టిలో విలువలు కలిగిన విద్య అంటే సాంకేతిక విద్య, ఇంగ్లీషు మీడియం చదువులు అని భావించటం వల్ల ప్రభుత్వ పాఠశాలలలో కూడా ఆంగ్ల మాధ్యమంలో చదువులు చెప్పే ప్రయత్నాలు జరుగుతున్నాయి. విలువలు కలిగిన చదువులు అంటే మనిషి తనను తాను సంస్కరించుకుని సమాజాన్ని సంస్కరించటమే. ఈ రోజున అలాంటి చదువులు లేవు కాబట్టే సమాజం ఇంత అరాచకంగా తయారవుతోంది. మొత్తం మీద కృత్రిమ మేధ లాంటి అత్యాధునిక సాంకేతిక విద్యలు మనిషికి సౌకర్యవంతమయిన జీవితం కల్పించవచ్చు కానీ దాని వల్ల సంభవించే నష్టదాయక పరిణామాలే ఎక్కువగా ఉన్నాయి. తద్వారా మనుషుల మధ్య ఉండాల్సిన మానవీయ సంబంధాలు మరింత అమానవీయంగా మారే ప్రమాదముంది.

■ రాజ్యలక్ష్మి పొన్నపల్లి

అన్నదాత ఆగమాగం



ఏనుమాముల మార్కెట్లో వర్షానికి తడుస్తున్న పత్తి బస్తాలు

- అకాల వర్షానికి మార్కెట్‌లో తడిసిన మక్కలు, పత్తి
- తరుగు తీసి కొనుగోలు చేసిన వ్యాపారులు

వరంగల్ వ్యవసాయం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం కురిసిన అకాల వర్షానికి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మక్కలు, పత్తి ఇతర సరుకులు తడిసిపోయాయి. మార్కెట్ అధికారులు రైతులకు టార్పాలిన్ షీట్స్ అందించినప్పటికీ అప్పటికే చాల వరకు తడిసిపోయాయి. దీంతో సుమారు రెండు గంటల పాటు కొనుగోళ్ల నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్, పర్సన్ ఇన్‌చార్జి ఉప్పుల శ్రీనివాస్, గ్రేడ్ 2 కార్యదర్శులు వ్యాపారులతో మాట్లాడి కొనుగోళ్ల చేయించారు. ధరలు నిర్ణయించిన తరువాత వర్షం కురువడంతో తడిసిన వాటికి క్వింటాళ్‌కు కిలో, రెండు కిలోల వరకు తరుగు తీసివేసి వ్యాపారులు కొనుగోలు చేశారు. దీంతో సమస్య సద్దుమనిగింది. ఆరుగాలం కష్టపడి పంట పండించి దాన్ని మార్కెట్లో విక్రయించి సొమ్ము చేతిలో పడే వరకు గ్యారెంటీ లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనాలు వేసినప్పటినుంచి పంట చేతికి వచ్చి మార్కెట్లో అమ్ముకునే వరకు అనేక సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందని, అతివృష్టి, అనావృష్టి, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు అన్నిటినీ తట్టుకొని మార్కెట్‌కు వస్తే గిట్టుబాటు ధర వస్తుందన్న నమ్మకం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.



ఏనుమాముల మార్కెట్‌లో వర్షానికి తడిసిన పత్తి



మార్కెట్‌లో తడిసిన మక్కజొన్నను ఆరబెడుతున్న రైతు

కార్తీక కాంతులు



- పౌర్ణమి వేళ ఆలయాల్లో అభిషేకాలు, దీపోత్సవాలు
- సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు
- పూజా సామగ్రి అమ్మకాలతో కూడళ్ల వద్ద సందడి

వరంగల్ కల్చరల్/హనుమకొండ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పవిత్రకార్తీక మాసంలో కృత్తిక నక్షత్రంలో నిండు పౌర్ణమి వేళ బుధవారం జిల్లా వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి వేడుకలు జరుపుకునేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు. ప్రతీ ఇంటా ఉసిరిక స్నానాలు చేయడం బ్రహ్మీ ముహుర్తంలో తెల్లవారుజామునే లేసి అభ్యంగన స్నానాలు చేసి కార్తీక వొత్తులు వెలిగించుకోవడం సాంప్రదాయంగా వస్తోంది. ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించుకోవడం, ఉసిరిక దానాలు చేయడం ఈ పర్వదిన వేల సాంప్రదాయం. ఇంటింటా లక్ష్మీదేవిగా కొలుస్తూ తులసీ మాతకు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేయడం ఈ పర్వానికి ప్రత్యేకత. ప్రతి ఇంటి దీపావళి నుంచి మొదైలన కార్తీక దీపాలు పౌర్ణమి వేళ మరిన్ని ఎక్కువ దీపాలు వెలిగించి లక్ష్మీదేవిని ఆహ్వానిస్తూ సుఖ సంతోషాల కోసం పూజించడం కార్తీక పౌర్ణమి విశిష్టత. కార్తీక దీపాల ద్వారా మనిషిలోకి అజ్ఞానం తొలగి జ్ఞాన జ్యోతులు వెలుగుతాయన్నది భక్తుల విశ్వాసం. దీనికితోడు కార్తీక పౌర్ణమి వేళ (మిగతా 4లో..)



పిడుగుపడి రైతు మృతి



మృతి చెందిన రైతు మహిపాల్

పరకాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పిడుగుపడి ఓ రైతు మృతి చెందిన సంఘటన హనుమకొండ జిల్లా పరకాల మండలం పోచారం గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పోచారం గ్రామానికి చెందిన పూస మహిపాల్(40) తనకున్న నాలుగు ఎకరాలతోపాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకొని పంటలను సాగు చేస్తున్నాడు. అందులో భాగంగా ఉదయాన్నే తన ఎద్దులను పట్టుకొని ఎడ్లబండిపై వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. ఒక్కసారిగా మబ్బు కమ్ముకొని సాయంత్రం 3గంటలకు వర్షం పడుతూ పిడుగు పడటంతో వ్యవసాయ భూమి వద్ద ఎద్దుతోపాటు మహిపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రజిత, కుమారుడు ఉన్నారు.

గృహ సిలిండర్ల మాయాజాలం

వ్యాపార సంస్థలకు అక్రమంగా తరలింపు 5

ఆటలంటే అలుసేల!?



- చాలా గురుకులాల్లో అధ్వానంగా క్రీడా మైదానాలు
- ప్రతిభావంతులైన విద్యార్థులకు ముందస్తు శిక్షణ కరువు
- విధులు విస్మరించి ఇతర వ్యాపకాల్లో మునిగితేలుతున్న పీఈటీలు
- దుర్వినియోగం కానున్న లక్షలాది రూపాయల నిధులు
- లక్ష్యానికి దూరమై ప్రోత్సాహం కరువైన విద్యార్థులు
- రేపటి నుంచి పోటీలు ప్రారంభం దృష్టి సారించని అధికారులు..

సాంఘిక సంక్షేమ గురుకులాల్లో క్రీడలపై నిర్లక్ష్యం

హనుమకొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 11వ జోనల్‌స్థాయి క్రీడాపోటీల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 20 కేంద్రాల్లో నిర్వహించనున్నట్టు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఇటీవల సర్క్యులర్ జారీ చేసింది. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించి, శారీరక దారుఢ్యంతో పాటు క్రమ శిక్షణను పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశం. లక్షలాది రూపాయలను వెచ్చించి ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఆ మేరకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నట్లు ఎక్కడా కనిపించడం లేదు.

తూతూ మంత్రంగా ఆటలు

గురుకుల విద్యాసంస్థలో విద్యార్థులను తూతూ మంత్రంగా ఆటలు ఆడిస్తున్నారు. ఏ క్రీడల్లో వారికి సరైన రీతిలో శిక్షణ ఇవ్వడం లేదు. ఆటలు ఆడించాల్సిన వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడేతర విధులకే ఎక్కువగా పరిమితమవున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాయంత్రం ఏదో కొద్దిసేపు విద్యార్థులను గ్రౌండ్‌లో పరిగెత్తించడం మినహా వారిని ఆయా క్రీడల్లో పరిపూర్ణమైన నైపుణ్యం కలిగిన క్రీడాకారులుగా తీర్చిదిద్దడం లేదు. విద్యార్థులకు ఆటల్లో ప్రాథమిక నైపుణ్యాలపై ఎటువంటి మార్గదర్శనం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతీరోజు సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు గ్రౌండ్‌లోనే ఉండి (మిగతా 4లో..)

జోనల్ పోటీలు ఇలా..

11వ గురుకుల పాఠశాలల జోనల్ స్థాయి క్రీడాపోటీలు అండర్ 14, అండర్ 17, అండర్ 19 కేటగిరీల్లో బాల, బాలికలకు వేరు వేరుగా నిర్వహిస్తారు. జోన్ 3, 4, 5, 7లో బాలికల పాఠశాలలు ఎక్కువగా జోన్6లో బాలుర పాఠశాలలు ఉండడం వల్ల జోన్ ఏ, జోన్ గ్రూప్‌లుగా విభజించి ఈ పోటీలను నిర్వహిస్తారు. అండర్ 17, 19 బాలబాలికలకు వాలీబాల్, బాల్‌బాడ్మింటన్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, ఖోఖో, టెన్నికాయిట్ (డబుల్స్), చెస్, క్యారమ్ (డబుల్స్) ఫుట్‌బాల్ (బాలురు మాత్రమే) క్రీడల్లో అథ్లెటిక్స్‌లో అండర్ 17, అండర్ 19 (బాలబాలికలు) 100 మీటర్స్, 200 మీటర్స్ 400 మీటర్స్, 800 మీటర్స్ 1500 మీటర్స్, 3000 మీటర్స్ పరుగు (బాలికలకు), 5000 మీటర్స్ పరుగు (బాలురకు), షాట్‌పుట్, డిస్కస్‌త్రో, లాంగ్ జంప్, హైజంప్, 4 ఇంటు 100 మీటర్స్ రిలే, అండర్ 14 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, చెస్, క్యారమ్, (డబుల్స్), టెన్నికాయిట్, (డబుల్స్) అథ్లెటిక్స్‌లో అండర్ 14 బాలబాలికలకు 100 మీటర్స్, 200 మీటర్స్, 400 మీటర్స్, 600 మీటర్స్, షాట్‌పుట్, డిస్కస్ త్రో లాంగ్ జంప్, హైజంప్‌లో ఈ పోటీలు ఉంటాయి.

16న కార్తీక వన భోజనాలు

భద్రకాళి ఆలయంలో ఏర్పాట్లు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రధానార్చకుడు భద్రకాళి శేషు

వరంగల్ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ 16న ఆదివారం వేలాది మంది ఆర్యవైశ్యులతో భద్రకాళి అమ్మవారి దేవస్థానం సన్నిధిలో కార్తీక మాస వన భోజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూ.. వనభోజనాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, 25రకాల ఆటల పోటీలు, వృద్ధులకు కూడా పోటీలు ఉంటాయని అన్నారు. విజేతలకు బహుమతులను అందజేస్తామన్నారు. ఉసిరి చెట్టు వద్ద వొత్తులు కాల్చుకునే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న ఆర్యవైశ్యులందరూ సకుటుంబ సపరివారంగా ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానార్చకుడు భద్రకాళి శేషుతో పాటు గార్లపాటి నాగేంద్ర బాబు, వంగేటి అశోక్, వోలం సదాశివుడు, దాచెపల్లి సీతారాం, శ్రీరాం శ్రీనివాస్, అశోక్, రవీందర్, కళావతి, శ్రీలత, రాజమణి, రాణి, రఘుబాబు పాల్గొన్నారు.

ఫూలే విగ్రహాల స్థలంపై వివాదం

- ముందస్తు అనుమతి తీసుకున్న తర్వాతే నిర్మించాలని ఓ వర్గం వారి అభ్యంతరం
- పాత చోటనే నిర్మిస్తామని స్పష్టం చేసిన కమిటీ సభ్యులు
- పోలీసుల జోక్యంతో తాత్కాలికంగా సద్దుమణిగిన గొడవ



ఇరువర్గాల వారితో మాట్లాడుతున్న మిల్స్‌కాలనీ ఎస్సైలు

కరీమాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉర్సు దర్గా ప్రాంతంలో కూల్చివేతకు గురైన పూలే విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేసే స్థలం విషయంలో మంగళవారం రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ధ్వంసమైన ప్రదేశంలో పూలే దంపతుల విగ్రహాల నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తుండగా ఓ వర్గం వారు ఇటీవల ఆ ప్రాంతంలో డబ్బా కొట్టు ఏర్పాటు చేశారు. దీంతో పూలే విగ్రహ ఏర్పాటు కమిటీ, స్థానిక బీఆర్ఎస్ నాయకులు మంగళవారం డబ్బా కొట్టును అక్కడి నుంచి తీసివేసి విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న ఓ వర్గం వారు పదుల సంఖ్యలో సంఘటన స్థలానికి చేరుకొని పూలే విగ్రహ నిర్మాణ కమిటీ, స్థానిక బీఆర్ఎస్ నాయకులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ ఈ ప్రాంతంలో విగ్రహాలను ఏర్పాటు చేయాలంటే దర్గా పీఠాధిపతుల అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. దీంతో పూలే విగ్రహం ఇక్కడ ఎప్పటినుంచో ఉందని, అది ధ్వంసం కాబడిన చోటనే కొత్తగా ఏర్పాటు చేయడం వలన మీకు వచ్చిన అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. దీంతో ఇరు వర్గాల మధ్య కొంత వాగ్వాదం జరిగి గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకులు, పూలే విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు విషయాన్ని పోలీసులకు చేరవేశారు. వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇరు వర్గాలతో మాట్లాడి సమస్యను ప్రశాంతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. గతంలో ఉన్న విధంగానే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే తమకు అభ్యంతరం లేదని, ఒకవేళ పూలే దంపతుల విగ్రహాలతో పెద్దగా నిర్మించాలనుకుంటే, దర్గా పీఠాధిపతి సూచన మేరకు ఆ ప్రదేశంలో కాకుండా దానికి సమీపంలో స్థలం చూపిస్తామని అక్కడ ఏర్పాటు చేసుకోవాలని సదరు వర్గం వారు తెలిపారు. పీఠాధిపతి హైదరాబాద్‌లో ఉన్నందున, ఆయన రావడానికి రెండు రోజుల సమయం పడుతుందని అప్పటి దాకా ఆగాలని వారు సూచించారు. ఇదిలావుండగా, కావాలనే తాత్సారం చేసి విగ్రహాల నిర్మాణాన్ని అడ్డుకోవాలని చూస్తున్నట్లు కనిపిస్తోందని పూలే విగ్రహ కమిటీ సభ్యులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు.



పాము కనిపించిందన్నందుకు పొమ్మన్నారు!



శివానితో తల్లిదండ్రులు స్వప్న, నాగరాజు

- దళిత విద్యార్థినిపై పర్వతగిరి గురుకుల ఉపాధ్యాయుల చర్య
- నాలుగు నెలలుగా ఇంట్లోనే ఉంటున్న విద్యార్థిని
- తమ బిడ్డను గురుకులంలోకి రానివ్వడం లేదంటున్న తల్లిదండ్రులు
- వైస్ ప్రిన్సిపాల్స్ తీరుపై అనేక ఆరోపణలు
- ఆ విద్యార్థినికి హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేదు : ప్రిన్సిపాల్

పర్వతగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పాము కాటు వేయకున్నా.. వేసిందని చెప్పి తమను ఇబ్బందులకు గురిచేసిందనే కోపంతో గురుకుల ఉపాధ్యాయులు ఓ దళిత విద్యార్థినిని చదువుకు దూరం చేశారు. విద్యార్థులను కనురెప్పల్లా కాపాడాల్సిన వారే.. కక్షపూరితంగా వ్యవహరించడం వి మర్శలకు తావిస్తోంది. ఉపాధ్యాయుల తీరు వల్ల సదరు విద్యార్థిని నాలుగు నెలలుగా చదువుకు దూరమై ఇంటివద్దే ఉంటోంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన పూర్వాపరాలు ఇలా వున్నాయి.. వరంగల్ జిల్లా ప ర్వతగిరి మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన వల్లందాసు స్వప్న-నాగరాజు దంపతులు కూలీలుగా పనిచేస్తున్నారు. వీరి కుమార్తె శివాని ప ర్వతగిరిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో ఐదో తరగతి చదువుతోంది. జూలైలో మొదటి ఆదివారం వైస్ ప్రిన్సిపాల్ స్వాతి ఆదేశాల మే రకు గ్రౌండ్‌లో పెరిగిన పిచ్చి మొక్కలను విద్యార్థులు తొలగిస్తుండగా, వ ల్లందాసు శివాని అనే విద్యార్థిని ఓ పాము తన కాలుపై నుంచి వెళ్లిందని భయంతో కేకలు వేస్తూ ఉపాధ్యాయులకు, వైస్ ప్రిన్సిపాల్‌కు చెప్పింది. పాము కాటేసిందని భావించిన వైస్ ప్రిన్సిపాల్ స్వాతి ఉపాధ్యాయులను ఇచ్చి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. విద్యార్థినిని పరీక్షించిన వైద్యులు పాము కాటు వేయలేదని తేల్చారు. దీంతో ఊపిరి పీల్చుకున్న ఉపాధ్యాయులు శివానిని ఆమె తల్లిదండ్రులకు అప్పగించి ఇంటికి పంపించారు. అ నంతరం కొన్ని రోజులకు తల్లిదండ్రులు తమ కూతురును గురుకులంలో జాయిన్ చేసి వెళ్లారు. అయితే నాలుగు రోజుల తర్వాత శివాని తల్లిదండ్రులను గురుకులానికి రప్పించి, మీ అమ్మాయి తీరు సరిగా లేదని, పాము పేరిట తమను ఇబ్బందులకు గురి చేసిందని (మిగతా 4లో..)





సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల పురోగతిపై సమీక్ష

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేకు సంబంధించి భూ సేకరణ పనుల పురోగతిపై కలెక్టర్ సత్యశారద మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మంచిర్యాల, వరంగల్, ఖమ్మం జిల్లాలను కలుపుతూ ఏర్పాటు చేసిన గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే (163జీ)కు జిల్లాలో మొత్తం 176.52 హెక్టార్ల భూమి అవసరం కాగా ఇప్పటివరకు 171.34 హెక్టార్ల సేకరణ పూర్తయిందని, మిగతాది ఈ నెల 10వ తేదీ వరకు పూర్తి చేయాలని సంబంధిత ఆర్డీవోలను, అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భూమి కోల్పోయిన రైతుల నష్టపరిహారం త్వరితగతిన చెల్లించి ల్యాండ్ అక్విజేషన్ పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, ఏడీ సర్వేల్యాండ్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో బయో మిథనైజేషన్ ప్లాంట్

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్



వర్చువల్‌గా మాట్లాడుతున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో మిథనైజేషన్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ డెవలప్‌మెంట్ ఎఫైర్స్ (ఎన్‌ఐయూఏ) మంగళవారం ఢిల్లీ నుంచి నిర్వహించిన వర్చువల్ సమావేశంలో వరంగల్ నుంచి కమిషనర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో వంద టీపీడీ సామర్థ్యం గల బయో మిథనైజేషన్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని అందుకు సంబంధించి నగరంలో చెత్త సేకరణ పూర్తి వివరాలను అందించామన్నారు. ఎన్‌ఐయూఏ వారు క్షేత్రస్థాయి శానిటేషన్ స్థితిగతులు కూడా అధ్యయనం చేశారని అన్నారు. చెత్త సేకరణ విధానాలు, చెత్త తరలింపు పద్ధతులపై సమగ్ర అధ్యయనం చేసిన తర్వాత మిథనైజేషన్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, ఎన్‌ఐయూఏ సభ్యులు అనుతీర, దీప్తి, ప్రతీ, రాహుల్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గొర్ల కాపరి మృతి

అప్పుల బాధతో ఆత్మహత్య

నల్లబెల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తో పురుగుల మందు తాగిన గొర్ల కాపరి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని నాగరాజుపల్లి గ్రామానికి చెందిన పిండి కొమురయ్య (55) గొర్ల కాపరిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గొర్లను ఎగుమతి, దిగుమతి చేయడంలో పెట్టుబడికి డబ్బులు లేక కొమురయ్య అప్పులు తెచ్చాడు. ఈ అప్పులకు వడ్డీ పెరిగి భారంగా మారింది. అప్పులు ఇచ్చిన వారి బాధను తట్టుకోలేక మనోవేదనకు గురై సోమవారం మధ్యాహ్నం ఊరు శివారు తన పొలం వద్ద పురుగుల మందు తాగాడు. అటుగా వెళ్లిన గీతకార్మికుడు గమనించి కొమురయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశాడు. కొమురయ్యను వెంటనే కుటుంబ సభ్యులు ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య పిండి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. కొమురయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

వరద బాధితులు ఆత్మస్థైర్యంతో ఉండాలి

మేయర్ గుండు సుధారాణి



భద్రకాళి చెరువు కట్టను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షానికి నష్టపోయిన వరద బాధితులు ఆత్మస్థైర్యంతో ఉండాలని ఆర్థికంగా నష్టపోయిన వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని వరంగల్ నగర మేయర్ సుధారాణి అన్నారు. మంగళవారం వరంగల్ భద్రకాళి చెరువుకట్టను కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి పరిశీలించారు. బాధితులను పరామర్శించి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. గతంలో చెరవు కట్ట వర్షాలకు తెలిపోయిందని గుర్తు చేస్తూ గతంలో వచ్చిన పరిస్థితులు పునరావృత్తం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేవరకొండ విజ యలక్ష్మి, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి సీపీ రవీందర్, ఈఈ రవి కుమార్, ఇరిగేషన్ అధికారులు, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.



తాళిని చూపిస్తున్న అర్చకులు

వైభవంగా వెంకన్న కల్యాణం

ప్రారంభమైన బుగులోని బ్రహ్మోత్సవాలు

రేగొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలగిరి శివారులో ఉన్న బుగులోని వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జాతర చైర్మన్ రమణారెడ్డి, ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో తొలిరోజు స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పద్మావతి సమేతంగా స్వామి వారి ఉత్సవమూర్తులను అలంకరించి రథంపై ఊరేగించారు. తిరుమలగిరి నుంచి బుగులోని గుట్ట వరకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా భక్తులు, గ్రామస్థులు భక్తిగీతాలు ఆలపిస్తూ, మహిళలు కోలాటాలతో నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. అడుగడుగునా మహిళలు మంగళ హారతులు పడుతూ, కొబ్బరికాయలు కొడుతూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణం మార్మోగిపోయింది.


నూతనంగా నిర్మించిన మండపంలో పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వస్వామి, పద్మావతి అమ్మవార్లకు పట్టు వస్త్రాలతో అలంకరించి మండపంలోకి తీసుకొచ్చారు. అనంతరం మగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణాల మధ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళసూత్రధారణ వేడుకను భక్తులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి స్వామివారిని గుట్ట పైకి చేర్చి హారతులు ఇచ్చి పుష్పార్చన చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ కర్ణాకర్‌రావు, ఎస్సై రాజేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎంలో ఆర్ఎంవోలు నిల్

ఇన్‌చార్జి ఆర్ఎంవోలుగా క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు

వరంగల్ మెడికల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణలో పేదల ఆస్పత్రిగా ప్రసిద్ధి చెందిన ఎంజీఎం ఆస్పత్రిలో ఆర్ఎంవోలు లేరు. ఎంజీఎం ఆస్పత్రి పరిపాలనలో రోగులకు వైద్య సేవలు అందించే విషయంలో ఆర్ఎంవోల విధులు కీలకంగా ఉంటాయి. గత కొన్ని సంవత్సరాలుగా సివిల్ సర్జన్ ఆర్ఎంవో (ఆర్ఎంవో - 01)తోపాటు అసిస్టెంట్ సివిల్ సర్జన్ ఆర్ఎంవో (ఆర్ఎంవో - 3) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం కల్పించిన పదోన్నతులతో ప్రస్తుతం విధుల్లో ఉన్న డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంవో (ఆర్ఎంవో- 2) డాక్టర్ ఎం.వసంతరావు సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా నియమితులయ్యారు. దీంతో మూడు ఆర్ఎంవో(1,2,3) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లుగా విధులు నిర్వర్తించాల్సిన కొందరు వైద్యులను ఇన్‌చార్జి ఆర్ఎంవోలుగా నియమిస్తూ వస్తున్నారు. దీంతో క్యాజువాలిటీలో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. కేవలం పీజీ వైద్యులు, వైద్య విద్యార్థులు మాత్రమే క్యాజువాలిటీలో సేవలు అందిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎంజీ ఎం పరిపాలన సౌలభ్యంతోపాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మూడు ఆర్ఎంవో పోస్టు లను వెంటనే భర్తీ చేయాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు సోమేశ్వరుడి గుట్టపై అఖండజ్యోతి దర్శనం



శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం గుట్ట

పాలకుర్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం గుట్టపై కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని 5న (నేడు) బుధవారం గిరిప్రదక్షిణ అఖండజ్యోతి భక్తులకు దర్శనం కానుంది. స్వామి వారిని దర్శించుకునేందుకు దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అ ఖండ జ్యోతి దక్షిణ భారతదేశంలో మూడు దేవాలయాలున్నాయి. వాటిలో కేరళలోని శబరిమలై, తమిళనాడులోని అరుణాచలం దేవాలయం, మూడోది శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయం. ప్రతి ఏడాది కార్తిక పౌర్ణమి సందర్భంగా దేవాలయంలో గుట్ట చుట్టూ ప్రదక్షిణ చేసి అఖండజ్యోతిని వెలిగిస్తారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి హాజరుకానున్నారు.

ఆటలంటే అలుసేల!?

(3వ పేజీ తరువాయి)

విద్యార్థులను వారికి ఆసక్తి కలిగిన ఆటల్లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇందుకు భిన్నంగా విద్యాసంస్థల ప్రిన్సిపాల్ సేవలో తరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. క్రీడలు తప్ప ఇతర కార్యకలాపాల్లో మునిగితేలుతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

అధ్వానంగా గ్రౌండ్లు

గురుకుల విద్యా సంస్థలన్నిటిలో క్రీడా మైదాలున్నప్పటికీ వాటి నిర్వహణే అత్యంత అధ్వానంగా ఉంది. మైదానాల్లో పెద్దఎత్తున గడ్డి మొలిచి విద్యార్థులు ఆడుకునేందుకు వీలు లేకుండా పోతోంది. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన చెత్తాచెదారం వల్ల అందులో పాములు, తేళ్లు, ఇతర విషపురుగులు తిరుగుతుండడంతో విద్యార్థులు మైదానంలో ఆడుకోవాలంటేనే జంకుతున్నారు. నిజానికి క్రీడా మైదానాన్ని ఆటలకు అనువైనరీతిలో తీర్చిదిద్దాల్సిన బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులదే. కానీ వారు పెద్దగా పట్టించుకోవడం లేదు. పలు గురుకులాల ప్లేగ్రౌండ్లు నిరుపయోగంగా ఉన్నాయని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

పేరుకే జోనల్ క్రీడలు

నాలుగు రోజుల జోనల్ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు కనీసం నెల రోజులు లేదా కనీసం పక్షంరోజులైనా శిక్షణ ఇవ్వాల్సి ఉంది. కానీ అలాంటిదేమీ కానరావడం లేదంటున్నారు. విద్యార్థులను పేరుకు మాత్రమే ఈ క్రీడా పోటీలకు పంపిస్తున్నారని, జోనల్ ఆటల కోసం బస్సుల్లో విద్యార్థులను తరలించి భారీ మొత్తం ఖర్చు చేస్తున్నా, వాస్తవానికి క్రీడా నైపుణ్యాల్లో పెరుగుదల కనిపించడం లేదని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రతీ క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులను ముందుగానే గుర్తించి వారికి కనీసం నెలరోజు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి పంపితే ఫలితం ఉంటుందంటున్నారు. అలాగే క్రీడా సామగ్రి కొనుగోళ్లలో పారదర్శకత ఉండాలని, అవినీతికి ఆస్కారం లేకుండా అధికారులు పర్యవేక్షించాలని కోరుతున్నారు. పేద దళిత విద్యార్థుల భవిష్యత్తు కోసం ఈ పోటీలు నిజమైన అర్థంలో క్రీడా స్ఫూర్తితో జరగాలని, ఇందు కోసం గురుకుల విద్యాసంస్థల అధికారులు ఇకనుంచైనా ముందుగానే శిక్షణా కార్యక్రమాలను చేపట్టాలని కోరుతున్నారు.

పాము కనిపించిందన్నందుకు పొమ్మన్నారు

(3వ పేజీ తరువాయి)

తాము నాటు వైద్యం చేయించినట్లు వివిధ పత్రికల్లో కథనాలు రావడం వల్ల తమ పరువు పోయిందంటూ వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, క్లాస్ టీచర్ మాధవి ఆగ్రహం వ్యక్తం చేసి, గురుకులం నుంచి తీసుకెళ్లాలని ఆదేశించారు. దీంతో తల్లిదండ్రులు శివానిని ఇంటికి తీసుకొచ్చారు. ఆ తర్వాత పలుమార్లు గురుకుల ప్రిన్సిపాల్‌ను కలవడానికి వెళ్తే గేటు కూడా తీయలేదని వారు తెలిపారు.

వైస్ ప్రిన్సిపాల్స్ తీరుపై విమర్శలు

పర్వతగిరి సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో వైస్ ప్రిన్సిపాల్స్‌గా పనిచేస్తున్న స్వాతి, జ్యోత్స్న తీరు పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు పలు ఆరోపణలు చేస్తున్నారు. చిన్న చిన్న కారణాలకే విద్యార్థినిలను వేధిస్తున్నారని దీంతో కొందరు విద్యార్థినిలు గోడ దూకి సైతం పారిపోయారని, మానసికంగానూ వేధిస్తారని చెబుతున్నారు. ప్రిన్సిపాల్ అపర్ణ జిల్లా కో-ఆర్డినేటర్ బాధ్యతల్లో ఉండడంతో వైస్ ప్రిన్సిపాల్స్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నా బిడ్డ సదువు ఆగకుండా చూడండి సారు..

వల్లందాసు స్వప్న-నాగరాజు, విద్యార్థిని తల్లిదండ్రులు

మా బిడ్డ మంచి మార్కులు తెచ్చుకుని గురుకులంలో సీటు సంపాదించింది. మేము ఎవరి ప్రోద్బలం, పైరవీలతో మా పాపను గురుకులానికి పంపలేదు. అలాంటి మా పాప పట్ల గురుకులం టీచర్ల తీరు సరిగ్గా లేదు. నాలుగు నెలల నుంచి విద్యకు దూరం చేసి మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. టీసీని కూడా పోస్టు ద్వారా పంపిస్తామని చెప్పి, గురుకులంలోకి రానివ్వడం లేదు. నా బిడ్డ సదువు ఆగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

ఆమెకు హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేదు: అపర్ణ, ప్రిన్సిపాల్

విద్యార్థిని వల్లందాసు శివాని మానసిక స్థితి సరిగా లేదు. తన తల్లిదండ్రులతోనే ఉండాలని అమ్మాయికి ఉంది. హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేకనే మాపై అనేక నిందలు మోపి ఇంటికి వెళ్లింది. తల్లిదండ్రులు అమ్మాయిని బెదిరించి బలవంతంగా హాస్టల్‌లో వదిలి వెళ్తున్నారు. తల్లిదండ్రులు వెళ్లిన తరువాత తనకు ఇక్కడ ఉండడం ఇష్టం లేదని తన స్నేహితురాళ్లలో చెప్పేదని తెలిసింది. ఈ విషయాలను గమనించి ఏదైనా అఘాయిత్యం చేసుకుంటుందనే ఉద్దేశంతోనే ఆమెను ఇంటికి పంపించాం. విద్యార్థిని తల్లిదండ్రులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు.

ఎఫ్ఏసీ డీఈవోగా బాధ్యతల స్వీకరణ

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ డీఈవో గా అడిషనల్ కలెక్టర్ ఎ. వెంకటరెడ్డి మంగళవారం పూర్తి అదనపు బాధ్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ జీఎస్. ప్రసాద్, ఏసీజీఈ భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకుతో కేడీసీ ఎంవోయూ



బ్యాంకుతో ఎంవోయూ కుదుర్చుకుంటున్న కేడీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కేడీసీ) ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకుతో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రపు శ్రీనివాస్, ఏపీపీబీ సీనియర్ మేనేజర్ ప్రమోద్, మేనేజర్ ప్రవీణ్ అవగాహన ఒప్పందంపై సంతకం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ..

ఈ ఎంవోయూతో విద్యార్థులకు ఐపీపీబీలో ఇంటర్న్‌షిప్ లభిస్తుందన్నారు. పరిశ్రమలు, అకాడమిక్ అనుసంధానాలను బలపరచడమే ఈ ఎంవోయూ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వ్యాపార, వాణిజ్య నిర్వహణ, డిజిటల్ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ ఇంక్లూషన్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ రంగాల్లో విద్యార్థులు అనుభవం పొందుతారన్నారు. కార్యక్రమంలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ హెడ్ రాజశేఖర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

డిసెంబరు 10 నుంచి పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు

మహా సభల ఆహ్వాన సంఘం అధ్యక్షురాలు ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే



ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న కాత్యాయని విద్మహే

వడ్డెపల్లి, నవండరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, కార్పొరేట్ విద్యా రంగాన్ని పాలకులు ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని ధ్వంసం చేస్తున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షురాలు ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల విద్య పేదలకు మరింత దూరమవుతుందని తెలిపారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం దేశంలోనే ఉన్న చట్టాలను కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చుతున్నారని దుయ్యబట్టారు. డిసెంబరు 10, 11, 12 తేదీల్లో వరంగల్‌లో నిర్వహించే పీడీఎస్‌యూ 23వ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని విద్యార్థి లోకానికి పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభల లోగోను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి మైన శ్రీనివాస్, పీడీఎస్‌యూ జాతీయ, రాష్ట్ర నాయకులు పి. మహేష్, పి. నాగరాజు, బోనగిరి మధు, డాక్టర్ రాజేష్, మర్రి మహేష్, గుర్రం అజయ్, రాజేందర్, రాచర్ల బాలరాజు, బండి కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

23న మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉచిత విద్య

మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న మోషన్ కాలేజీ చైర్మన్ వేణుగోపాల్ గౌడ్

హనుమకొండ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే అగ్రగామి విద్యా సంస్థ అయిన రాజస్థాన్ కోట మోషన్ ఐఐటీ, నీట్ కాలేజీలో ఈ నెల 23న మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ నిర్వహిస్తున్నట్లు మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. మంగళవారం హనుమకొండ నయీంనగర్‌లోని మోషన్ ఐఐటీ, నీట్ జూనియర్ కళాశాలలో మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ టాలెంట్ టెస్టులో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని టాలెంట్ టెస్టు రాసే విద్యార్థుల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన పది మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తామని ప్రకటించారు. దేశ వ్యాప్తంగా మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ రాసే విద్యార్థులలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన 500 మంది విద్యార్థులకు ఉచిత విద్య, రూ.2.50 కోట్ల ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు తెలిపారు.

నీట్ వరంగల్ సెంటర్ నుంచి టాలెంట్ టెస్టులో మొదటి 10 ర్యాంకులు సాధించిన విద్యార్థులలో మొదటి ర్యాంకు విద్యార్థికి ల్యాప్‌టాప్, రెండవ ర్యాంకు సాధించిన విద్యార్థికి ట్యాబ్ ఇవ్వనున్నట్లు ఈ అవకాశాన్ని ఈ సంవత్సరం పదో తరగతి చదువుతున్న స్టేట్ సీబీఎస్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్యాలెంట్ టెస్టు రిజిస్ట్రేషన్ కోసం సెల్ నంబర్:97030 00850 లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మోషన్ కాలేజీ బ్రాంచ్ హెడ్ ముత్యాల సురేష్, ఏజీఎం శనిగరపు సుమన్, ఏవో తాళ్లపెల్లి రమేష్, పాక నాగరాజు, రచ్చ కుమార్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు సురేందర్, తాళ్లపెల్లి వెంకట్, రావుల రవీందర్, ఒంటేరు మనోహర్, బోడ సంతోష్, జి. అనిల్, రంజిత్, కాలేజీ సిబ్బంది లక్ష్మణ్, మౌనిక, ఉమ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక కాంతులు..

(3వ పేజీ తరువాయి)

శ్రీరమా సత్యనారాయణస్వామి వ్రతాలను ఆచరించడం కూడా అనాదిగా వస్తోంది.

దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో..

దేవాదాయ శాఖ మంత్రి, కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని దేవాలయాల్లో కార్తీక దీపోత్సవాలు, ప్రసాదాల విక్రయం, ఆకాశ దీపం, ముత్తైదువులకు వాయినాలు అందజేస్తారు. బుధవారం అన్ని దేవాలయాల్లో కార్తీక దీపోత్సవాలను నిర్వహించనున్నారు.

వ్రతాల నిర్వహణ..

కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు, అనఘాష్టమి వ్రతాలు, హోమాలు, కుంకుమ పూజలు నిర్వహిస్తారు. ఆలయాల్లో అభిషేకాలు, కుంకుమ పూజలు, వ్రతాలు జరుపుకుంటారు.

ఉసిరి కొమ్మలు, కాయల విక్రయాలు..

కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉసిరి కొమ్మలు, ఉసిరి కాయలు, పూలు, దీపాంతలు, వొత్తులు, జామ పండ్లు అమ్మకాలు జోరందుకున్నాయి. వరంగల్ చౌరస్తా, హెడ్ పోస్టాఫీస్ సెంటర్, హనుమకొండ, వరంగల్ చౌరస్తా, కాజీపేట చౌరస్తాలో కొనుగోలుదారులతో సందడి నెలకొంది.

వేయిస్తంభాల ఆలయంలో

కార్తీక పౌర్ణమి వేళ చారిత్రక ప్రసిద్ధి పొందిన వేయి స్తంభాల ఆలయంలో ప్రత్యేకంగా లక్ష దీపోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే ప్రసిద్ధ షిరిడి సాయిబాబా ఆలయం, ములుగురోడ్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, దత్త క్షేత్రం, కాజీపేటలోని శ్వేతార్క మూల ఆలయం, రాగన్న దర్వాజ లోని శ్రీ సీతారాముల ఆలయం, చిన్న కోవెలలో, ఎక్సైజ్ కాలనీ శ్రీ వెంకటేశ్వరాలయం, బాలసముద్రంలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



రామప్ప ఐలాండ్ నమూనా

రామప్ప సరస్సులో స్మృతివనం ఎప్పుడో?

- రూ.90 కోట్లతో ఏర్పాటుకు మంత్రి జూపల్లి హామీ
- ముందుకు పడని అడుగు

వెంకటాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్పపై రాష్ట్ర పర్యాటకశాఖ చిన్నచూపు చూస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాక్షాత్తు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రామప్పను గత ఆగస్టులో సందర్శించిన సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ నీటిమూటలుగానే మిగిలాయి. శివుడి విగ్రహం హామీపై ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల అటు పర్యాటకులు, ఇటు భక్తులు శివశివా... నీపైనే మాట తప్పారంటూ గుసగుసలాడుకుంటున్నారు. అంతర్జాతీయ స్థాయి పర్యాటకుల సంఖ్య పెరుగుతున్నా ఆస్థాయిలో అభివృద్ధి జరగ డంలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రామప్ప సరస్సు ప్రాంతంలో కాకతీయ కళారూపాలను కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధానంగా సరస్సు మధ్యలోని ఐలాండ్‌లో భారీ శివలింగం, చెరువు కట్టపై శివుడి విగ్రహం, ధ్యాన మందిరం, పిల్లల కోసం శివుడి విగ్రహంతో ద్వీపం ఆధ్యాత్మికత సంతరించుకునేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, పర్యాటకశాఖ అధికారులకు సూచించినప్పటికీ ఇప్పటికీ ఫలితంలేదు.

భక్తులు సందర్శించుకునేందు కు వీలుగా రోప్‌వే నిర్మాణం చేపడతామని మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యాటకశాఖ అధికారులకు చెప్పినప్పటికీ ఇప్పటివరకు ఆహామీ నీటమూటగానే మిగిలింది. రూ.90 కోట్లతో ఏర్పాటు చేస్తామన్న స్మృతివనం స్థలం ఇప్పటికీ శూన్యంగానే దర్శనమిస్తోంది. రామప్ప ఆలయ పరిసర ప్రాంగణంలో ప్రసాద్‌స్కీంలో భాగంగా అనేక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.

కానీ, సరస్సు ప్రాంతంలో రాష్ట్రమంత్రి జూపల్లి కృష్ణారావు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.



ఐలాండ్‌లో ఏర్పాటుచేసే భారీ శివుడి విగ్రహం నమూనా







గృహ సిలిండర్ల మాయాజాలం

గ్యాస్ ఏజెన్సీల కక్కుర్తి

- వ్యాపార సంస్థలకు అక్రమంగా తరలింపు...
- బడా హోటళ్ల నుంచి చిరు వ్యాపారాల వరకు ఇష్టారాజ్యంగా వాడకం
- తనిఖీలే చేపట్టని అధికారులు

హనుమకొండ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్లు చిరు వ్యాపార సంస్థలకు తరలుతున్నాయి. సివిల్ సప్లయిస్ అధికారులు, కొన్ని గ్యాస్ ఏజెన్సీల కంపెనీలకు ఈ విధానం కాసులు కురిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఈ దందా నిరాటంకంగా సాగుతోంది. యధేచ్ఛగా డొమెస్టిక్ సిలిండర్లు కమర్షియల్ రంగాలకు తరలుతున్నాయి. ఇదంతా బాహాటంగానే గ్యాస్ సిలిండర్లు వ్యాపార సంస్థలకు చేరుతున్నాయి. చిరు వ్యాపార సంస్థల వినియోగం అందరికి కనిపించే దృశ్యమే. ఇంత విచ్చలవిడిగా దందా జరగడానికి సివిల్ సప్లయిస్ అధికారుల దురాశే. సిలిండర్ల తరలింపును అడ్డుకోరు. తనిఖీలు చేయడరు. ప్రజలు ఎవరైనా ప్రమాద అంశమై ఫిర్యాదు చేసినా జాన్ తా నహీ అంటూ తాపీగా ఉంటారు. గ్యాస్ ఏజెన్సీల నుంచి నెల వారిగా ముట్టాల్సిన మామూళ్లు చేతిలో పడితే చాలు ఏమైతే మాకేంటి ధోరణితో అధికారులు ఉన్నారు. మరో వైపు గ్యాస్ ఏజెన్సీలు కూడా అధికారుల అండతో అక్రమంగా సిలిండర్లను తరలిస్తూ అడ్డదారిలో దోచుకుంటున్నారు.

బడా హోటళ్ల నుంచి...

హనుమకొండ జిల్లాలోని బడా హోటళ్లు, రెస్టారెంట్లు, క్లౌడ్ కిచెన్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, కర్రీ పాయింట్లు ఇలా గ్రామ, మండల, నగరంలోని ప్రధాన జంక్షలు ఇతర చోట్ల టిఫిన్ సెంటర్లు, తోపుడు బండ్ల వ్యాపారాలు ఇతర చిన్నా చితక వ్యాపార సెంటర్ల యజమానులు డొమెస్టిక్ సిలిండర్లకు కమర్షియల్‌కు వినియోగిస్తున్నారు. ఈ విధానం నిబంధనలకు పూర్తి విరుద్ధం. వ్యాపార సంస్థలు కమర్షియల్ సిలిండర్లను మాత్రమే వినియోగించాలి. విరుద్ధంగా వ్యవహరిస్తే సివిల్ సప్లయిస్ అధికారులు కేసులు బనాయిస్తారు. అంతే కాదు నోటీసులు జారీ చేసి సీజ్ కూడా చేయవచ్చు. ప్రజా ప్రయోజనాల రీత్యా ఈ చర్యలు తీసుకుంటారు. కమర్షియల్ సిలిండర్లు నీలి రంగుతో ఉంటాయి. సిలిండర్ బరువు 19 కేజీలు. ఇక గృహ వినియోగ సిలిండర్లు రెడ్ కలర్‌తో ఉండి 14.2 కేజీల బరువుతో ఉంటాయి. ఇలా ఏ విభాగంలోని సిలిండర్లు ఆ మేరకే వినియోంచాల్సి ఉంటుంది.

మామూళ్ల మత్తు

హనుమకొండ జిల్లాలోని ఫుడ్ వ్యాపార రంగాల యజమానులు సివిల్ సప్లయిస్ అధికారులకు పెద్ద ఎత్తున మామూళ్లు అందచేస్తున్నారు. ఈ కారణంగా అధికారులు కమర్షియల్ సిలిండర్ల అక్రమ తరలింపును పట్టించుకోకుండా దందా సాఫీగా సాగేలా ఊతమిస్తున్నారు. నీలి రంగు నిలిండర్లను వినియోగం చిరు వ్యాపారాల సంస్థల్లో అయితే కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. గమనించిన వారు ఎవరైనా ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించరు. తనిఖీలు చేయరు. కేసుల నమోదు లేదు. ఇక కొందరు డొమెస్టిక్ కస్టమర్లు, సబ్సిడీ లబ్దిదారులు దురాశ కూడా దందాకు సహాయంగా మారింది. ప్రభుత్వం అందచేస్తున్న సబ్సిడీ సిలిండర్లను డబ్బులకు ఆశపడి గ్యాస్ ఏజెన్సీలకు సహకరిస్తున్నారు. డబ్బులు రావడంతో ఒకే కుటుంబంలోని వారు వేరు వేరుగా కూడా గ్యాస్ కనెక్షన్లు పొంది ఈ మార్గంలో సొమ్ము చేసుకుంటున్నారు.

గీత దాటుతున్న వినియోగం...


డొమెస్టిక్, కమర్షియల్ సిలిండర్లకు వేరు వేరుగా సెఫ్టీ మెజర్స్ ఉంటాయి. గ్యాస్ స్టవ్, పైప్, రెగ్యూలేటర్ తదితరమైనవి వేటి కవే వేరుగా రూపొందించడం జరుగుతుంది. డొమెస్టిక్ విభాగంలోని సిలిండర్లను విరుద్ధంగా వినియోగిస్తే పేలుడు సంభవించడానికి అవకాశాలు ఉన్నట్లే. ఇది తెలిసినా వ్యాపారులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. పేలుడు జరిగితే ప్రాణ నష్టంతో పాటు భారీ ఆస్తి కూడా ఉంటుంది. పైగా చుట్టూ పక్కల ఉన్న భవనాలు, ఇతర వ్యాపార రంగాలకు కూడా ప్రమాదం పొంచి ఉన్నట్లే. ఇంత ప్రమాద స్థితి నెలకొన్నప్పటికీ అధికారులు, గ్యాస్ ఏజెన్సీల కంపెనీలు కాసులకు కక్కుర్తి పడి బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు. ఇక మరింత ప్రమాదకరమైన అంశం ఏమిటంటే...డొమెస్టిక్ సిలిండర్‌లోని గ్యాస్‌ను వ్యాపారులు ఏమాత్రం సురక్షితం కానీ పద్దతిలో పైపుల ద్వారా కమర్షియల్ సిలిండర్లకు పంపింగ్ చేస్తున్నారు.

నేడే కందికొండ జాతర

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారగణం
- వేలాదిగా తరలిరానున్న భక్తజనం

కురవి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని కురవి మండలంలోని కందిగిరి పర్వతంపై నర్సింహాస్వామి, లక్ష్మీదేవిల జాతర బుధవారం జరగనుంది. ఇందుకోసం అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ జాతరకు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లోని భక్తులు వేలాదిగా హాజరవుతారు. రెండు కిలోమీటర్లకుపైగా ఎత్తులో ఉన్న గుట్టపైకి ఎక్కేందుకు సరైన దారి, మెట్లులేకపోవడంతో భక్తులు రాళ్లు, రప్పలు మళ్ల పొదల నుంచి పర్వతాన్ని అధిరోహించి స్వామివారిని దర్శించుకొంటారు.

జాతర కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్, మరిపెడ సీఐ రాజ్‌కుమార్ సీఐ కరుణాకర్, తహసీల్దార్ విజయ, ఎంపీడీవో వీరబాబులు కొద్ది రోజులుగా కందికొండ గుట్టను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జాతర కోసం తొర్రూరు డీఎస్పీ ఆధ్వర్యంలో మరో డీఎస్పీ, ఆరు గురు సీఐలు, 17 మంది ఎస్సైల ఆధ్వర్యంలో మొత్తం 160 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీరోలు ఎస్సై గండ్ర సంతోష్ తెలిపారు. దొంగతనాల నివారణకు సీసీఎస్ టీమ్‌లు, ఈవ్‌టీజర్ల అదుపునకు సివిల్ డ్రెస్సుల్లో ఉన్న షీ టీమ్స్ అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. భక్తులకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో నీటివసతి, నాలుగు చోట్ల ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు రవాణా కోసం మహబుబాబాద్ బస్ డిపో కందికొండకు స్పెషల్ బస్సులను నడుపనుంది.



కురవి మండలంలోని కందికొండ ఆలయంపై వెలిగించనున్న అఖండ దీపం



కందికొండ ఆలయంపై లక్ష్మీనర్సింహాస్వామి విగ్రహం

కల్యాణోత్సవం

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణమహోత్సవాలు బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే మొదలవుతాయి. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి, మంగళాశాసనములు గావించి కల్యాణ మహోత్సవాన్ని ఉదయంసమయాన్నే పూర్తిచేస్తారు. ఆపై భక్తులు స్వామివారిని దర్శించుకొంటారు.

అఖండజ్యోతి

సాయంత్రం సమయంలో మట్టి మూకుడులో కంది కొండ ఆలయంపై భాగాన అఖండజ్యోతిని వెలిగిస్తారు. ఈ మూకుడు నిండా నూనెపోసి, వస్త్రంతో మడతవేసి పెద్ద వత్తిగా చేసి వెలిగిస్తారు. ఈ దీపంలో నూనెను కందికొండ గ్రామానికి చెందిన ముస్లింలు అందించడం విశేషం. తరతరాలుగా ముస్లింలు నూనెలు అందించడం ఆచారంగా వస్తోంది. ఈ అఖండజ్యోతి చుట్టు పక్కల అనేక కిలోమీటర్ల వరకు కనిపిస్తుంది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

రెండు రోజుల్లో పంట నష్టం నివేదిక అందజేయాలి

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు సంబంధించిన పంట నష్టం అంచానా నివేదిక రెండు రోజుల్లో అందజేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని ధర్మసాగర్, వేలేరు మండలాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జరిగిన నష్టాలపై శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే కడియం సమీక్ష నిర్వహించారు. ధర్మసాగర్, వేలేరు మండలాల్లో భారీ వర్షాలతో వివిధ పంటలు, పశు సంపద, రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్న వివరాలను ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు, పంట నష్ట వివరాల నమోదు, తదితర వివరాలను సంబంధిత శాఖల అధికారులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్‌కు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ.. పంట నష్టం అంచనాలో అధికారులు నిబంధనలు పక్కన పెట్టి రైతులకు అనుకూలంగా వ్యవహరించాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చేపట్టిన సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. భారీ వర్షాలు మరో రెండు, మూడు రోజులు ఉన్న నేపథ్యంలో ధర్మసాగర్ రిజర్వాయర్ గేట్లు ఎత్తాలన్నారు.

క్లౌడ్ బరస్ట్ వరంగల్‌లోనే చూపిస్తున్నందున రిజర్వాయర్ గేట్స్ నుంచినీటి విడుదల చేయాలన్నారు. కలెక్టర్ స్నేహశబరీష్ మాట్లాడుతూ.. పంటలు, రోడ్లు, పశు సంపద నష్టంపై సంబంధిత శాఖల అధికారుల అంచనాలను త్వరగా అందజేయాలన్నారు.పాక్షికంగా, పూర్తిగా ఇండ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు ప్రతిపాదనలుఅధికారులు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీవో మేన శ్రీను, పంచాయతీ రాజ్ ఈఈ ఆత్మారాం, ఇరిగేషన్ ఈఈ మంగీలాల్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నకిలీ బంగారం అంటగట్టి మోసం

రూ. 10 లక్షలతో ఉడాయించిన ముఠా

కాటారంలో లబోదిబోమంటున్న కిరాణా షాపు యజమాని

కాటారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారు కొనుగోలు చేసి మోసపోయాడు ఓ కిరణా షాపు యజమాని. అర కిలో బంగారం రూ. 15 లక్షలకే ఇస్తామని నమ్మబలికిన ఓ ముఠా, అడ్వాన్స్‌గా రూ. 10లక్షలు తీసుకొని ఉడాయించింది. ఈ ఘటన భూపాలపల్లి జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. కాటారం మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలికి సమీపంలో ఉన్న కిరాణా షాపునకు రెండు వారాల క్రితం ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు వచ్చి సరుకులు కొనుగోలు చేశారు. తాము కూలి పనుల నిమిత్తం వచ్చామని చెప్పారు. ఆ తర్వాత మరో రోజు కూడా అదే దుకాణానికి వచ్చి సెల్‌ఫోన్ రీచార్జ్ చేయించుకున్నారు. మాటల సందర్భంగా షాపు యజమానితో తమకు ఒక చోట బంగారం దొరికిందని, దాన్ని తక్కువ ధరకే అమ్ముతామని చెప్పారు.

దీంతో ఆశ పడ్డ కిరాణా షాపు యజమాని బంగారం తీసుకొచ్చి తనకు చూపించమని అడిగాడు. వారు బంగారం ముద్ద నుంచి చిన్న ముక్కను కట్ చేసి తెచ్చామంటూ దాన్ని ఆ వ్యాపారికి ఇచ్చారు. దీంతో అతడు నగలు తయారు చేసే వారికి దాన్ని చూపించడంతో అది ఒరిజనల్ బంగారమని వారు తేల్చారు. దీంతో సంబరపడ్డ కిరాణా షాపు యజమాని ఆ నలుగురితో బేరమాడాడు. ఈ క్రమంలో షాపు వద్ద ఉన్న సీసీ కెమెరాలను ఆ వ్యక్తులు ఆఫ్ చేయాలని సూచించారు. బంగారాన్ని రూ. 15 లక్షలకు ఇవ్వడానికి ఒప్పుకున్న ముఠా సభ్యులు అడ్వాన్స్‌గా రూ. 10లక్షలు వ్యాపారి నుంచి తీసుకున్నారు. మూడు రోజుల్లో మిగతా డబ్బులు ఇస్తానని అతడు చెప్పడంతో అంగీకరించారు. ఆ ముఠా వద్ద నుంచి తీసుకున్న బంగారాన్ని అదే రోజు రాత్రి వ్యాపారి మరోసారి పరిశీలించగా అది నకిలీ బంగారమని తేలింది. దీంతో లబోదిబోమన్న అతడు పోలీసులను ఆశ్రయించాడు. బంగారం పేరుతో తాను మోసపోయానని చెప్పలేక, తన గల్లా పెట్టె నుంచి ఎవరో ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేశాడు.

దీంతో రూ. 10 లక్షలు గల్లా పెట్టె నుంచి పోవడమేమిటని పోలీసులకు అనుమానం వచ్చింది. నిజమేమిటో చెప్పమని ఆ వ్యాపారిని పోలీసులు గట్టిగా అడగ్గా అసలు విషయం చెప్పి భోరుమన్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం కేసు నమోదు చేసిన పోలీసులు కాటారం నుంచి కాళేశ్వరం వరకు ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించినట్లు తెలిసింది. నకిలీ బంగారం ముఠా మహారాష్ట్ర వైపు వెళ్లిందని సమాచారం. ఈ ఘటనపై పోలీసులు వివరాలు వెల్లడించలేదు.

కలకలం రేపిన 'ఇసుకాసుర'

- అక్రమాలపై ఇంటిలిజెన్స్ వర్గాల ఆరా
- చర్చనీయాంశంగా మారిన 'ఆంధ్రజ్యోతి' కథనం

వాజేడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇసుక తవ్వకాల్లో అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో మంగళవారం వెలువడిన ఇసుకాసుర కథనం కలకలం రేపింది. జిల్లాలోని ఓ ప్రధాన ముఖ్య అధికారి కనుసన్నల్లో జిల్లా, మండల అధికారుల అన్ని రకాలుగా మభ్య పెడుతూ ఈ దందా సాగుతుందని వెలుగులోకి రావడంతో చర్చనీయంశంగా మారింది. ఇసుకాసుర కథనంతో ఇసుక అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అక్రమంగా ఇసుక తోలకాలు జరుపుతున్న ఇసుక మాఫియా పై ఇంటిలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నాయి.

టెండర్లు వేసిన ఇసుక క్వారీల్లో కాకుండా మరోక చోట ఇసుక తవ్వకాలు జరుపుతూ రూ. కోట్లలో దండుకుంటున్న అక్రమార్కులపై ఇంటిలిజెన్స్ విచారణ చేస్తున్నట్లు సమాచారం. అదే విధంగా గతంలో రద్దు చేసిన క్వారీలకు అనుమతులు ఇవ్వడంపై కూడా అనుమానాలు వస్తుండటంతో టీజీఎండీసీ అధికారుల పాత్ర ఎంత ఉందని చర్చ మొదలైంది. ములుగు, భూపాలపల్లి జిల్లాలో రూ. 200 కోట్లకు పైగా ఇసుకను అక్రమార్కులు దోచుకోవడంతో ఈ ఇసుక తవ్వకాల్లో ఎవరి పాత్ర ఎంత ఉంది అనే చర్చ అన్ని వర్గాల్లో మొదలైంది. ఈ ఇసుక తవ్వకాల్లో చక్రం తిప్పుతున్న అధికార పార్టీకి చెందిన కీలక నేత పాత్ర పై కూడా కాంగ్రెస్ శ్రేణులు, అధికారులలో చర్చ మొదలైంది. ములుగు జిల్లాలో 10 ఇసుక క్వారీల్లో, భూపాలపల్లి జిల్లాలోని 5 క్వారీల్లో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని ఇప్పటికే విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో టీజీఎండీసీ అధికారుల్లో భయం మొదలైందని టాక్ వినిపిస్తుంది. ఇసుక అక్రమార్కులకు అండగా నిలుస్తున్న టీజీఎండీసీ అధికారుల ఉదాసీనతపై కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గతంలో జరిమానా

వెంకటాపురం మండలంలోని రామచంద్రాపురం ఇసుక క్వారీలో గతంలోజరిగిన విధంగానే ప్రస్తుతం బోదాపురం-2 ఇసుక ర్యాంపులో అక్రమాలు కొనసాగతున్నాయి. మైనింగ్ శాఖ నుండి ఎండీఎల్ అనుమతి లేకపోవడంతో రామచంద్రాపురం ర్యాంపుకు అప్పటి కలెక్టరు కృష్ణ ఆదిత్య జరిమానా విధించారు. కానీ ఇప్పుడు బహిరంగంగా అక్రమాలు చోటు చేసుకుంటున్నా జిల్లా అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

ఆన్‌లైన్‌లో కవితా సంపుటి వేలం

రూ.42వేలకు దక్కించుకున్న యువతి

వరంగల్ కల్చరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కొంకపాక గ్రామానికి చెందిన బొంపెల్లి శ్రీనివాస్ అనే యువకుడు తొలిసారిగా రచించిన కవితా సంకలనం 'నా దాహం.. ప్రపంచం'కు ఆన్‌లైన్‌లో విశేష స్పందన వచ్చింది. మన దేశ కరెన్సీ ప్రకారం రూ.42వేలకు అమెరికాలో నివసిస్తున్న మిర్యాలగూడకు చెందిన మైలవరపు అఖిల అనే యువతి మొదటి పుస్తకాన్ని కొనుగోలు చేశారు. తెలంగాణ పబ్లికేషన్స్ హైదరాబాద్ వారు ముద్రించిన ఈ పుస్తకాన్ని ఆదివారం రాత్రి అమెరికాలో ఆన్‌లైన్ కవి బొంపెల్లి శ్రీనివాస్ స్నేహితులు, అభిమానులు ఆన్‌లైన్‌లో విక్రయానికి పెట్టారు. ఈ పోటీలో అఖిల అనే యువతి రూ.42వేలకు కొనుగోలు చేయడం గమనార్హం. త్వరలోనే ఈ పుస్తకాన్ని దేశంలోని పాఠకులందరికీ ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తెస్తామని శ్రీనివాస్ స్నేహితులు తెలిపారు. ఈ సందర్భంగా కవి శ్రీనివాస్ తల్లిదండ్రులు బొంపెల్లి దేవేందర్‌రావు లక్ష్మీ, శ్రీనివాస్ స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.



బొంపెల్లి శ్రీనివాస్ రాసిన నా దాహం.. ప్రపంచం పుస్తకం

కేయూలో పీహెచ్‌డీ సీట్లు పెంచాలి


రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంకు వినతి పత్రాన్ని ఇస్తున్న అభ్యర్థులు

కేయూ క్యాంపస్ నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేయూ తెలుగు విభాగంలో పీహెచ్‌డీ సీట్లను పెంచాలని మంగళవారం విద్యార్థులు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను కలిసి తన చాంబర్‌లో వినతి పత్రాన్ని అందచేశారు. రెండు సీట్లకు 30 మంది ఆశవవాహులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారని, అర్హులైన అధ్యాపకులకు పీహెచ్‌డీ గైడ్‌షిప్ అవకాశం కల్పించి తమకు న్యాయం చేయాలని కోరారు. జేఆర్ఎఫ్ ఫెల్లోషిప్, ఎంఫిల్, నెట్, స్లెట్ అర్హతలు సాధించిప్పటికీ పరిశోధన చేసే అవకాశం లేకుండా పోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, యాదగిరి, సునిల్, శైలజ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పూర్ ఊర చెరువు
గేట్లు ఎత్తివేత


డక్ట్‌కు అమర్చిన గేట్లను ఎత్తివేస్తున్న ఐబీ, మున్సిపల్ సిబ్బంది

వడ్డెపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వందఫీట్ల రోడ్డులో గోపాల్‌పూర్ ఊర చెరువు వద్ద నిర్మించిన డక్ట్ డ్రెయిన్‌కు అమర్చిన గేట్లను మంగళవారం నీటిపారుదల శాఖ, మునిసిపల్ సిబ్బంది ఎత్తివేశారు. కేయూ వందఫీట్ల రోడ్డు గోపాల్‌పూర్, అమరావతి నగర్ వద్ద డక్ట్ డ్రెయిన్‌కు అమర్చిన గేట్లను ఎత్తివేయడం కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు కాలనీలు జలమయమై ప్రజలు ఆస్తి నష్టానికి గురయ్యారు. ఈ గేట్లను ఎత్తివేయని ఫలితంగా వడ్డేపల్లి ఎగువ ప్రాంతం నుంచి మత్తడి ద్వారా వచ్చే వరద నీరు గోపాల్‌పూర్ ఊర చెరువులోకి చేరింది. డక్ట్‌కు అమర్చిన గేట్లను తుఫాన్‌కు ముందు ఎత్తివేయకపోవడంతో వరద నీరు ఉధృతి పెరిగి హనుమకొండలోని పరిమళకాలనీ, జవహర్‌కాలనీ, ద్వారకాసాయి కాలనీ, వివేక్ నగర్ కాలనీ, అమరావతి నగర్ ప్రాంతాల కాలనీలు జలమయమయ్యాయి. గేట్లను ఎత్తివేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు ఆదేశించడంతో 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు సమక్షంలో ఐబీ, మునిసిపల్ సిబ్బంది గేట్లను ఎత్తివేశారు.

ముగిసిన జిల్లా స్థాయి ఖోఖో ఎంపికలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌జీఎఫ్‌ఐ నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 4ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) అండర్-19 ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్‌లో వివిధ క్రీడాంశాల్లో నిర్వహిస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలు ముగిశాయి. మంగళవారం హనుమకొండ లష్కర్‌బజారులోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో అండర్-19 బాల బాలికల ఖోఖో ఎంపిక పోటీలను నిర్వహించినట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయిలో నిర్వహించిన ఖోఖో ఎంపిక పోటీల్లో 250మంది బాల బాలికలు పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-19 ఖోఖో పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ మేరకు జిల్లా స్థాయి పోటీలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారుకు సర్టిఫికెట్లను నిర్వాహకులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పీడీలు బరుపాటి గోపి, సతీష్, ఎస్ఏ పీఈటీలు ప్రభాకర్‌రెడ్డి, కుమార్, రాణి పాల్గొన్నారు.

దళిత క్రైస్తవ ఐక్యవేదిక జిల్లా ఇన్‌చార్జిగా రవి


నియామక పత్రాలు అందజేస్తున్న సంస్థ సభ్యులు

కాజీపేట, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : దళిత క్రైస్తవ ఐక్యవేదిక హనుమకొండ జిల్లా ఇన్‌చార్జిగా కడిపికొండకు చెందిన కొడవటి రవిని నియమిస్తూ ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈర్ల కుమార్ మంగళవారం నియామకం చేశారు. ఈ మేరకు రవికి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు దళిత క్రైస్తవులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తీరుస్తానని కొడవటి రవి చెప్పారు. తన నియామకానికి సహకరించిన జిల్లా కన్వీనర్ మాతంగి రాజు, మాదాసి భిక్షపతి, కె.జేమ్స్‌తో పాటు ప్రతీ ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..

ఆర్థిక సాయం అందజేత

వడ్డెపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు హనుమకొండ 56వ డివిజన్ వివేక్ నగర్ కాలనీకి చెందిన మహ్మద్ కౌసర్ శరీన్ నివాసగృహం వరద ప్రభావం వల్ల ధ్వంసమయింది. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు క్షేత్రస్థాయిలో పర్యటించి కౌసర్ శరీన్‌కు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశం మేరకు 56వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంకా హరిబాబు తదితరులు మంగళవారం అందజేశారు.

వ్యక్తి అదృశ్యం


కె. రాజేశ్

కాజీపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కాజీపేటకు చెందిన ఓ మతి స్థిమితం కోల్పోయిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై బి. శివ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కామిని రాజేశ్, వయస్సు 45, ఎత్తు 5.3 నలుపురంగు, కోల ముఖం, బ్లూ కలర్ టీ షర్ట్, బ్లాక్‌ప్యాంట్ ధరించాడు. ఇతడికి గత కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. ఆచూకీ తెలిసిన వారు కాజీపేట పోలీస్‌స్టేషన్, 97038 49050 మొబైల్ నంబర్‌కైనా సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు..

కాల్ చేసుకుంటానని మోసం

ఫోన్ పే నుంచి రూ.20వేలు ట్రాన్స్‌ఫర్


మేకల నరేశ్ (బాధితుడు)

కాజీపేట, నవంబరు 4 ఆంధ్రజ్యోతి) : ఫోన్ ఇచ్చి సహాయం చేస్తామనుకున్న ఓ వికలాంగుడికి మరో యువకుడు ఎగనామం పెట్టి ఫోన్ పే నుంచి నగదు ట్రాన్స్‌ఫర్ చేసుకుని ఉడాయించాడు.. వివరాలిలా ఉన్నాయి.. కాజీపేట సోమిడికి చెందిన మేకల నరేశ్ నగరంలో పీజీ చేస్తున్నాడు. మంగళవారం కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో మార్గమధ్యలో వర్షం రావడంతో రోడ్డుపై ఆగాడు. ఈ క్రమంలో ఓ యువకుడు నరేశ్ వద్దకు వచ్చి అన్నా ఫోన్ ఇస్తావా ఇంటికి కాల్ చేసుకుంటానని అనడంతో నరేశ్ ఆ యువకుడికి ఫోన్ ఇచ్చారు. సదరు యువకుడు క్షణాల్లో ఫోన్‌పే నుంచి రూ20 వేలు ట్రాన్స్‌ఫర్ చేసుకుని ఫోన్‌పేను అన్ ఇన్‌స్టాల్ చేసి ఫోన్ ఇచ్చి ఉడాయించాడు.. నరేశ్ సోమిడిలోని తన ఇంటికివచ్చి ఫోన్ పే చూసే సరికి ఫోన్‌పే అన్ ఇన్‌స్టాల్ అయ్యింది. తిరిగి ఫోన్‌పే డౌన్‌లోడ్ చేసుకుని చూసుకునే సరికి నగదు మాయమైంది. నరేశ్ సైబర్‌క్రైమ్, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్ డిమాండ్
- ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో నిరసనలు



ఎమ్మెల్యే నాయిని క్యాంప్ ఆఫీస్ వద్ద నిరసన చేస్తున్న మంద శ్రీకాంత్

కేయూ క్యాంపస్ నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. మంగళవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ వద్ద ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్, స్టాలిన్‌ల నేతృత్వంలో విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన ప్రదర్శనలకు దిగారు. ఈ సందర్భంగా స్టాలిన్, శ్రీకాంత్‌లు మాట్లాడుతూ.. విద్యరంగ సమస్యలను పరిష్కరించని సీఎం రేవంత్‌రెడ్డి పదవీకి రాజీనామా చేయాలన్నారు. మూడేళ్ళుగా తెలంగాణలో రూ. 8150కోట్లు విద్యార్థులకు బకాయిలున్నాయని చెప్పారు. బకాయిలతో విద్యార్థుల సర్టిఫికెట్లు అందడం లేదన్నారు. ఫీజుల చెల్లించాలంటూ ప్రైవేట్ విద్యా సంస్థలు బంద్‌కు దిగాయన్నారు. దీంతో చర్యలకు దిగిన రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ విద్యా సంస్థలకు రూ.1200 కోట్లు ఇస్తామని చెప్పి రూపాయి కుడా ఇవ్వలే దన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల సమస్యల ను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తా మని హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీసులు విద్యా ర్థులను అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, సభ్యులు బొజ్జ హేమంత్, బొ చ్చు ఈశ్వర్, చెన్నూరి సాయికు మార్, మల్లేశ్, ఎమ్డీ ఇస్మాయిల్, రాకేశ్‌రెడ్డి, పవన్‌కు మార్, అభిషేక్, అరు ణ్, సందీప్, సూరజ్, రాహుల్, రణధీప్, కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

- వరంగల్ ఎడ్యుకేషన్ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేష్‌నాయక్ హెచ్చరించారు. మంగళవారం హనుమకొండలోని కేడీసీ ఎదుట పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, వృత్తి విద్యాకళాశాలు అన్ని బంద్‌ను పాటించినా ప్రభుత్వం మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫీజు బకాయిలను కాలేజీలకు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నితిన్, చందు, శ్రీనాథ్, బన్నీ, మహేష్, రాజు పాల్గొన్నారు.


డీఆర్ఎం గోపాల్‌రావును కలిసి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్

హసన్‌పర్తిలో పలు రైళ్ళకు హాల్టింగ్ ఇవ్వాలి

హసన్‌పర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : హసన్‌పర్తి రైల్వే స్టేషన్‌లో పలు రైళ్ళకు హాల్టింగ్ అనుమతి ఇవ్వాలని స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ మంగళవారం డివిజనల్ రైల్వే మేనేజర్ ఆర్.గోపాల్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి మెమోరాండం అందజేశారు. మంగళవారం డివిజనల్ రైల్వే మేనేజర్ ఆర్.గోపాల్‌రావు హసన్‌పర్తి రైల్వేస్టేషన్‌ను సందర్శించి రైల్వే లైన్ పనులను, రైల్వేస్టేషన్ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శివకుమార్ హసన్‌పర్తి రైల్వే స్టేషన్‌లో పలు సమస్యలను డివిజనల్ రైల్వే మేనేజర్‌కు వివరించారు. హసన్‌పర్తి రైల్వేస్టేషన్‌లో ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్ళు ఆపేందుకు కృషి చేయాలని కోరారు. అంతేకాకుండా రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా డీఆర్ఎంను కలిసిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి, మాజీ మార్కెట్ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి కొయ్యడ రాజు, ఇమ్మడి కరుణాకర్, కుంబార్‌కార్ సాయికుమార్ తదితరులున్నారు.

ప్రతిభతోనే విద్యార్థులకు గొప్ప అవకాశాలు

మల్టీజోన్-1 ఇన్‌చార్జి ఆర్‌జేడీ ఎ.గోపాల్‌రావు



మాట్లాడుతున్న డీఐఈఓ, మల్టీజోన్-1 ఇన్‌చార్జి ఆర్‌జేడీ ఎ.గోపాల్‌రావు

హసన్‌పర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభతోనే విద్యార్థులకు గొప్ప గొప్ప అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని డీఐఈవో, మల్టీజోన్-1 ఇన్‌చార్జి ఆర్‌జేడీ ఎ.గోపాల్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.సునీత ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాబోయే ఇంటర్ వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకొని మంచి మార్కులు సాధించేందుకు విద్యార్థులు ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. విద్యార్థుల ప్రతిభకు కొదవలేదన్నారు. ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం ప్రోత్సాహంతో అందరూ మంచి మార్కులు సాధించి రాష్ట్రంలో మారోమారు స్టేట్ ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ చకిలం రాజేశ్వర్‌రావు, జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, సుమాదేవి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్‌ను 20 శాతానికి పెంచాలి

వడ్డెపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్‌ను 15 నుంచి 20 శాతానికి పెంచాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర నేత, వరంగల్ పశ్చిమ నియోజక వర్గ ఇన్‌చార్జి పనికల శ్రీనివాస్, హనుమకొండ, కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి వెన్నె రాజు డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారితో పాటు జాతీయ మాల మహానాడు యూత్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గరిగె అనిల్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ జీవో నంబర్ 99 రాజ్యాంగ వ్యతిరేకంగా ఉందని దాన్ని పునఃపరిశీలించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ప్రైవేటు రంగంలో ఎస్సీలకు రిజర్వేషన్లను అమలు చేయాలని, మాల సామాజిక వర్గానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ హక్కుల రక్షణ కోసం ఈ నెల 25, 26 తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జాతీయ మాల మహానాడుతో పాటు దాని ఉప కులాల ఆధ్వర్యంలో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జాతీయ మాల మహానాడు జిల్లా నాయకులు పడుగుల నర్సయ్య, మల్లం రాజ్‌కుమార్, బొల్లం రాంకుమార్, గొర్రె రమేష్, ఉసిల్ల ఉదయ్, కూనమల్ల అనిత, అంకూస్ రవికుమార్, గరిగె రాజ్‌కుమార్, సంపతి రఘు, ముప్పిడి శ్రవణ్, నరేష్, కుమార్, మల్లేష్ పాల్గొన్నారు.

10 నుంచి కేయూలో బీసీ విద్యార్థుల ధర్మదీక్ష

కేయూ క్యాంపస్ నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నవంబరు 10నుంచి కేయూ దూరవిద్య కేంద్రం ప్రాంగణంలో బీసీ విద్యార్థుల ధర్మదీక్ష చేపడుతున్నట్లు కేయూ బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఆరెగంటి నాగరాజుగౌడ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒకప్రకటన విడుదల చేశారు. వర్సిటీలు బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి కేంద్రాలని పేర్కొన్నారు. కేయూ విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు, యువజనులు సంపూర్ణ మద్దతుతో దీక్షలుసాగుతాయని వివరించారు. వరంగల్ గడ్డ నుంచి తెలంగాణ ఉద్యమం సాగిన స్ఫూర్తితో బీసీ ఉద్యమం సాగుతోందని స్పష్టం చేశారు. విద్యార్థి లోకంతా దీక్షలకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉమ్మడి జిల్లా జేఏసీ చైర్మన్ చందా మల్లయ్య


డీఆర్ఓ వైవి గణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉమ్మడి జిల్లా జేఏసీ చైర్మన్ డాక్టర్ చందా మల్లయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్‌కు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉమ్మడి జిల్లా జేఏసీ నాయకులు, ఇంటలెక్చువల్ ఫోరం బీసీజాక్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చందా మల్లయ్య మాట్లాడుతూ. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసే బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి ఈ బిల్లుకు చట్టబద్ధత కల్పించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. డీఆర్‌వోను కలిసిన వారిలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, బీసీ జాక్ కన్వీనర్ తిరునహరి శేషు, డాక్టర్ కే.వీరస్వామి, సదాలక్ష్మీ, శ్రీనివాస్, సుమన్, సాయిబాబా, రమేష్, జైపాల్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత ప్రణాళికలు రూపొందించాలి

వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద, స్నేహశబరీష్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగరాన్ని ముంపు నుంచి తప్పించేందుకు శాశ్వత ప్రణాళికలు రూపొందించాలని, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారద, స్నేహశబరీష్ సంయుక్తంగా అన్నారు. మంగళవారం హనుమకొండ కుడా కార్యాలయంలో వివిధ విభాగాల వింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వరంగల్ పరిధిలో ఉన్న చెరువులు, ముంపు కాలనీలు, డ్రైన్ డక్కులు, చెరువుల పరిస్థితి, ఆక్రమణలు, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో డక్కుల నిర్మాణం, నాలాలు, డ్రెయినేజీ విస్తరణ, నిర్మాణ వ్యయ అంశాలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. ఈ సమావేశంలో వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సంయుక్తంగా మాట్లాడారు. వరంగల్ నగరంలో భవిష్యత్ ప్రయోజనాల వరద ముంపు నుంచి తప్పించేందుకు శాశ్వత సమగ్ర ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారని తెలిపారు. ఈ మేరకు నిపుణుల సలహాల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ వరద ముంపు శాశ్వత నివారణకు పటిష్టమైన ప్రణాళిక తయారు చేయాలన్నారు. సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్లు వెంకట్‌రెడ్డి, సంధ్యారాణి, మునిసిపల్, ఇరిగేషన్ ఎస్ ఈలు సత్యనారాయణ, రాంప్రసాద్, కుడా సీపీవో అజీత్‌రెడ్డిలతో పాటు అధికారులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు నివేదిక రూపొందించాలి

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జాతీయ విపత్తు నివారణ సంస్థ నిబంధనలకు అనుగుణంగా నివేదిక రూపొందించి అందించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో ఇంజనీరింగ్, అకౌంట్స్, ఉద్యానవన అధికారులతో వరద నష్టంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. నగర పరిధిలో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, ఎలక్ట్రికల్ సంబంధిత పరికరాలు అంశాలపై అధికారులు అప్రమత్తం కావాలని అన్నారు. జాతీయ విపత్తు సంస్థ (ఎన్‌డీఆర్ఎఫ్)కు నివేదిక అందజేయడానికి నిబంధనల మేరకు నివేదిక రూపొందించాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో నగరంలోని 66 డివిజన్‌లలో దెబ్బతిన్న వస్తువులు, ప్రభుత్వ సామాగ్రిని జాగ్రత్తగా రికవరీ చేయాలన్నారు.

పడిపోయిన విద్యుత్ పోల్స్‌ను వేగవంతంగా పునరుద్ధరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఈ సమావేశంలో సీహెచ్‌వో పలాస రమేష్, అకౌంట్స్ అధికారి శివలింగం, డీఈలు కార్తీక్‌రెడ్డి, రోజారాణి, ఏఈలు సరిత, నరేష్‌లు పాల్గొన్నారు.


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి

గురుకుల పాఠశాల విద్యార్థులకు బంగారు పతకాలు

మడికొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించిన అంతర్ జిల్లా జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో మడికొండ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొని బంగారు, వెండి పతకాలను సాధించారు. 70 కేజీల విభాగంలో కె. రేవతి బంగారు పతకం, 36 కిలోల విభాగంలో టి. వైష్ణవి కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. ఈ విద్యార్థులను ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి , కోచ్ నాగరాజు, పీడీ పద్మ, పీఈటీ సరిత, ఉపాధ్యాయులు మంగళవారం పాఠశాలలో అభినందించారు.



ప్రదర్శన చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన

కేయూ క్యాంపస్ నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ప్రదర్శనల్లో కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ నేతృత్వంలో అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌కుమార్‌లోథ్ మాట్లాడుతూ.. తమను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులరైజేషన్ ప్రక్రియ అలస్యమైతే బేసిక్ పే, డీఏ, హెచ్ఆర్ఏ, ఇంక్రిమెంట్‌లు కల్పించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొ న్నారు. అధ్యాపక జాక్ నేతలు డాక్టర్ పరశురాం, బైరి నిరంజన్ పాల్గొన్నారు.

వృద్ధులు ఉచిత సేవలను వినియోగించుకోవాలి

హనుమకొండ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వయో వృద్ధుల కోసం జిల్లా పరిషత్ ఆవరణలో డేకేర్ సెంటర్‌లో అందిస్తున్న ఫిజియోథెరఫి సేవలను వృద్ధులు వినియోగించుకోవాలని సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనితారెడ్డి అన్నారు. మంగళవారం ఫిజియోథెరఫి క్లినిక్, లీగల్ ఎయిడ్ క్లినిక్ కార్య కలాపాలను పరిశీలించి అక్కడ పనిచేస్తున్న వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథా రిటీ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత న్యాయ సలహాలు, ఫిజియో థెరఫీ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయని ఆమె గుర్తు చేశారు. సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు జిల్లాలోని వృద్ధులకు వరంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉష, పారా లీగల్ వలంటీర్ ఉపేందర్, వాణి, తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలి

చుండ్రు చికాకు పెడుతోందా?

శీతాకాలంలో బాగా చికాకు పుట్టించే సమస్య చుండ్రు. చలి గాలి, తేమ తక్కువగా ఉండడం తదితర కారణాలవల్ల తలపై చర్మం పొడి బారుతుంది. దీంతో పొలుసులు వచ్చి, దురద మొదల వుతుంది. అయితే చిన్న చిన్న చిట్కాలతో దీని నుంచి ఉపశమనం పొందవచ్చంటున్నారు నిపుణులు.

హైడ్రేటింగ్ షాంపూ: ఇది పొడిబారిన చర్మంపై తేమను పునరుద్ధరించడానికి దోహదపడుతుంది. ఈ షాంపూల్లో ఉపయోగించే కలబంద, కొబ్బరి పాలు, గ్లిజరిన్ లాంటివి తలపై చర్మానికి పోషకాలు అందించి సమతుల్యతను కాపాడతాయి. అయితే సల్ఫేట్, ఆల్కహాల్‌తో కూడిన షాంపూలకు దూరంగా ఉండండి. ఇవి సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి.



నూనెతో మర్దన: తలకు తరచూ నూనె పెట్టుకో వడం అమ్మమ్మల కాలం నుంచి అనుసరిస్తున్నదే అయినా... చుండ్రును నివారించడంలో ఇది ప్రభావ వంతంగా పని చేస్తుంది. ముఖ్యంగా చలి కాలంలో. కొబ్బరి నూనె లేదా ఆలివ్, ఆల్మండ్ తదితర సహజ సిద్ధమైన నూనెలు తలకు తేమను అందిస్తాయి. చర్మాన్ని పొడిబారకుండా రక్షిస్తాయి. తలకు నూనె పట్టించి, వేళ్లతో సున్నితంగా మర్దన చేస్తే... కుదుళ్ల వరకు చేరి, రక్త ప్రసరణను మెరుగవుతుంది. కనీసం అరగంట తరువాత లేదంటే రాత్రి పడుకొనే ముందు రాసుకొని తెల్లారి షాంపూతో స్నానం చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

గోరువెచ్చటి నీరు: చలి కాలంలో వేడినీళ్ల స్నానం హాయిగా అనిపిస్తుంది. కానీ బాగా వేడిగా ఉన్న నీటితో తల స్నానం చేస్తే చర్మం మరింత పొడిబారుతుంది. మాడులోని సహజసిద్ధమైన తేమను తగ్గిస్తుంది. చుండ్రు రావడానికి కారణమవు తుంది. అందుకే గోరువెచ్చని లేదా చన్నీటితో తల స్నానం చేయడం ఉత్తమం.

సమతుల ఆహారం: చుండ్రు నివారణలో మనం తీసుకొనే ఆహారం ప్రముఖ పాత్ర పోషిస్తుంది. సాధా రణంగా శీతాకాలంలో వేడివేడిగా ఉండే నూనెలో వేయించిన ఆహార పదార్థాలు తీసుకొంటాం. నీళ్ల తక్కువగా తాగుతాం. వీటివల్ల తల చర్మం పొడిబారి, పొట్టు వస్తుంది. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, జింక్, విటమిన్ బి, ఇ అధికంగా ఉండే నట్స్, ఆకుకూరలను మీ మెనూలో చేరిస్తే... అవి చర్మాన్ని హైడ్రేట్‌గా ఉంచడానికి సహకరిస్తాయి. అలాగే నీళ్ల పుష్కలంగా తీసుకోవాలి. హెర్బల్ టీలు కూడా మంచి ఫలితాలని స్తాయి.

పిల్లలు తప్పుదారి పట్టకుండా...

తల్లిదండ్రులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఒక్కోసారి పిల్లలు తప్పుదారి పడుతుంటారు. అలాకా కుండా పిల్లలను బాధ్యతాయుతంగా తీర్చిదిద్దే క్రమంలో తల్లిదండ్రులు అనుసరించాల్సిన పద్ధతుల గురించి తెలుసుకుందాం...

- పిల్లలు సాధారణంగా మంచి కంటే చెడువైపే ఎక్కువగా ఆకర్షితులవుతూ ఉంటారు. కాబట్టి వాళ్ల ప్రవర్తనని తరచూ గమనిస్తూ ఉండాలి. పిల్లలు ఏదైనా పొరబాటు చేస్తే దాని గురించి వివరిస్తూ తప్పు ఒప్పుల తారతమ్యాన్ని విడమరిచి చెప్పాలి. అలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలి.



- పిల్లలపై ఆంక్షలు పెట్టకూడదు. వాళ్లకి ఆసక్తి లేని లక్ష్యాలను నిర్దేశించకూడదు. చదువు విషయంలో చిన్నారులను ఒత్తిడికి గురిచేయకూడదు. దీనివల్ల పిల్లల్లో సృజనాత్మకత తగ్గిపోతుంది. నిరాశ, నిస్పృహ లతో వాళ్లు చెడు మార్గాలను అనుసరించే ప్రమాదం ఏర్పడుతుంది. పిల్లలు ఏ అంశంలో ఆసక్తి చూపిస్తు న్నారో తెలుసుకుని ప్రోత్సాహాన్ని అందించాలి.
- పిల్లలతో స్నేహపూర్వకంగా మెలగాలి. వాళ్ల మనసులోని భావాలను, అభిప్రాయాలను వ్యక్తపరిచే స్వేచ్ఛ ఇవ్వాలి. అప్పుడే పిల్లల వ్యక్తిత్వాన్ని చక్కది ద్దడం సాధ్యమవుతుంది.
- పిల్లలను మరొకరితో పోల్చకూడదు. తోబుట్టు వుల మధ్య అంతరాలు పెరగకుండా చూడాలి. పిల్లల్లో ఏర్పడే ప్రతికూల భావాలను ఎప్పటికప్పుడు తొల గించే ప్రయత్నం చేయాలి. పిల్లల్లోని సానుకూలత లను గుర్తించి మనస్ఫూర్తిగా అభినందించాలి.
- పిల్లలకు సవాళ్లను ధైర్యంగా స్వీకరించడం అల వాటు చేయాలి. ఏ పనినైనా ఇష్టంగా పూర్తిచేయడం నేర్పించాలి. దీనివల్ల పిల్లల్లో పోరాట పటిమ, దేన్నయినా సాధించాలన్న తపన పెరుగుతాయి.

వార్తల్లో వ్యక్తి



అంతర్జాతీయ పోటీలో మన మహిళా రేసర్

పూణెకు చెందిన 32 ఏళ్ల దయానా పుండోలె... తన ఫెరారి కారుతో అంతర్జాతీయ పోటీకి సిద్ధమవుతోంది. ఈ నెల నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకూ జరిగే 'ఫెరారీ క్లబ్ ఛాలెంజ్ మిడిల్ ఈస్ట్' కార్ల రేసులో పాల్గొనబోతున్న ఈ రేసర్ గురించిన ఆసక్తికరమైన విశేషాలు...

మధ్యప్రాచ్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఫార్ములా వన్ సర్క్యూట్స్‌లో తన ఫెరారీ 296 ఛాలెంజ్ కారుతో దయానా పుండోలె పోటీ పడుతోంది. ఈ పోటీలో భాగంగా ఆమె దుబాయి, అబుదాబి, బహ్రెయిన్, ఖతార్, సౌదీ అరే బియాల్లోని సర్క్యూట్స్‌లో సత్తా చాటబోతోంది. సాధార ణంగా రేసు కార్ల పోటీలు పురుషులకే పరిమితం. అలాం టిది ఒక మహిళ ఈ రంగంలోకి ప్రవేశించి, గుర్తింపు పొందే స్థాయికి ఎదగడం అసాధారణమైన విషయమే! ఈ విషయంలో దయానా తన తండ్రి నుంచి స్ఫూర్తి పొందింది. రేసింగ్ పట్ల మక్కువ కలిగిన ఆ దివంగత మోటార్‌స్పోర్ట్స్ ఔత్సాహికవేత్త గురించి మాట్లాడుతూ... "రేసింగ్ పట్ల నాన్నకున్న మక్కువే నన్ను ఈ రంగంలోకి అడుగుపెట్టేలా ప్రోత్సహించింది. ఇప్పుడు ఆయన భౌతికంగా నాతో లేకపోయినా... నేను ట్రాక్ మీద ప్రయాణిస్తున్న ప్రతిసారీ ఈ క్రీడ పట్ల ఆయనకున్న మక్కువ నన్ను ముందుకు నడిపి స్తూనే ఉంటుంది" అంటూ తన తండ్రి గురించి చెప్పుకొచ్చింది దయానా!



నాన్న స్ఫూర్తితో...

కార్ల రేసులో దయానా ప్రస్థానం 2018లో మొదలైంది. క్రమేపీ మోటార్‌స్పోర్ట్స్‌లో ర్యాంకులు సాధిస్తూ, 2024లో మద్రాస్ ఇంటర్నేష నల్ సర్క్యూట్‌లోని ఎమ్ఆర్ఎఫ్ సెలూన్ కేటగిరీలో చేపట్టిన జాతీయ స్థాయి రేసింగ్ పోటీలో గెలిచింది. ఆ పోటీలో గెలిచిన మొట్టమొదటి భారతీయ మహి ళగా గుర్తింపు తెచ్చుకునే స్థాయికి ఎదిగింది. ఒక జాతీయ స్థాయి రేసింగ్ పోటీలో ఒక మహిళ పురుష ప్రత్యర్థులను వెనక్కు నెట్టి గెలుపొందడం అదే ప్రథమం. ఆ విజయం గురించి ప్రస్తావిస్తూ... "జెండర్ కాదు, సామర్థ్యమే ఒక రేస ర్‌ను నిర్వచిస్తుందనే నమ్మకం ఆ విజ యంతో బలపడింది" అంటూ వివ రించింది దయానా. ఆ విజయంతో, కార్ల రేసింగ్ పట్ల దయానాకు ఉన్న నిబ ద్ధత, పట్టుదల స్పాన్సర్ల దృష్టిని ఆక ట్టుకున్నాయి. బెంగుళూరుకు చెందిన రేస్ టెక్ ఇండియా... 2022 నుంచి ఆమె రేసింగ్ పోటీలకు మద్దతు ఇవ్వడం మొదలుపెట్టింది. ఆమె జాతీయ స్థాయి విజయం తరువాత... అలైన్డ్ ఆటోమేషన్, ఫెరారీ న్యూఢిల్లీలు మధ్యప్రాచ్యంలో జరగబోతున్న ఫెరారీ ఛాలెంజ్‌లో ఆమె పాల్గొనేందుకు మార్గం సుగమం చేశాయి.

ఫెరారీ 296 ఛాలెంజ్

రేసింగ్ కోసం ఫెరారీ 296 ఛాలెంజ్ కారును ఎంచుకోవ డంతో దయానా రేస్ ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. ప్రత్యేకంగా రేసులకు తగ్గట్టు మార్పులు చేసిన ఈ కారులో 700 హార్స్‌పవర్ వి6 ఇంజన్ బిగించి ఉంటుంది. కేవలం 1330 కిలోల బరువు మాత్రమే ఉండే ఈ కారు అత్యాధునిక యంత్రంలాంటిది. దీని ఏరోడైన మిక్స్, నడిపే సౌలభ్యం, కచ్చితత్వాలు మరో స్థాయిలో ఉంటాయి. "నా మునుపటి కార్లతో పోలిస్తే ఈ కారును నడపడం కాస్త కష్టమే! అయినప్పటికీ అంతిమంగా పొందే ప్రతిఫలం అద్భుతంగా ఉంటుంది" అంటూ తన రేసు కారు గురించి వివరిస్తున్న దయానా, దుబాయ్ ఆటోడ్రోమ్ యాస్ మెరీనాతో పాటు, బహ్రెయిన్ అంతర్జాతీయ సర్క్యూట్‌లో పోటీ పడబోతోంది. గతంలో ఆ ప్రదేశాల్లో శిక్షణ పొందాననీ, తిరిగి అవే సర్క్యూట్స్‌లో పోటీలో పాల్గొ నడం ఎంతో ఆనందంగా ఉందనీ కూడా చెప్పుకొస్తోంది దయానా.

వేగం ఒక్కటే సరిపోదు

కార్ల రేసు పోటీలకు సిద్ధపడుతున్న దయానా భౌతిక సామర్థ్యంతో పాటు మానసిక ఏకాగ్రతను కూడా మెరుగుపరుచుకుంటోంది. అందుకోసం కార్డియోతో పాటు స్ట్రెంగ్త్ ట్రైనింగ్, రిఫ్లెక్స్ డ్రిల్స్, ధ్యానం సాధన చేస్తోంది. "రేసింగ్‌లో వేగం ఒక్కటే సరిపోదు. కచ్చితత్వం, స్థిరత్వం, మానసిక సామర్థ్యం కూడా ముఖ్యమే! ఒత్తి డిలో పట్టు తప్పిపోకుండా ఉండడం కోసం విజువలైజేషన్, ధ్యానం.. ఈ రెండింటినీ నేను సాధన చేస్తూ ఉంటాను" అంటూ వివరిస్తున్న దయానా, ఫెరారీ క్లబ్ ఛాలెంజ్ మిడిల్ ఈస్ట్ కార్ల రేసులో విజయం సాధించాలని కోరుకుందాం!

'ఫీజు'పై సిఫారసులకు కమిటీ

- 15 మందితో ఉన్నతస్థాయి కమిటీ నియామకం
- మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని సర్కారు ఆదేశాలు

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం అమలులో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు, ఉన్నత విద్యను మరింతగా మెరుగుపరిచేందుకుగాను ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. ఈ కమిటీ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి సంబంధించి విధి విధానాలు, ట్రస్టు బ్యాంకు ద్వారా నిర్వ హణ, నిధుల సేకరణకు అవసరమైన సిఫారసులు చేయనుంది. సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా, ఆర్థిక శాఖ ముఖ్యకా ర్యదర్శి వైస్ చైర్మన్‌గా వ్యవహరించనున్న ఈ కమిటీలో విద్యాశాఖ, ఎస్సీ అభివృద్ధి, బీసీ సంక్షేమం, గిరిజన సంక్షేమం, మైనారిటీ సంక్షేమ శాఖల కార్యదర్శులు, ఉన్నత విద్యామండలి చైర్మన్‌తోపాటు ప్రొఫెసర్ కంచ ఐలయ్య, ప్రొఫెసర్ కోదండరాం, ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సంఘాల సమాఖ్య (ఫాతీ) నుంచి ముగ్గురు ప్రతినిధులు సభ్యులుగా ఉండనున్నారు. వీరితోపాటు కమిటీ చైర్మన్ నిర్ణయించే మరో వ్యక్తి కూడా సభ్యుడిగా ఉంటారు. మొత్తం 15 మందితో కూడిన ఈ కమిటీకి ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం ఉత్త ర్వులు జారీ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంపై ఇటీవల డిప్యూటీ సీఎం, ఫాతీ ప్రతినిధుల మధ్య చర్చలు జరిగిన విషయం తెలి సిందే. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉన్నత విద్యా వ్యవస్థను మరింత మెరుగు పరచాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

ట్రస్ట్ బ్యాంక్ ప్రతిపాదనపైనే..

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిధుల స్వయం సమృద్ధిగా మార్చి, ఒక ట్రస్టు బ్యాంకు ద్వారా నిర్వహించాలని ఫాతీ ప్రతినిధులు గతంలో ప్రభుత్వాన్ని కోరారు. దీంతో ప్రభుత్వ ఖజానాపై భారం పడదని సూచిం చారు. ఈ ప్రతిపాదనపై ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇతర ఉన్నతాధికారులు ఓసారి సమావేశమై చర్చించారు. తాజాగా ట్రస్ట్ బ్యాంక్ అంశంపై అవసరమైన సిఫారసులు చేయాలంటూ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పథకాన్ని హేతుబద్ధీకరించడం, నిరంతరం పారదర్శకంగా కొనసాగించడానికి తగిన నిర్మాణాత్మక సూచనలు చేయా లని తెలిపింది. ఉన్నత విద్యా వ్యవస్థను మరింత మెరుగుపర్చడానికి వీలైన సలహాలివ్వాలని ఆదేశించింది. కమిటీ వివిధ వర్గాలతో చర్చలు జరిపి, వారి నుంచి స్వీకరించిన సలహాలు, ప్రతిపాదనలను అధ్యయనం చేసి మూడు నెలల్లో నివేదికను సమర్పించాలని సూచించింది.

కాంగ్రెస్ అలర్ట్!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సీఎం రేవంత్

- పార్టీ నేతలకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం
- ప్రచార సరళిపై ఆరా తీస్తున్న అధిష్ఠానం!
- ఈ వారం రోజులూ ఉప ఎన్నిక క్షేత్రంలోనే ఉండనున్న మంత్రులు, ముఖ్య నాయకులు
- కులాలు, వర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు
- ప్రతి వంద మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జి



హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక ఊహించిన దానికన్నా ఎక్కువ ఉత్కంఠ రేపుతోంది. ప్రచారపర్వం కొనసాగుతున్న కొద్దీ రసవత్తరంగా మారుతోంది. ఉప ఎన్నిక హోరాహోరీగా జరగనున్నట్లు పలు సర్వే సంస్థలు అంచనా వేయ డంతో.. అధికార కాంగ్రెస్ పార్టీ ఒక్కసారిగా అప్రమత్త మైంది. మంత్రుల నుంచి డివిజన్ల వారీగా ఇన్‌చార్జులు, కులాలు, వర్గాల వారీగా ఓటర్లను ప్రభావితం చేయగల నేతలను రంగంలోకి దించి.. ప్రచార హోరును మరింత ఉధృతం చేసింది. ముఖ్యంగా నియోజకవర్గంలోని ప్రతి ఓటరునూ మరోసారి కలిసి నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ఏ మేరకు కృషి చేయనున్నదీ వివరించాలని నిర్ణయించింది. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ప్రచారంలో ప్రతిపక్షాలపై విమర్శల జోరు పెంచారు. ఈ ఉప ఎన్నికను సీఎంతోపాటు కాంగ్రెస్ అధిష్ఠానం కూడా చాలా సీరియస్‌గా తీసు కుంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరా జన్ నేరుగా రంగంలోకి దిగి ఈ ఎన్నిక విషయంలో అధిష్ఠానం ఎంత సీరియస్‌గా ఉందో వివరిస్తున్నారు. మహిళా ఓటర్లను కలిసేందుకు ఏడుగురు మహిళా ముఖ్యనేతలతో కమిటీని నియమించారు. ఈ కమిటీలో మీనాక్షీ నటరాజన్, ఎంపీలు రేణుకాచౌదరి, కడియం కావ్య, ఎమ్మెల్సీ విజయశాంతి, ఎమ్మెల్యేలు ఉత్తమ్ పద్మావతీరెడ్డి, యశస్వినీరెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి ఉన్నారు.వీరిలో ఒక్కో ముఖ్యనేతకు సహకరించేందుకు మరో 9 మంది చొప్పున మహిళా నేతలను కేటాయించారు. వీరితోపాటు మహిళా ఓట ర్లను కలిసే బాధ్యతను మీనాక్షీ నటరాజన్ కూడా తీసు కున్నారు. మొత్తంగా.. ఈ వారం రోజులూ కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం యావత్తూ జూబ్లీహిల్స్ నియోజకవ ర్గంలోనే మోహరించనుంది.

ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న సీఎం..!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకీ కూడా కీలకం కావడంతో దీనిని సీఎం రేవంత్‌రె డ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. నియోజకవర్గంలోని ఒక్కో డివిజన్ బాధ్యతను ఇద్దరేసి మంత్రులకు అప్ప గించారు. ఆయా డివిజన్లలో ప్రచారం మొదలుకొని.. ఎన్నికల నిర్వహణ వరకు బాధ్యతలను వారిపై పెట్టారు. ఆయా మంత్రులు ప్రచారం నిర్వహిస్తున్న తీరును, డివిజన్ల వారీగా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తు న్నారు. మంత్రులతో ఆదివారం ప్రత్యేకంగా సమావేశమై.. ఈ ఉప ఎన్నిక పార్టీకి, ప్రభు త్వానికి, మంత్రివర్గానికి ఎంత కీలకమన్నది వివరించారు. అలసత్వం వహిస్తే అంద రమూ నష్టపోతామని హెచ్చరించారు. అధి ష్ఠానం కూడా ఉప ఎన్నిక ప్రచార సరళిపై, మంత్రులు, నేతల పనితీరుపై ఎప్పటిక ప్పుడు సమాచారం తీసుకుంటోందని, అల సత్వం వహించిన వారు మూల్యం చెల్లించు కోవాల్సి వస్తుందని సీఎం అప్రమత్తం చేసి నట్లు తెలిసింది. పోలింగ్ రోజు దాకా ఎన్ని కల క్షేత్రంలోనే ఉండి బాధ్యతలను సమ ర్థంగా నిర్వర్తించాలని స్పష్టం చేసినట్లు సమాచారం. అంతేకాకుండా స్వయంగా తాను కూడా ప్రచార బాధ్యతను భుజానికె త్తుకున్నారు. ఇప్పటికే మూడు రోజులు ప్రచారం చేసిన సీఎం.. బుధవారం కూడా కొనసాగిం చనున్నారు. మరో రోజు కూడా సీఎం ప్రచారంలో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు మంత్రులంతా ఇన్‌చార్జిగా తమకు కేటాయించిన డివి జన్లలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఓవైపు తమ శాఖల నిర్వహణకు సమయం కేటాయిస్తూనే ఎన్నికల ప్రచారంలోనూ పాల్గొంటున్నారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణకుమార్, తుమ్మల నాగేశ్వర్ రావు, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్ ఆయా డివిజ న్లలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

వంద మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జి..

నియోజకవర్గంలోని ఓటర్లలో చాలా మంది స్థానికంగా నివసించడంలేదు. దీంతో ప్రతి వంద మంది ఓట ర్లకు ఒక నేతను ఇన్‌చార్జిగా పెట్టి.. వారిని పోలింగ్ కేంద్రాల వరకూ రప్పించే బాధ్యతను వారికి అప్పగించా లని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. కాగా, ఈ ఎన్నికల్లో పనితీరును బట్టే కార్పొరేషన్ చైర్మన్లుగా కొనసాగిం చడం ఉంటుందని ఆయా నేతలకు మీనాక్షీ నటరాజన్ స్పష్టం చేశారు.

కులాలు.. వర్గాల వారీగా సమావేశాలు!

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కులాలు, వర్గాల వారీగా ప్రభావితం చేసే నాయకులను రంగంలోకి దించి.. సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలను కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తోంది. ముఖ్యంగా ముస్లింలు, ఎస్సీ, బీసీ.. కమ్మ, రెడ్డి, మహిళా ఓట ర్లపై దృష్టి పెట్టి సమావేశాలను నిర్వహిస్తోంది. ముస్లింలలో అత్యంత ప్రభావం చూపగల ఎంఐ ఎంతో సంప్రదింపులు జరిపి.. ఆ పార్టీ మద్దతు కూడగట్టింది. అలాగే టీజేఎస్, ఉభయ కమ్యూనిస్టు పార్టీలూ మద్దతు ప్రకటించాయి. నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న ముస్లింల మద్దతు కూడగ ట్టేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తోంది. వాస్తవా నికి గత లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలిచినా.. ఈ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని నాంపల్లి, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించింది. ఈ రెండు నియోజకవర్గాల్లోని మెజారిటీ ముస్లింలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్ద తుగా ఉన్నందునే ఇది సాధ్యమైందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ బీసీ కావడంతో వివిధ బీసీ సంఘాల నేతలు ఆయనకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తు న్నాయి. ఇప్పటికే మున్నూరుకాపు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీని వాస్, ఇతర కాపు నాయకులు ఇటీవల ఆ సామా జికవర్గం వారితో సమావేశమయ్యారు. అలాగే కమ్మ సామాజికవర్గ ఓటర్లను ఆకర్షించేందుకు మంత్రి తుమ్మల, ఇతర కమ్మ సామాజికవర్గ నాయకులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎల్లారె డ్డిగూడలో జరిగిన దళితుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి దామోదర పాల్గొన్నారు. రెడ్డి సామాజికవర్గ ఓటర్లతో సమావేశమై మద్దతు కూడగట్టే బాధ్య తను ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగా రెడ్డి జిల్లాలకు చెందిన ఆ సామాజిక వర్గ మంత్రులకు అప్పగించినట్లు చెబుతున్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ తదితర బ్రాహ్మణ వర్గానికి చెందిన నేతలు.. ఆ సామాజికవర్గ ఓటర్లను ప్రస న్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

రెండోరోజూ కాలేజీలు బంద్

- ఫీజు బకాయిల కోసం 1800 కాలేజీల మూత
- యథాతథంగా ఫార్మసీ పరీక్షలు.. 88 % గైర్హాజరు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాసంస్థల సమ్మె రాష్ట్రవ్యాప్తంగా రెండో రోజూ కొనసాగింది. తొలిరోజు 98 శాతం కాలేజీలు సమ్మెలో పాల్గొంటే మంగళవారం రెండో రోజు 99 శాతం కాలేజీలు పాల్గొన్నాయని తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల యాజ మాన్య సంఘాల సమాఖ్య (ఫాతీ) తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీ రింగ్, ఫార్మసీ, బీఈడీ, లా, మేనేజ్‌మెంట్, ఇతర వృత్తివిద్య కాలేజీలు కలిపి మొత్తం 1800 ఉన్నత విద్యాసంస్థలు సమ్మెలో పాల్గొన్నాయని పేర్కొంది. అయితే మంగళవారం నుంచి బీ-ఫార్మసీ రెండో సెమిస్టర్ వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీలు, ఇతర కాలేజీలు ఈ పరీక్షలను వాయిదా వేయగా.. జేఎన్‌టీయూ పరిధిలో మాత్రం వాయిదా వేయలేదు. పరీక్షలు కొనసాగించాలన్న విద్యాశాఖ ఉన్నతాధికారి ఆదేశాలతో యథాత థంగా కొనసాగించారు. పరీక్షలు వాయిదా వేయాలని కాలజేఈలు కోరినా జేఎన్‌టీయూ అధికారులు ససేమిరా అన డంతో కొన్ని కాలేజీలు పరీక్షల నిర్వహణకు అంగీకరించాయి. రాష్ట్రంలో జేఎన్‌టీయూ గుర్తింపు పొందిన ఫార్మసీ కళాశాలలు మొత్తం 61 ఉండగా, ఇందులో రెండు ప్రభుత్వ, 59 ప్రైవేటు కాలేజీలు ఉన్నాయి. మంగళవారం 9 కాలేజీలు మాత్రమే పరీ క్షలు నిర్వహించగా, 52 కాలేజీల్లో విద్యార్థులు గైర్హాజరైనట్లు జేఎన్‌టీయూ పరీక్షల విభాగం ప్రకటించింది. మొత్తం విద్యార్థుల్లో 88 శాతం గైర్హాజరైనట్లు పేర్కొంది. మరోవైపు సమ్మెను మరింత ఉధృతం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఫాతీ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 8న ఎల్బీ స్టేడి యంలో 30వేల మంది కాలేజీల సిబ్బందితో బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించి అనుమతులు పొందింది. అయితే మంగళవారం అనుమతులు ఇచ్చిన తర్వాత వాటిని పోలీసుశాఖ రద్దు చేసింది. దీనిపై బుధవారం హైకో ర్టుకు వెళ్లి అనుమతులు పొందాలని ఫాతీ నిర్ణయించింది. అలాగే ఈనెల 11న 10లక్షల మంది విద్యార్థులతో సచివాల యానికి లాంగ్ మార్చ్ నిర్వహించాలని నిర్ణ యించారు. మరోవైపు సమ్మె ఆపాలని ఫాతీని ప్రభుత్వం కోరింది. రూ.450కోట్లు ఇచ్చేం దుకు సిద్ధమని ఉన్నతా ధికారులు ఫాతీ అధ్య క్షుడు రమేష్‌బాబుకు ప్రతిపాదించగా.. ఆయన నిరాకరించారు. ఈ విద్యా సంవత్సరం బకాయిలు కలుపుకొని రూ.10వేల కోట్లు రావాల్సి ఉందని, కనీసం రూ.5వేల కోట్లు ఇస్తేనే సమ్మె విరమిస్తామని స్పష్టం చేశారు.



ఉన్నత విద్యామండలి ఎదుట ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

విచారణకు వస్తున్నాం.. వద్దు సమ్మెలో ఉన్నాం..

ఫీజు రీయింబర్స్‌మెంట్ దుర్వినియోగంపై ప్రభుత్వం వారం క్రితం విజి లెన్స్ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. విజిలెన్స్, పోలీసు శాఖతో పాటు సీఐడీ, ఏసీబీ, ఇంటెలిజెన్స్, యూనివర్సిటీ అధికారులతో కూడిన కమి టీలు అన్ని కాలేజీలకు వెళ్లి విచారణ చేయాలని ప్రభుత్వం సూచించింది. అయితే తాము సమ్మెలో ఉన్నందున కాలేజీలకు తాళాలు వేస్తామని, విచార ణకు సహకరించలేమని ఫాతీ ముందుగానే ప్రకటించింది. 'కాలేజీకి వస్తున్నాం.. రికార్డులు పరిశీలించాలి' అంటూ విచారణ బృందాలు కాలేజీల యాజమాన్యాలను కోరుతుండగా.. కాలేజీలకు తాళాలు వేసి సమ్మెలో ఉన్నం దున రికార్డులు ఇవ్వలేమని, విచారణకు సహకరించలేమని యాజమా న్యాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో విజిలెన్స్ విచారణ ప్రారంభం కాలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. బకాయిలు చెల్లించ కుండా విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలను గత ప్రభుత్వం వేధించిం దన్నారు. కాంగ్రెస్ సర్కారు సైతం అలాగే వ్యవహరించొద్దని కోరారు.

ఉన్నత విద్యామండలి వద్ద విద్యార్థుల ధర్నా

కార్వాన్: రీయింబర్స్ బకాయిలను విడుదల చేయాలంటూ విద్యార్థి సంఘాలు మంగళవారం ఉన్నత విద్యామండలిని ముట్టడించాయి. బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులు ధర్నాకు దిగడంతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. విద్యార్థుల ఆందోళనకు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మద్దతు తెలిపారు.

మీర్జాగూడ రోడ్డు ప్రమాదంపై నివేదిక ఇవ్వండి

» ప్రభుత్వశాఖలకు టీహెచ్ఆర్సీ ఆదేశాలు

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంతొమ్మిది మంది ప్రాణాలను బలిగొన్న మీర్జాగూడ రోడ్డు ప్రమాదంపై నివేదిక ఇవ్వాలని తెలంగాణ మానవహక్కుల సంస్థ (టీహెచ్ఆర్సీ) ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. రంగారెడ్డిజిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద ఆర్టీసీ బస్సును కంకరలోడుతో ఉన్న టిప్పర్ ఢీకొన్న ఘటనపై సుమోటోగా కేసు నమోదు చేసినట్లు టీహెచ్ఆర్సీ ఒక ప్రకటనలో తెలిపింది. రహదారి భద్రతలో నిర్లక్ష్యం, ఓవర్ స్పీడ్, 163వ నంబర్ జాతీయ రహదారి విస్తరణలో జాప్యం, రెండు వాహనాల్లో ఓవర్ లోడ్, టిప్పర్ నుంచి కింద పడిన కంకరలో ప్రయాణికులు కూరుకుపోయి చనిపోవడం, రహదారిపై గుంతలు, డివైడర్లు, సిగ్నళ్లు, రహదారి నిర్వహణలో అలసత్వం వంటి అంశాలను ఎత్తిచూపుతూ వివిధ పత్రికల్లో ప్రచురితమైన వార్తలను ఆధారంగా చేసుకుని సుమోటోగా ఈ కేసును స్వీకరించినట్లు స్పష్టం చేసింది.

టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే: డీజీపీ

చేవెళ్ల/ మొయినాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్లు స్పష్టంగా కనిపిస్తోందని డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై చేవెళ్ల మండలం మీర్జాగూడ స్టాప్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని ఆయన మంగళవారం సాయంత్రం పరిశీలించి.. స్థానికులను అడిగి తెలుసుకున్నారు. డ్రైవర్ అతి వేగంగా టిప్పర్‌ను నడుపుతూ ఆర్టీసీ బస్సును ఢీ కొట్టడం వల్లే ప్రమాదం జరిగిందని శివధర్ రెడ్డి చెప్పారు. ఢీకొట్టిన బస్సును దాదాపు 40 మీటర్ల దూరం లాక్కెళ్లడంతోపాటు టిప్పర్‌లోని కంకర ప్రయాణికులపై పడటంతో ప్రమాద తీవ్రత పెరిగిందన్నారు. రోడ్డుపై మూల మలుపు ఉన్నా.. ప్రమాదం జరిగేంత తీవ్ర మలుపు కాదని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రమాద సమయంలో టిప్పర్‌లోనే ఉన్న దాని యజమాని లక్ష్మణ్ నాయక్ గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని చెప్పారు. ఈ ప్రమాదంపై చేవెళ్ల ఏసీపీ కిషన్ గౌడ్‌ను దర్యాప్తు అధికారిగా నియమిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

హైదరాబాద్-బీజాపూర్ రోడ్డు విస్తరణ షురూ

చేవెళ్ల/మొయినాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు చిన్నగా ఉండడంతోనే బస్సు ప్రమాదం చోటు చేసుకుందని స్థానికుల నుంచి విమర్శలు రావడంతో అధికారులు మంగళవారం విస్తరణ పనులు చేపట్టారు. బీటీ రోడ్డుకు ఇరువైపులా ఎక్స్‌కవేటర్లతో ముళ్లచెట్లను తొలగించి, మట్టిపోశారు. అలాగే రోడ్డు పక్కన ఉన్న మట్టిని సేకరించి పరీక్షల కోసం తీసుకెళ్లారు. రోడ్డుపై పెయింటింగ్‌తో మార్కింగ్ చేశారు.

ఇంత జరిగినా గుంత పూడ్చలే



చేవెళ్ల/ మొయినాబాద్ నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో పంతొమ్మిది మంది ప్రాణాలు పోవడానికి కారణమైన గుంతను పూడ్చే విషయంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. యాక్సిడెంట్ నేపథ్యంలో ఈ గుంతను మంగళవారం ఉదయం డస్ట్‌తో పూడ్చారు. కానీ సాయంత్రం వచ్చిన వర్షానికి డస్ట్ అంతా కొట్టుకుపోయి మళ్లీ గుంత యథాస్థితికి వచ్చింది. రాత్రి 10గంటల సమయంలో ఈ గుంత మళ్లీ ఇలా కనిపించింది. ఇంత ఘోరం జరిగినా అధికార యంత్రాంగంలో చలనం లేకపోవడం గమనార్హం.

వికారాబాద్‌లో కర్ణాటక బస్సును ఢీకొట్టిన లారీ

బస్సు డ్రైవర్‌కు గాయాలు.. 22 మంది ప్రయాణికులు సురక్షితం

తాండూరు రూరల్/తిమ్మాపూర్/మాడ్గులపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గుల్బర్గా నుంచి తాండూరుకు వస్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సును వికారాబాద్ జిల్లా తాండూరు మండలం కరన్‌కోట్ సమీపంలోని సాగర్ సిమెంట్ పరిశ్రమ వద్ద ఎదురుగా వచ్చిన ఓ లారీ ఢీకొట్టింది. ఈ క్రమంలో బస్సు డ్రైవర్ తలకు గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 22 మంది ప్రయాణికులు ఉండగా వారంతా క్షేమంగా ఉన్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. ఇక, హైదరాబాద్ నుంచి జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి వెళుతున్న టీజీఎస్ ఆర్టీసీ బస్సు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట వద్ద రాజీవ్‌రహదారిపై మంగళవారం తెల్లవారుజామున ధాన్యం లోడుతో వెళుతున్న ఓ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో 31 మంది ప్రయాణికులు ఉండగా.. డ్రైవర్‌తోపాటు 20 మంది ప్రయాణికులకగా గాయాలయ్యాయి. ఏపీలోని కావలి నుంచి హైదరాబాద్‌కు వస్తున్న చెర్రీ ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ బస్సు మంగళవారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా కుక్కడం గ్రామ శివారులో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఆ బస్సు అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ పల్టీ కొట్టగా అందులో ఉన్న ఐదుగురికి గాయాలయ్యాయి. బస్సులో ఉన్న 45 మంది సురక్షితంగా బయటపడ్డారు.



తారీబాయి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, పక్కన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

బస్సు ప్రమాద బాధితులకు పరిహారం చెక్కుల పంపిణీ

» 19 మంది మృతులకు రూ.7 లక్షల చొప్పున సాయం

» రేపటివరకు పంపిణీ పూర్తి చేసే అవకాశం

» ఓ కుటుంబానికి చెక్కు అందజేసిన స్పీకర్

» తనవంతు సాయంగా మరో రూ.లక్ష ఇచ్చిన ప్రసాద్‌కుమార్

వికారాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): చేవెళ్ల బస్సు ప్రమాదంలో మరణించిన 19 మంది కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పరిహారం చెక్కుల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు చెక్కులు సిద్ధం చేసిన అధికారులు మంగళవారం నుంచి పంపిణీ చేపట్టారు. మరణించిన ఒక్కొక్కరి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5 లక్షలు, ఆర్టీసీ తరపున రూ.2 లక్షలు కలిపి మొత్తం రూ.7 లక్షల పరిహారం చెక్కులు అందజేస్తున్నారు. క్షతగాత్రులకు రూ.2 లక్షల చొప్పున ఇస్తారు. గురువారం నాటికి బాధిత కుటుంబాలందరికి పరిహారం చెక్కులు అందజేస్తామని అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా మృతులకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల వంతున పరిహారం ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, ప్రమాదంలో మృతిచెందిన వికారాబాద్ పట్టణం శ్రీరాంనగర్ (ధన్నారం తండా)కు చెందిన తారీబాయి ఇంటికి మంగళవారం నాడు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ స్వయంగా వెళ్లారు. ఈ సందర్భంగా తారీబాయి కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.7 లక్షల పరిహారం చెక్కుతో పాటు తనవంతు సాయంగా రూ.1లక్ష అందించారు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పీకర్ భరోసా ఇచ్చారు. ఘటనలో చనిపోయిన 19 మందిలో వికారాబాద్ జిల్లాకు చెందిన వారు 15 మంది ఉన్నట్లు సమాచారం.

ఈ వేదన తీరనిది!

ప్రమాద ఘటన నుంచి తేరుకోలేకపోతున్న బాధితులు



పేర్కంపల్లి గ్రామంలో మృతి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్ల అంతిమ యాత్ర

» అప్పులను కోల్పోయి కంటికీమంటికి ధారగా రోదనలు

» సొంతూళ్లలో బస్సు ప్రమాద మృతుల అంత్యక్రియలు

తాండూరు/ బషీరాబాద్/ పెద్దేముల్/ యాలాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అంతా నిర్వేదం. ఏడ్చి ఏడ్చి కన్నీళ్లు ఇంకిపోయాయి. ప్రమాదం నుంచి బయటపడి బతికిపోయామన్న భావనే లేదు వారిలో! ఆ ఘోర ప్రమాదం తాలూకు జ్ఞాపకాలే వెంటాడుతున్నాయి. అంతకుమించి అప్పులను కోల్పోయిన బాధ గుండెలను మెలిపెడుతోంది. కాస్త కునుకు పట్టినా ఉలిక్కిపడి లేస్తున్నారు. ఆ బస్సే ఎందుకు ఎక్కాం? ఎక్కకపోయి ఉంటే.. కుటుంబాలు ఛిద్రం కాకపోయి ఉండేవి కదా? ఇలా వారి మదిలో ఆలోచనల సుడిగుండాలు తిరుగుతున్నాయి. ముందురోజు రాత్రే వెళ్తామని ముగ్గురు కూతుళ్లు చెప్పినా, మర్నాడు పొద్దున్నే వెళ్లాలని తానే వాయిదా వేశానని, తాను అలా వాయిదా వేయకుండా ఉంటే బిడ్డలు బతికేవారు కదా? అనే పశ్చాత్తాపం అమ్మాయిలను కోల్పోయిన ఆ తల్లిలో కనిపిస్తోంది. నా భార్య డ్రైవర్ వెనుక సీట్లో కాకుండా నేను కూర్చున్న సీట్లో కూర్చున్నా గాయాలతోనైనా బయటపడేదని మృతురాలి భర్త ఆలోచిస్తున్నాడు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదం తాలూకు విషాదం నుంచి బాధిత కుటుంబాలు ఎప్పుడు కోలుకుంటాయో తెలియదు. కానీ.. వారిలో ఎవ్వరిని కదిలించినా అప్పుల కోల్పోయిన బాధలో కంటికీమంటికి ధారగా రోదిస్తున్నారు. మంగళవారం ప్రమాద మృతుల అంత్యక్రియల సందర్భంగా సొంతూళ్లలో తీవ్ర విషాదఛాయలు నెలకొన్నాయి.



ప్రమాదంలో తల్లిదండ్రులు మృతిచెందడంతో అనాథలైన కూతుళ్లు భవాని, శిరీష

ముందురోజే వెళ్లాల్సి ఉన్నా..

తనూష, సాయిప్రియ, నందిని.. తోబుట్టువులుగా కలిసి పెరిగి.. ఒకేమాట, ఒకేబాటగా ఉంటూ నిన్నటి దాకా తల్లిదండ్రుల ఆశాదీపాలుగా వెలుగొందిన ఈ అమ్మాయిలు వరుసగా మూడు పాడెల్లో అంత్యక్రియలకు తరలారు. ఈ విషాద దృశ్యాన్ని చూసిన ఊరి జనం కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. వీరి అంత్యక్రియలు సొంతూరైన రంగారెడ్డి జిల్లా యాలాల మండలం పేర్కంపల్లిలో జరిగాయి. బిడ్డలతో నిన్నటి దాకా ఉన్న జ్ఞాపకాలను తల్లిదండ్రులు అంబిక, ఎల్లయ్యగౌడ్ గుర్తుచేసుకొని భోరుమన్నారు. ఎంబీఏ చేస్తున్న తనూష మంచి చిత్రకారిణి కూడా. మదర్స్ డే సందర్భంగా తనూష.. తల్లి చిత్రాన్ని గీసి ఆమెకు గిఫ్ట్‌గా అందజేసింది. ముగ్గురు కూతుళ్లు కూడా హైదరాబాద్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. వీరి పెద్ద సోదరి అనూష పెళ్లి గత నెల 17న జరిగింది. వేడుక సందర్భంగా తనూష, నందిని, సాయిప్రియ ఎంతో ఉత్సాహంగా కోలాటం ఆడారు. నృత్యాలు చేశారు. ఆ తర్వాత ముగ్గురూ హైదరాబాద్ వెళ్లిపోతే.. బంధువుల ఇంట పెళ్లి కోసం వారిని తల్లి ఇంటికి పిలిపించుకుంది. అయితే, ఆదివారమే ఈ ముగ్గురూ హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉంది. తల్లి ఒత్తిడి చేయడంతో వాయిదా వేసుకున్నారు. సోమవారం ఉదయం వారిని హైదరాబాద్ పంపించేందుకు తండ్రి ఎల్లయ్య గౌడ్ దగ్గరుండి ఆర్టీసీ బస్సు ఎక్కించాడు. ఓ రెండు నెలల తర్వాత తన చదువు అయిపోతుందని, ఏదో ఒక ఉద్యోగం దొరుకుతుందని.. అంతా కలిసి హైదరాబాద్‌లోనే ఉందామంటూ బస్సెక్కుతూ తనూష తండ్రితో చెప్పింది. ప్రతిగా అతడు.. తాను చేసిన అప్పులూ తీరిపోయాయని, హైదరాబాద్ వెళ్లి అక్కడే ఉందామంటూ కూతుళ్లతో చెప్పాడు. బస్సు కదులుతుండగా 'డ్యాడీ మందులు వేసుకో.. బాగా చదువుకోవాలని తమ్ముడు మురళీకృష్ణకు చెప్పు' అంటూ కూతుళ్లు చివరిమాటగా తండ్రితో చెప్పారు. ముగ్గురు కూతుళ్లు ఒకేసారి కడుపుకోత మిగిల్చారని.. తీవ్ర గాయాలపాలై ప్రాణాలతో బయటపడినా.. వైద్యం చేయించి బతికించుకునేవాడినంటూ ఎల్లయ్యగౌడ్ రోదిస్తూ చెప్పాడు. హైదరాబాద్ నుంచి ముగ్గురు తోబుట్టువులు ఎప్పుడు వచ్చినా అదే గ్రామానికి చెందిన ముస్కాన్ బేగం వెంట వచ్చేది. ఆ ప్రమాదంలో వారి పక్కనే కూర్చోవడంతో ముస్కాన్ కూడా ప్రాణాలు కోల్పోయింది.

నాతో పాటు కూర్చుని ఉంటే ఆమె బతికేది

ఇది ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డ అబ్దుల్ మాజీద్ మాట. ఆయనకు భార్య తబస్సుమ్ బేగం, పిల్లలు మజీన్, ముక్రమ్, కుమార్తె మైపాష్ జహాన్ ఉన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న భార్యకు హైదరాబాద్‌లో చికిత్స చేయించేందుకు మాజీద్.. ఆమెతో పాటు పిల్లలను వెంటబెట్టుకొని బస్సెక్కాడు. ప్రమాదంలో తబస్సుమ్ ప్రాణాలు కోల్పోగా.. మాజీద్, పిల్లలు బయటపడ్డారు. తబస్సుమ్ డ్రైవర్ వెనుక సీట్లో కూర్చుంది. మధ్య సీట్లో కుమారులు, కుమార్తెతో కలిసి మాజీద్ కూర్చున్నాడు. వెనుక సీట్లో కూర్చొని ఉంటే తన భార్య బతికేదంటూ మాజీద్ కన్నీటిపర్యంతమయ్యాడు. చిన్న కుమారుడు ముక్రమ్(5) తల్లి చెంతే కూర్చున్నాడని, ప్రమాదం జరగడానికి నిమిషం ముందు తన దగ్గరకు రావడంతో బతికాడని చెప్పాడు.

భార్యను పంపాలని అల్లుడి ఒత్తిడితో...

బస్సు ప్రమాదంలో తాండూరుకు చెందిన ఖలీద్‌తో పాటు అతడి కూతురు సలీమా, ఆమె బిడ్డ, దాదాపు నెలన్నర వయసున్న శిశువు ప్రాణాలు కోల్పోయారు. ఖలీద్‌కు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులున్నారు. ఖలీద్ ఒక్కడి సంపాదనతోనే ఇల్లు గడుస్తోంది. పెద్ద కూతురు సలీమాకు పుట్టిన బిడ్డకు చిల్లి కార్యక్రమం (నామకరణ డోలారోహణం) కోసం బైక్‌ను కుదువ పెట్టి వేడుక జరిపించాడు. ఆ మర్నాడే సలీమాను, బిడ్డను తీసుకెళ్తానని అల్లుడు చెప్పడంతో తానే రెండ్రోజుల్లో హైదరాబాద్‌కు తీసుకొస్తానని ఖలీద్ సముదాయించాడు. అయితే అల్లుడు పోరు పెట్టడంతో కుమార్తెను, మనుమరాలిని వెంటపెట్టుకొని ఖలీద్ బస్సులో బయలుదేరాడు. ప్రమాదంలో ఖలీద్, సలీమా, ఆ శిశువు ప్రాణాలు కోల్పోయారు. ఖలీద్‌కు ఇద్దరు కవల కుమారులు జమీర్, సమీర్ ఉన్నారు. చిన్న కూతురు సజియా ఇంట్లోనే ఉంటోంది. ఇప్పుడా కుటుంబం రోడ్డున పడింది.

కన్నవారి మృతితో అనాథలైన ఇద్దరు చిన్నారులు

బస్సు ప్రమాదంలో హాజీపూర్‌కు చెందిన భార్యభర్తలు బందెప్ప, లక్ష్మీ మృతిచెందారు. దీంతో వీరి కూతుళ్లు భవాని, శిరీష అనాథలయ్యారు. పెద్ద కూతురు శిరీష ఎనిమిదో తరగతి దాకా చదివి మానేసింది. చిన్న కూతురు శిరీష నాలుగో తరగతి చదువుతోంది. కుటుంబానికి పెద్దదిక్కు లేకపోవడంతో గ్రామంలోనే ఉంటున్న మేనమామ సురేశ్ చేరదీశాడు. పిల్లలను అన్ని విధాలా బాగా చూసుకుంటానని భరోసా ఇచ్చాడు.

తెలిసినవారి బైక్ ఎక్కించి మరీ బస్టాండ్ వరకు దింపి..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన ఎంబీఏ విద్యార్థి అఖిలారెడ్డి అంత్యక్రియలు మంగళవారం గ్రామంలో జరిగాయి. అఖిలారెడ్డి తల్లి అలివేలు రోదనను చూసి పలువురు కన్నీరు పెట్టారు. బీఎస్సీ అగ్రికల్చర్ తర్వాత అఖిల ఎంబీఏ కోసం గచ్చిబౌలి ఐఆర్ఎం కళాశాలలో చేరింది. సోమవారం హైదరాబాద్ వెళ్లేందుకు ఒక రోజు ముందుగానే సాయిపూర్‌లోని తన ఇంటికి అఖిలారెడ్డి వచ్చింది. ఉదయమే ఆర్టీసీ బస్సు వరకు పంపించేందుకు ఆటోలు లేకపోవడంతో పొరుగున ఉన్న తెలిసిన వారి బైక్‌పై అఖిలారెడ్డిని బస్టాండ్‌కు పంపించి బస్సులో ఎక్కించారు. తాను బస్సు ఎక్కానని తల్లి, పిన్నికి అఖిల ఫోన్ చేసి చెప్పింది. అవే ఆమె చివరి మాటలయ్యాయి.

రోడ్డున పడ్డ డ్రైవర్ కుటుంబం

ప్రమాదంలో బస్సు డ్రైవర్ దస్తగిరి బాబా ప్రాణాలు కోల్పోవడంతో అతడి కుటుంబం రోడ్డున పడింది. వికారాబాద్ జిల్లా మంతట్టికి చెందిన అహ్మద్‌మియా-షౌకత్‌బేగం దంపతుల కొడుకే దస్తగిరి. అతడికి రుక్సానబేగం, గౌషియాబేగం అనే చెల్లెళ్లు ఉన్నారు. బతుకుదెరువు కోసం వీరు 20ఏళ్ల కిందట తాండూరుకు ఈ కుటుంబం వలసొచ్చింది. అహ్మద్ మియా 19ఏళ్ల కిందట మరణించాడు. కుటుంబ పోషణ భారం దస్తగిరిపై పడింది. భార్య హసీనా బేగం, అంధురాలైన తల్లితో కలిసి దస్తగిరి పదేళ్లుగా తాండూరులో ఉంటున్నాడు. ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్యాభర్తలకు మనస్పర్థలు రావడంతో మూడేళ్ల కింద అతడి భార్య పుట్టింటికి పోయింది. వారికి పదేళ్ల లోపు ఇద్దరు కొడుకులున్నారు. అంధురాలైన తల్లి బాగోగులు చూసుకునేందుకు రెండున్నరేళ్ల కింద హైదరాబాద్‌కు చెందిన సాజిదాను దస్తగిరి రెండో పెళ్లి చేసుకున్నాడు. 15రోజుల క్రితం దస్తగిరి తల్లి ప్రమాదవశాత్తు పడటంతో కాలు విరిగింది. ఆస్పత్రి ఖర్చులతో అతడు ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డాడు. వచ్చే డబ్బు సరిపోక ఒక్కోసారి డబుల్ డ్యూటీ చేసేవాడని దస్తగిరి సోదరి రుక్సానా తెలిపింది. కంటి చూపులేని తమ తల్లిని ఎవరి వద్ద ఉంచాలో తెలియడం లేదని విలపిస్తోంది

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

మరోసారి మర్చిపోలేని అనుభూతిని ఇస్తుంది



నాగార్జున

'రామ్‌గోపాల్ వర్మ 36 ఏళ్ల క్రితం నాతో శివ సినిమా తీసి, నన్నో పెద్ద స్టార్‌ని చేశారు. ఇప్పుడు కూడా వర్మ ఆరు నెలలు కష్టపడి ఎంతో ప్రేమతో 'శివ' చిత్రాన్ని రీ రిలీజ్‌కు సిద్ధం చేశారు. ప్రేక్షకులకు మరోసారి మర్చిపోలేని అనుభూతిని ఇస్తుంది' అని నాగార్జున అన్నారు. ఈనెల 14న 'శివ' చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం రీ రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేసింది. రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ 'ఇన్నేళ్ల తర్వాత కూడా మేమిద్దరం ఇలా వేదికపై రీ రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేస్తామని నేనెప్పుడూ ఊహించలేదు' అని అన్నారు.

రాజాసాబ్ రాకలో మార్పు లేదు



ప్రభాస్ హీరోగా మారుతి తెరకెక్కిస్తోన్న 'రాజాసాబ్' చిత్రం విడుదల మరోసారి వాయిదా పడిందంటూ వస్తోన్న వార్తలను చిత్ర నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఖండించింది. అనుకున్న సమయానికే రాజాసాబ్ వస్తున్నాడంటూ ఓ ప్రకటన విడుదల చేసింది. 'ప్రస్తుతం నిర్మాణాంతర పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. జనవరి 9న ఒకేసారి అన్ని భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఈ సంక్రాంతికి థియేటర్లలో సందడిని రెట్టింపు చేసేందుకు 'రాజాసాబ్' సిద్ధమవుతున్నాడు. డిసెంబరు 25 నాటికి తొలి కాపీని సిద్ధం చేస్తున్నామని, అమెరికాలో ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించబోతున్నాం' అని చిత్ర నిర్మాణ సంస్థ పేర్కొంది.

నా కెరీర్‌లో 'కె-ర్యాంప్' విజయం ప్రత్యేకం



కిరణ్ అబ్బవరం

'నా కెరీర్‌లో కె-ర్యాంప్ కంటే మరింత గొప్ప విజయం రావచ్చు. కానీ ఈ విజయం మాత్రం ఎంతో ప్రత్యేకం. నా జీవితాంతం గుర్తుండిపోతుంది. ఈ సినిమాకు వస్తున్న కలెక్షన్స్ కంటే థియేటర్లో ప్రేక్షకులు పొందుతున్న వినోదాన్ని చూసి నాకు ఎక్కువ ఆనందంగా ఉంది' అని కథానాయకుడు కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన హీరోగా జైన్స్ నాని తెరకెక్కించిన 'కె-ర్యాంప్' ఇటీవలె విడుదలై ఘనవిజయం సాధించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'ర్యాంపేజ్ బ్లాక్‌బస్టర్ సెలబ్రేషన్స్‌'లో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'గతేడాదీ, ఈ ఏడాదీ దీపావళికి హిట్స్ వచ్చాయి. మీ సపోర్ట్ ఉంటే వచ్చే దీపావళికి కూడా హిట్ సినిమా ఇస్తాను' అని చెప్పారు. 'ఈ సినిమా విజయం సాధిస్తుందని ఒక కార్యక్రమంలో తొడగొట్టి చెప్పాను. ప్రేక్షకులు మా నమ్మకాన్ని నిజం చేస్తూ అద్భుత విజయం అందించారు' అని చిత్ర నిర్మాత రాజేశ్ దండ తెలిపారు. 'ఇండస్ట్రీకి కిరణ్ లాంటి వాళ్లే కావాలి' అని నిర్మాత బండ్ల గణేశ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డమ్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు.

జాతీయ అవార్డుల ఎంపికలో రాజీ పడుతున్నారు



కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డులను సోమవారం ప్రకటించిన సంగతి విదితమే. అవార్డులను ప్రకటించిన అనంతరం జ్యూరీ ఛైర్మన్, నటుడు ప్రకాశ్‌రాజ్ ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో జాతీయ అవార్డుల గురించి చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. 'జాతీయ అవార్డుల ఎంపిక విషయంలో జ్యూరీ సభ్యులు రాజీ పడుతున్నారని చెప్పడానికి నేను భయపడను. పక్షపాతంతో తీసుకున్న కొన్ని నిర్ణయాల వల్ల జాతీయ స్థాయిలో కొందరికే అవార్డులు దక్కుతున్నాయి. అలాంటి ప్రభుత్వాలు, వ్యక్తులు ఉన్నప్పుడు మమ్ముట్టి వంటి గొప్ప నటులకు జాతీయ అవార్డులు అవసరం లేదు' అని అన్నారు ప్రకాశ్‌రాజ్. అవార్డుల ఎంపికలో తనకు పూర్తి స్వేచ్ఛనిస్తామని కేరళ అవార్డ్ కమిటీ చెప్పిన తర్వాతే జ్యూరీ కమిటీకి సారథ్యం వహించడానికి అంగీకరించానని ఆయన తెలిపారు.

శంబాల ఎవరినీ నిరాశపరచదు



'మా చిత్రానికి విడుదలకు ముందే ఇంత ఆదరణ లభిస్తున్నందుకు ఆనందంగా ఉంది. సినిమా మీద మంచి బజ్ క్రియేట్ చేయాలనే ఉద్దేశంతో ట్రైలర్‌ను ఇంత త్వరగా విడుదల చేశాం. ప్రభాస్ ఫ్యాన్స్‌తో పాటు సినీ ప్రియులందరూ ట్రైలర్ బాగుందని మెచ్చుకుంటున్నారు' అని ఆది సాయికుమార్ అన్నారు. ఆయన ప్రధాన పాత్రలో యుగంధర్ ముని తెరకెక్కిస్తున్న మిస్టికల్ థ్రిల్లర్ 'శంబాల'. రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి నిర్మిస్తున్నారు. అర్చన అయ్యర్, స్వశిక, రవి వర్మ, మధునందన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. డిసెంబరు 25న చిత్రం విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆది సాయికుమార్ మాట్లాడుతూ 'మా చిత్రం ఎవరినీ నిరాశపరచదు. అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది' అని చెప్పారు. 'సాంకేతికంగా ఉన్నతంగా ఉంటూ ఆద్యంతం మలుపులతో ఆకట్టుకుంటుంది' అని యుగంధర్ ముని తెలిపారు. 'ఇలాంటి ఓ అద్భుతమైన చిత్రంలో మంచి పాత్ర చేసినందుకు ఆనందంగా ఉంది' అని అర్చన అయ్యర్ అన్నారు.

'ఫీనిక్స్' విషయంలో అదే జరుగుతుంది



విజయ్ సేతుపతి

'ఫీనిక్స్' సినిమా చూశాను. మా అబ్బాయి కెరీర్‌కు మంచి ఆరంభాన్ని ఇచ్చే చిత్రమిది. ఒక తండ్రిగా ఎంతో సంతోషాన్నిస్తోంది. భాషతో సంబంధం లేకుండా భావోద్వేగంతో ప్రేక్షకులు కనెక్ట్ అయ్యారంటే ఆ సినిమాను సూపర్‌హిట్ చేస్తారు. 'ఫీనిక్స్' విషయంలో అదే జరుగుతుందనే నమ్మకం ఉంది' అని హీరో విజయ్ సేతుపతి అన్నారు. ఆయన కుమారుడు సూర్య సేతుపతి కథానాయకుడిగా పరిచయమౌతున్న చిత్రం 'ఫీనిక్స్'. స్టంట్ మాస్టర్ అనల్ అరసు దర్శకత్వం వహించగా, రాజ్యలక్ష్మి నిర్మించారు. ఇటీవలె తమిళ్‌లో విడుదలై ఘనవిజయం సాధించింది. ఈ నెల 7న తెలుగులో విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో దర్శకుడు గోపిచంద్ మలినేని మాట్లాడుతూ 'అరసు చిత్రాన్ని బాగా హ్యాండిల్ చేశారు' అని చెప్పారు. 'ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుందనే నమ్మకంతో ఉన్నాను' అని సూర్య సేతుపతి తెలిపారు.

పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని అలరిస్తుంది



ప్రేరణ అరోరా

సుధీర్‌బాబు కథానాయకుడిగా రూపొందిన మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వంలో ప్రేరణా అరోరా నిర్మించారు. ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రేరణ మీడియాతో సినిమా విశేషాలను పంచుకున్నారు.

- తెలుగులో సినిమా చేయాలనే కోరిక ఎప్పట్నుంచో ఉంది. సుధీర్‌బాబు గారి ద్వారా వెంకట్ అభిషేక్‌ని కలిశాను. అప్పుడు 'జటాధర' కథ చెప్పారు. అలా ఈ సినిమాతో నిర్మాతగా నా ప్రయాణం మొదలైంది. ఇది పాన్ ఇండియా కంటెంట్. అందుకే హిందీలో కూడా ఈ సినిమాను తెరకెక్కించాం.
- కుటుంబ అనుబంధాలు, పురాణాలు, అతీంద్రియ శక్తులు.. ఇలా పలు అంశాల చుట్టూ అల్లుకున్న కథ ఇది. సినిమా విజువల్‌గా గ్రేట్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది.
- తెలుగులో నా తొలి చిత్రం సుధీర్‌బాబుతో చేయడం ఆనందాన్నిచ్చింది. తెలుగులో అగ్రహీరోతో మరో సినిమా చేయబోతున్నాం. ఆ వివరాలు త్వరలో ప్రకటిస్తాం.

ప్రత్యేకాకర్షణగా.. బుల్లెట్



కిరణ్, అలేఖ్య రెడ్డి జంటగా నటిస్తున్న చిత్రం 'దీక్ష'. ఆర్‌కే ఫిల్మ్స్ బేనర్‌పై ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వంలో పి.అశోక్‌కుమార్ నిర్మిస్తున్నారు. డీఎస్ గౌడ్ సమర్పిస్తున్నారు. చిత్రీకరణ పూర్తైంది. ఈ సినిమాకు అదనపు ఆకర్షణను జతచేయడానికి తాజాగా ఓ ప్రత్యేక పాటను చిత్రీకరించారు మేకర్స్. 'బుల్లెట్' అంటూ సాగే ఈ పాటను మధు ప్రియ ఆలపించారు. ఈ సందర్భంగా ఆర్‌కే గౌడ్ మాట్లాడుతూ 'ఇందులో కిరణ్ భీముడి పాత్రలో అద్భుతంగా నటించాడు. అందమైన కుటుంబ కథా చిత్రంగా రూపుదిద్దుకుంటోందీ చిత్రం. మైథలాజికల్ టచ్ కూడా ఉంటుంది. ఐదు పాటలూ అలరిస్తాయి' అని అన్నారు.

సీరియల్ నటికి వేధింపులు.. నిందితుడి అరెస్టు

ఓ వ్యక్తి తనను సోషల్‌మీడియాలో లైంగికంగా.. మానసికంగా వేధిస్తున్నాడంటూ తెలుగు, కన్నడ భాషల్లో నటిస్తున్న ఓ సీరియల్ నటి పోలీసులను ఆశ్రయించారు. ఫేస్‌బుక్‌లో ఆ వ్యక్తి పంపిన ఫ్రెండ్ రిక్వెస్ట్‌ను అంగీకరించలేదనే కక్షతో తనను ఇబ్బందిపెడుతున్నాడంటూ ఫిర్యాదు చేసింది. బెంగుళూరులోని అన్నపూర్ణేశ్వరీ నగర్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నవీన్ అనే వ్యక్తి నుంచి బాధితురాలికి ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. ఆమె అంగీకరించలేదు. పలుసార్లు ఆమె ఇలానే తిరస్కరించడంతో ఆ నటికి అభ్యంతకర వీడియోలు పంపడం మొదలు పెట్టాడు. నటి బ్లాక్ చేసినా ఆగకుండా వేరే అకౌంట్ల నుంచి అభ్యంతకర వీడియోలు, మెసేజులు పంపి వేధించేవాడు. దీంతో నటి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాము కనిపించిందని చెప్పినందుకు.. విద్యార్థినిని గురుకులం నుంచి గెంటేశారు

» 5 నెలలుగా విద్యకు దూరం చేసిన టీచర్లు

» వరంగల్ జిల్లా పర్వతగిరిలో ఘటన


విద్యార్థిని శివానితో తల్లిదండ్రులు స్వప్న, నాగరాజు

పర్వతగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాము కనిపించిందని చెప్పినందుకు ఓ విద్యార్థినిని గురుకులం నుంచి బహిష్కరించిన ఘటన వరంగల్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పర్వతగిరి మండలం వడ్లకొండకు చెందిన శివాని ఈ ఏడాది నుంచి పర్వతగిరి గురుకులంలో ఐదో తరగతి చదువుతోంది. జూలై మొదటివారంలో గురుకులం ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగిస్తుండగా కాలుపై నుంచి పాము వెళ్లడంతో భయాందోళనకు గురైన శివాని వెంటనే ఉపాధ్యాయులకు విషయాన్ని చెప్పింది. పాము కాటేసిందని భావించిన వైస్ ప్రిన్సిపాల్ స్వాతి.. విద్యార్థినిని నాటు వైద్యం కోసం పంపించింది. ఈ విషయం బయటకు రావడంతో హుటాహుటిన వరంగల్ ఎంజీఎంకు తరలించారు. శివానిని పరీక్షించిన వైద్యులు పాము కాటు వేయలేదని తేల్చడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అప్పటికే అక్కడకు చేరుకున్న విద్యార్థిని తల్లిదండ్రులకు.. గురుకుల సిబ్బంది శివానిని అప్పగించి ఇంటికి పంపించారు. తర్వాత కొన్ని రోజులకు విద్యార్థినిని గురుకులంలో తిరిగి చేరినా.. శివాని తీరు సరిగా లేదని, తాము నాటు వైద్యం చేయించినట్లు పత్రికల్లో కథనాలు రావడం వల్ల తమ పరువు పోయిందంటూ తల్లిదండ్రులపై వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, క్లాస్ టీచర్ మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాలయం నుంచి తీసుకెళ్లాలని ఆదేశించడంతో చేసేదేమీ లేక.. తల్లిదండ్రులు తమ కూతురుని ఇంటికి తీసుకొచ్చారు. ఐదు నెలల నుంచి విద్యకు దూరం చేసి మానసిక క్షోభకు గురిచేస్తున్నారంటూ విద్యార్థిని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, కొన్నేళ్లుగా వైస్ ప్రిన్సిపాళ్లు స్వాతి, జ్యోత్స్నల తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు పలు ఆరోపణలు చేస్తున్నారు. చిన్న కారణాలకే విద్యార్థులను వేధిస్తుండడంతో కొందరు గోడ దూకి పారిపోయారని చెబుతున్నారు. శ్రమదానం పేరిట విద్యార్థులతో పని చేయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని అంటున్నారు.

విద్యార్థినికి హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేదు

'శివానికి హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేదు. తల్లిదండ్రులతో ఉండాలనే.. మాపై నిందలు మోపి ఇంటికి వెళ్లింది. తల్లిదండ్రులు అమ్మాయిని బలవంతంగా హాస్టల్‌లో వదిలి వెళ్తున్నారు. ఏదైనా అఘాయిత్యం చేసుకుంటుందనే విద్యార్థిని ఇంటికి పంపించాం. విద్యార్థిని తల్లిదండ్రుల ఆరోపణల్లో అవాస్తవం'

- అపర్ణ, ప్రిన్సిపాల్

హోంగార్డుల కుటుంబాలకు ఆర్థిక భరోసా

» రూ. 68 లక్షల బీమా అందించిన డీజీపీ

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో మరణించిన ఇద్దరు హోంగార్డుల కుటుంబాలకు డీజీపీ శివధర్‌రెడ్డి బీమా మొత్తాన్ని అందించారు. కొత్తగూడెం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఇమ్మిడి రఘుపతి (హెచ్‌జీ 544), సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఎన్.సింహాచలం (హెచ్‌జీ 1093) ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారు. వీరి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, హోంగార్డుల బ్యాంకు ఖాతా ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ అందించిన బీమా మొత్తాన్ని డీజీపీ మంగళవారం అందజేశారు. రఘుపతి కుటుంబానికి రూ.30 లక్షలు, సింహాచలం కుటుంబానికి రూ.38 లక్షల చొప్పున మొత్తం రూ.68 లక్షలు అందాయి.

అల్లుడితో కేఈ ప్రభాకర్‌కు ఆస్తి వివాదం

» గాల్లోకి కాల్పులు జరిగినట్టు వార్తలు

» హైదరాబాద్‌లో కేసు నమోదు

» నేను కాల్పులు జరపలేదు : ప్రభాకర్

రాయదుర్గం, కర్నూలు, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో కాల్పుల అంశం మంగళవారం సంచలనంగా మారింది. కర్నూలుకు చెందిన మాజీ మంత్రి కేఈ ప్రభాకర్‌కు, ఆయన అల్లుడికి మధ్య ఆర్థిక లావాదేవీల వ్యవహారం రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. కేఈ ప్రభాకర్ కుమార్తెతో హైదరాబాద్‌లోని పటాన్‌చెరు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ కుమారుడు అభిషేక్‌గౌడ్‌కు 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ రెండు కుటుంబాల మధ్య వివాదంతో వేర్వేరుగా ఉంటున్నారు. మణికొండలోని పంచవటి కాలనీలో ఉన్న రూ.2 కోట్ల విలువైన ఆస్తి విషయంలో గత నెల 25వ తేదీన మామ, అల్లుడి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ వివాదం సందర్భంగా గాలిలోకి కాల్పులు జరిగినట్టు వార్తలువచ్చాయి. అయితే, అక్కడ ఎలాంటి కాల్పులు జరిగినట్టు ఆధారాలు లభించలేదని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మరోవైపు కేఈ ప్రభాకర్ ఈ వివాదంపై స్పందిస్తూ.. తాను ఎలాంటి కాల్పులు జరపలేదని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఎక్సైజ్ సిబ్బందికి ఆయుధ శిక్షణ

» ఏఈఎస్‌లు, ఎస్సైల శిక్షణ ప్రారంభించిన జూపల్లి

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలోని ఏఈఎస్‌లు, ఎస్సైలకు ఆయుధ శిక్షణ ఇస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. గ్రూప్-1 ద్వారా ఎంపికైన ఏఈఎస్‌లు, గ్రూప్-2 ద్వారా ఎంపికైన 84 మంది ఎస్సైలకు ఎక్సైజ్ అకాడమీలో మంగళవారం జరిగిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిక్షణలో ప్రతిభ కనబరచిన వారిని గుర్తించి ప్రమోషన్లు అందిస్తామని చెప్పారు. డ్రగ్స్, గంజాయి, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, ప్యూరియస్ లిక్కర్ వంటి వాటిని అరికట్టడంలో ఎక్సైజ్ సిబ్బంది కీలకపాత్ర పోషించాలన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు మాట్లాడుతూ.. ఎక్సైజ్ శాఖను కేవలం ఆదాయాన్ని సమకూర్చే విభాగంగా కాకుండా చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శిక్షణకు వసతులు కల్పిస్తామని కమిషనర్ హరికిరణ్ చెప్పారు.

అకాల వర్షం.. ఆగమాగం

మార్కెట్లలో తడిసిన పత్తి, మక్కలు.. అధికంగా తరుగు తీసి కొన్న వ్యాపారులు

» పలు జిల్లాల్లో జోరు వాన

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం కురిసిన అకాల వర్షంతో రైతులు ఆగమాగమయ్యారు. కుండపోతగా వర్షం కురవడంతో చేతికొచ్చిన పంట నీటిపాలైంది. వరంగల్‌లో భారీ వర్షం ధాటికి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మక్కలు, పత్తి, ఇతర సరుకులు తడిసిపోయాయి. ధరలు నిర్ణయించిన తరువాత వర్షం కురవడంతో రెండు గంటల పాటు కొనుగోళ్లను వ్యాపారులు నిలిపివేశారు. చివరకు క్వింటాల్‌కు 1-2కిలోల మేర అధికంగా తరుగు తీసి కొనుగోలు చేశారు. కేసముద్రం మార్కెట్ యార్డులోనూ రైతుల తీసుకొచ్చిన మక్కలు వరదలో కొట్టుకుపోయాయి. తేమ శాతం తగ్గేందుకు నాలుగైదు రోజులుగా ఆరబెట్టుకున్న మక్కలు తడిచిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని సిర్సపల్లి, పోతిరెడ్డిపేట, వెంకట్రావ్‌పల్లె, మానకొండూర్ మండలంలోని గంగాధర, గన్నేరువరం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం నీళ్లల్లో కొట్టుకుపోయింది. నాగర్‌కర్నూలులో వర్షం దంచికొట్టడంతో పలు కాలనీల రోడ్లు వాగులను తలపించాయి. నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో 5.6, నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండలంలో 4.43, తాడూరులో 3.95సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో భారీ వర్షం కురవగా ప్రభుత్వ కార్యాలయాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. టీటీడీ కల్యాణ మండపం, మినీ పాలశీతలీకరణ కేంద్రం, తహసీల్దార్ కార్యాలయ భవనంలోకి ఐదు రోజుల క్రితం వరద నీరు చేరుకోగా, మండల పరిషత్ కార్యాలయంలోకి రెండు రోజుల క్రితం వరద చేరి కార్యకలాపాలు నిలిచిపోయాయి. స్థానిక ఐకేపీ కేంద్రంలో 65 మంది రైతులకు చెందిన ధాన్యం రాశులు తడిసి ముద్దగా మారాయి. వరద నీరు నిలిచిన ప్రాంతాల్లో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్య లు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని ఆరెగూడెం శివారులో పిల్లాయిపల్లి కాల్వకు గండిపడగా ఆ నీరు పంటపొలాల్లోకి చేరి 50 ఎకరాల్లో వరి చేను నీట మునిగింది. పది రోజులుగా కాల్వ నుంచి నీరు లీక్ అవుతుండగా, నీటిపారుదల శాఖ డీఈ కృష్ణారెడ్డికి ఫోన్ చేసి సమాచారమందించినా పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, ఆమనగల్లు, మాడ్గుల, యాచారం, ఇబ్రహీంపట్నం, చౌదరిగూడ, కేశంపేట మండలాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో పంట చేతికందే సమయంలో పత్తి, వరి, మొక్కజొన్న, వేరుశనగ, కూరగాయలు, ఆకుకూరలు, తదితర పంటలు నీట మునిగాయి. ఆమనగల్లు ఏపీజీవీబీ బ్యాంక్ ఎదుట, తహసీల్దార్ కార్యాలయ సమీపంలో హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున వర్షం నీరు నిలిచి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లేడ్ చౌదరిగూడ, కేశంపేట మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. వికారాబాద్ జిల్లా ధారూరు శివారులోని కుమ్మరి వాగు పొంగిపొర్లింది. పెద్దేముల్ మండలంలోని జైరాంతండా వద్ద కల్వర్టుపై నుంచి వాగు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. హనుమకొండ జిల్లా పరకాల మండలం పోచారంలో మంగళవారం పిడుగుపడి రైతు పూస మహిపాల్(40) మృతి చెందాడు.


నల్లగొండ జిల్లా ఆరెగూడెంలో పిలాయిపల్లి కాల్వకు గండి పడి ముంపునకు గురైన వరి చేను

ప్రాజెక్టులకు పెరుగుతున్న వరద

గోదావరి, కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు వరద స్వల్పంగా పెరిగింది. మంగళవారం గోదావరి బేసిన్‌లోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 56 వేల క్యూసెక్కుల వరద రాగా... 56 వేల క్యూసెక్కులు దిగువకు వదిలిపెట్టారు. ఎల్లంపల్లికి 1.19 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. కృష్ణా బేసిన్‌లో జూరాలకు 25 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా... 28 వేల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. శ్రీశైలం ప్రాజెక్టుకు 41 వేలు, నాగార్జునసాగర్‌కు 39 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... అంతేస్థాయిలో దిగువకు వదులుతున్నారు. ఈ సీజన్‌లో శ్రీశైలం ప్రాజెక్టుకు 2278 టీఎంసీల వరద రాగా, ప్రాజెక్టు కట్టిన నాటి నుంచి ఇదే అత్యధికం.


ఆదిలాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కవిత

రైతు సమస్యలను పట్టించుకోని సర్కార్

» 4 నెలల తర్వాత పార్టీ ఏర్పాటుపై నిర్ణయం

» వచ్చే ఎన్నికల్లో ఆదిలాబాద్ నుంచి పోటీ: కల్వకుంట్ల కవిత

ఆదిలాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఉన్న శ్రద్ధ రైతుల సమస్యలపై లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జనంబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉప ఎన్నికలు వచ్చి ఉంటే రైతుల సమస్యలన్నీ తీరేవని పేర్కొన్నారు. సామాజిక తెలంగాణ సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, జాగృతిని మరింత బలోపేతం చేసి సమస్యలను పరిష్కరించేలా పోరాటం చేస్తామని చెప్పారు. జాగృతి జనంబాట కార్యక్రమం ద్వారా నాలుగు మాసాల పాటు ప్రజల సమస్యలను తెలుసుకుని ఆ తర్వాత పార్టీ పెట్టాలా.. లేదా ? అనేది ఏదో ఒక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో ఇప్పుడే చెప్పలేమన్నారు. ఆదిలాబాద్‌లో తీవ్రమైన సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు అవసరమైతే వచ్చే ఎన్నికల్లో ఆదిలాబాద్ నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేయాలని అనిపిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో రైతులెవరూ సంతోషంగా లేరని, వరికి బోనస్ ఇవ్వడం లేదని, రైతుభరోసా ఇస్తామన్నంత ఇవ్వడం లేదని ఆమె మండిపడ్డారు.

ఓ డాక్టర్ డ్రగ్స్ దందా

» మత్తుకు బానిసై.. ఆపై వ్యాపారం

» పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

» మాదక ద్రవ్యాలు స్వాధీనం

» వైద్యుడి అరెస్టు, ముగ్గురి పరారీ

» గచ్చిబౌలిలో డ్రగ్స్ పార్టీ భగ్నం

» 11 మంది అరెస్టు


డాక్టర్ వద్ద దొరికిన డ్రగ్స్

హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో డ్రగ్స్ కేసులు కలకలం రేపుతున్నాయి. రోగులు ప్రాణాలు కాపాడాల్సిన ఓ వైద్యుడు మత్తుకు బానిసై స్నేహితులతో కలిసి చేస్తున్న డ్రగ్స్ దందాను ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు రట్టు చేశారు. ఆ వైద్యుడి వద్ద రూ.3లక్షల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌లో నివాసముంటున్న జాన్‌పాల్ అనే యువకుడు స్థానికంగా పీజీ వైద్య విద్య అభ్యసిస్తున్నాడు. స్నేహితుల ద్వారా డ్రగ్స్‌కు అలవాటుపడిన జాన్‌పాల్ క్రమంగా వాటికి బానిసయ్యాడు. అయితే, డ్రగ్స్ కొనుగోలు చేసేందుకు డబ్బు లేక స్నేహితులతో కలిసి డ్రగ్స్ దందాలోకి దిగాడు. తన స్నేహితులు సందీప్, ప్రమోద్, శరత్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డాడు. ఈ ముగ్గురూ తమకున్న పరిచయాల ద్వారా ఢిల్లీ, బెంగళూరు నుంచి ఓజీ కుష్ (విదేశీ గంజాయి), ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ బ్లాట్స్, కొకైన్, హాషిష్ ఆయిల్ వంటి మాదక ద్రవ్యాలను దిగుమతి చేసుకునేవారు. వాటిని జాన్‌పాల్ గదిలో ఉంచి విక్రయించేవారు. జాన్‌పాల్ తనకు కావాల్సినప్పుడు ఆ డ్రగ్స్‌ను వినియోగించేవాడు. స్నేహితుల సూచనల మేరకు తన వద్దకు వచ్చిన వారికి డ్రగ్స్ విక్రయించేవాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు.. జాన్‌పాల్ ఇంటిపై మంగళవారం దాడి చేశారు. జాన్‌పాల్ గదిలో రూ.3లక్షల విలువైన ఓజీ కుష్, ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ బ్లాట్స్, కొకైన్, గుమ్మస్, హాషిష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. జాన్‌పాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న సందీప్, ప్రమోద్, శరత్ కోసం గాలిస్తున్నారు.

డ్రగ్స్ పార్టీ కలకలం

హైదరాబాద్, గచ్చిబౌలి ప్రాంతంలో జరుగుతున్న డ్రగ్స్ పార్టీని భగ్నం చేసిన ఎస్‌టీఎఫ్ పోలీసులు ఓ నైజీరియన్ సహా 11 మందిని అరెస్టు చేశారు. వారినుంచి రూ.6లక్షలు విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి టీఎన్‌జీవో కాలనీలోని ఎస్ఎం లగ్జరీ గెస్ట్ రూమ్ కోలివింగ్, పీజీ హస్టల్స్‌లోని ఓ గదిలో డ్రగ్స్‌పార్టీ జరుగుతుందనే సమాచారంతో పోలీసులు దాడి చేశారు. డ్రగ్స్ వినియోగిస్తున్న పలువురిని, సరఫరా చేసిన వారిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిచ్చిన సమాచారంతో మాదాపూర్‌లో నైట్ ఐ హోటల్‌లో దాడిచేసి మరో నలుగురిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.6లక్షల విలువైన ఎండీఎంఏ డ్రగ్స్, గంజాయి, రూ.10 వేల నగదు, 2బైక్‌లు, స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో గుత్తా తేజకృష్ణ, షజీర్ మొటుంగారా(నైజీరియన్), వెన్నెల రవికిరణ్, పాకనాటి లోకేష్ రెడ్డి, పెద్దమంతూర్ హర్షవర్ధన్‌రెడ్డి, మన్నె వెంకట ప్రశాంత్, పృథ్వీ విష్ణువర్దన్, కార్లపూడి ప్రెస్లీ సుజిత్, మేకల గౌతం, గుండె బోయిన నాగార్జున, గుంటక సతీష్‌రెడ్డి ఉన్నారు. కాగా, గుత్తా తేజ కృష్ణ ప్రధాన స్మగ్లర్ అని, ఓ నైజీరియన్‌తో కలిసి కర్ణాటక నుంచి డ్రగ్స్ తెచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నాడని పోలీసులు తెలిపారు. కొందరు నైజీరియన్లు సహా పరారీలో ఉన్న మరో 7 మంది కోసం గాలిస్తున్నామని మాదాపూర్ జోన్ అదనపు డీసీపీ ఎస్.ఉదయ్‌రెడ్డి చెప్పారు.

డబ్బుల కోసం మాజీ భర్త కిడ్నాప్

ఇటీవల వారసత్వ ఆస్తి విక్రయంతో బాధితుడి చేతికి 20 కోట్లు.. కొందరితో కలిసి ఓ మహిళ పథకం

» కేసును ఛేదించిన పోలీసులు

» మహిళ, ఇతర నిందితుల అరెస్టు

అంబర్‌పేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ డబ్బు కోసం తన మాజీ భర్తను కిడ్నాప్ చేయించింది. ఈస్ట్‌జోన్ డీసీపీ బీ బాలస్వామి మంగళవారం అంబర్‌పేటలోని డీసీపీ కార్యాలయంలో ఈ కేసు వివరాలను తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మంత్రి శ్యామ్(55) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. కొంతకాలం అమెరికాలో పనిచేశాడు. ఆ సమయంలో మాధవీలత(51)ను వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అక్కడ వారి మధ్య విభేదాలు రావడంతో విడాకులు తీసుకున్నారు. 2005లో హైదరాబాద్‌కు వచ్చారు. విడాకులు తీసుకున్నా హైదరాబాద్‌లో 2022 వరకు కలిసి ఉండి రెస్టారెంట్ వ్యాపారం నిర్వహించారు. నష్టం రావడంతో అమ్మివేశారు. మూడేళ్లుగా శ్యామ్.. మాధవీలతకు దూరంగా అంబర్‌పేట డీడీ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా ఉంటూ ఆలీ అనే పేరుతో ఫాతిమా అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. ఆమె ఆరాంఘర్‌లో ఉంటోంది. రెండు నెలల క్రితం శ్యామ్ తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన బంజారాహిల్స్‌లోని ఓ షాపింగ్ కాంప్లెక్స్‌ను రూ.20 కోట్లకు అమ్మివేశాడు. ఆ డబ్బు తనకు, తన పిల్లలకు దక్కదేమోనని మాధవీలత గతంలో రెస్టారెంట్ నిర్వహించినప్పుడు మేనేజర్‌గా పనిచేసిన అంబర్‌పేటకు చెందిన ఉండి దుర్గ వినయ్(32)ను సంప్రదించింది. తన భర్తను కిడ్నాప్ చేసి ఆస్తి రాయించుకోవాలన్న ఆలోచనను చెప్పింది. వినయ్ తన మిత్రుడు కట్ట దుర్గాప్రసాద్ ఆలియాస్ సాయి(32)ని మాధవీలతకు పరిచయం చేశాడు. ముగ్గురూ శ్యామ్‌ను కిడ్నాప్ చేయడానికి పథకం రూపొందించారు. సాయి తన మిత్రులు కాటమోని పురుషోత్తం(31), సందోలు నరేష్‌కుమార్(29), కోశకోలు పవన్ కుమార్(25), నారాయణ రిషికేష్ సింగ్(23), పిల్లి వినయ్(29)లను కూడా కలుపుకొన్నాడు. శ్యామ్‌పై నిఘా ఉంచడానికి లేడీ బౌన్సర్ ప్రీతి(34), సరిత(32)లను అతని ఫ్లాట్ ఎదురు ఫ్లాట్‌లో రెండు రోజుల ముందు నుంచి ఉంచాడు. గత నెల 29న సాయంత్రం సాయి, అతని ముఠా రెండు కార్లలో వచ్చి శ్యామ్‌ను కిడ్నాప్ చేశారు. శ్యామ్ రెండో భార్య ఫాతిమా అదేరోజు అంబర్‌పేట పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. శ్యామ్‌ను కిడ్నాపర్లు విజయవాడ తీసుకెళ్లి.. డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లో డబ్బులు ఇస్తానని చెప్పడంతో 31న అతన్ని తీసుకొచ్చారు. నిందితుల బారి నుంచి తప్పించుకుని శ్యామ్ ఫోన్ చేయడంతో అంబర్‌పేట పోలీసులు అతడిని కాపాడారు. నిందితులు పారిపోయారు. తనను కిడ్నాప్ చేస్తే కోటి రూపాయలు ఇస్తానని మాధవీలత చెప్పినట్లు కిడ్నాపర్లు చెప్పారని శ్యామ్ తెలిపాడు. పోలీసులు మంగళవారం కొందరు నిందితులను, మాధవీలతను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరో నలుగురిని కూడా అరెస్ట్ చేస్తామని తెలిపారు.

నరేష్ అంత్యక్రియలు బహ్రెయిన్‌లోనే..

» ఐదేళ్ల క్రితం ఆ దేశంలో మరణించిన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వాసి

» అప్పట్నించి అక్కడి మార్చురీలోనే మృతదేహం

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి/బేగంపేట : ఐదేళ్ల క్రితం బహ్రెయిన్‌లో మరణించిన జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన శ్రీపాద నరేష్ అంత్యక్రియలు బహ్రెయిన్‌లోనే జరగనున్నాయి. సాంకేతిక కారణాలతోపాటు నరేష్ మృతదేహం స్వదేశానికి తరలించే పరిస్థితిలో లేకపోవడంతో పరాయి దేశంలోనే అంత్యక్రియల నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మెట్‌పల్లికి చెందిన శ్రీపాద నరేష్ ఉపాధి నిమిత్తం 15 ఏళ్ల క్రితం బహ్రెయిన్ వెళ్లాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురైన నరేష్ 2020లో బహ్రెయిన్‌లోని ఓ ఆస్పత్రిలో మరణించాడు. అప్పట్నించి అతడి మృతదేహం అక్కడి మార్చురీలోనే ఉండిపోయింది. దానిని తరలించాలని బహ్రెయిన్ అధికారులు భారత రాయబార కార్యాలయానికి ఇటీవల సమాచారం ఇచ్చారు. దీనిపై ఐదేళ్లుగా ఎడారి దేశంలో పడి ఉన్న మృతదేహం అంటూ 'ఆంధ్రజ్యోతి' ఓ కథనం కూడా ప్రచురించింది. దీంతో నరేష్ కుటుంబసభ్యుల దృష్టికి విషయం చేరింది. బహ్రెయిన్‌లో నరేష్ దుస్థితి తెలియని అతని భార్య లత అలియాస్ నాగమణి.. అత్తమామలు తన భర్తకు రెండో పెళ్లి చేశారని అందుకే ఆచూకీ లేకుండా పోయాడని ఇంతకాలం భావించింది. 'ఆంధ్రజ్యోతి' కథనం ద్వారా అసలు విషయం తెలుసుకున్న నాగమణి, ఇతర కుటుంబసభ్యులు నరేష్ మృతదేహాన్ని స్వదేశానికి రప్పించాలని ప్రజావాణి ద్వారా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. మృతదేహాన్ని తరలించే పరిస్థితి లేకపోవడంతో బహ్రెయిన్‌లోనే అంత్యక్రియలు చేయాలని భారత ఎంబసీ అధికారులు స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన ఎన్‌వోసీని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో నరేష్ సోదరుడు ఆనంద్ ప్రజాభవన్‌లో మంగళవారం సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డికి అందజేశారు. బహ్రెయిన్‌లోని సామాజిక కార్యకర్తలు కోటగిరి నవీన్, డోర్నాల శివకుమార్ అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పేదలను పోలింగ్ బూత్ వరకు రానియొద్దు

» కేంద్రమంత్రి లలన్ సింగ్ వ్యాఖ్య.. పోలీసు కేసు నమోదు




పట్నా, నవంబరు 4: పేదలను ఓటు వేయనీయకండి అంటూ కేంద్ర మంత్రి, జేడీ(యూ) నాయకుడు రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ చేసిన వ్యాఖ్య వివాదాస్పదమయింది. మొకామాలో జరిగిన ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ ఎన్నికలు జరిగే రోజున పేదలు పోలింగ్ స్టేషన్ వరకు రాకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. లాలు ప్రసాద్‌కు చెందిన ఆర్జేడీ పార్టీ దీనిపై హిందీలో ట్వీట్ చేస్తూ లలన్ సింగ్..ఎన్నికల కమిషన్ అధికారాన్ని బహిరంగంగా సవాలు చేస్తున్నారని విమర్శించింది. ఎన్నికల కమిషన్ ఛాతీపై నుంచి బుల్డోజర్‌ను పంపించారని వ్యాఖ్యానించింది. దీనిపై ఇతర పార్టీలు కూడా విమర్శలు చేయడంతో పట్నా జిల్లా పోలీసులు స్పందించి కేసు నమోదు చేశారు. వివరణ ఇవ్వాలంటూ ఎన్నికల కమిషన్ కూడా నోటీసులు పంపించింది.

పంటనష్టం కింద రైతుకు పరిహారం రూ. 2.30

» ఖాతాలో పడాల్సింది లక్షన్నరకు పైగానే. అవాక్కయిన బాధిత రైతు.. మహారాష్ట్రలో ఘటన

ముంబై, నవంబరు 4: అకాల వర్షాలతో 6.5 ఎకరాల్లో వేసిన పంట తుడిచిపెట్టుకుపోవడంతో ప్రభుత్వం నుంచి పరిహారం కింద వచ్చే మొత్తంతో పెట్టుబడి ఖర్చులైనా మిగులుతాయని ఆ రైతు ఆశించాడు. అయితే ఆ రైతు ఖాతాలో ప్రభుత్వం వేసిన మొత్తమెంతో తెలుసా? కేవలం రెండు రూపాయల ముప్పై పైసలు! మహారాష్ట్రలోని శిలోత్తర్ గ్రామానికి చెందిన మధుకర్ బాబూరావు అనే రైతుకు ఎదురైన దిగ్భ్రాంతికరమైన అనుభవమిది. బాబూరావు.. 'పీఎం ఫసల్ బీమా యోజన' కింద తాను వేసిన పంట కోసం జూలై 16న రూ.1148 ప్రీమియం కట్టారు. ఇటీవల అకాల వర్షాలతో ఆయన వేసిన పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. 6.5 ఎకరాల్లో పంట నష్టాన్ని లెక్కగట్టిన వ్యవసాయాధికారులు బాబూరావుకు పరిహారం కింద రూ.1,53,110 వస్తాయని తేల్చారు. అయితే అక్టోబరు 31న ఖాతాలో మాత్రం రూ.2.30 మాత్రమే వేశారు. అవాక్కయిన బాబూరావు.. అధికారులను సంప్రదించగా పొరపాటైందంటూ నాలుక్కరుచుకున్నారు. 2023లోనూ బాబూరావుకు పంట నష్టం జరిగింది. అప్పట్లో ఆయనకు పరిహారం కింద రూ. 72,466 రావాలి. అయితే రూ.72,463.70 మాత్రమే ఖాతాలో వేశారు. అప్పట్లో ఆ మిగిలిన రూ.2.30ను ఇప్పుడు ఇచ్చారన్నమాట! సాంకేతిక సమస్య వల్లే అలా జరిగినట్లు అధికారులు అంగీకరించారు.

లోకం తీరు



ఛత్తీస్‌గఢ్‌లో గూడ్స్, ప్యాసింజర్ రైళ్ల ఢీ

» ఎనిమిది మంది మృతి.. 14మందికి గాయాలు

బిలాస్‌పూర్, నవంబరు 4: ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో ప్యాసింజర్ రైలు, గూడ్స్ ట్రైను ఢీకొన్నాయి. మంగళవారం సాయంత్రం 4గంటల సమయంలో బిలాస్‌పూర్ రైల్వే స్టేషన్ సమీపంలో లాల్ ఖండ్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ప్యాసింజర్ రైలు గూడ్సును వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో, ప్యాసింజర్ ముందుభాగం గూడ్స్ ట్రైను బోగీల మీదకు దూసుకువెళ్లింది. ఈ ఘటనలో ఎనిమిది మంది చనిపోయారు. 14మంది గాయపడ్డారు. రెండు రైళ్లకు సంబంధించిన కొన్ని బోగీలు పట్టాలు తప్పాయి. ప్రమాదం కారణంగా బిలాస్‌పూర్-హౌడా మార్గంలో రైల్వే సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. కాగా, మృతుల కుటుంబాలకు రూ.10లక్షలు, తీవ్రంగా గాయపడినవారికి రూ.5లక్షలు, స్వల్ప గాయాలైన వారికి రూ.1లక్ష చొప్పున పరిహారం ప్రకటించారు.

భారతీయ విద్యార్థులకు కెనడా మొండిచెయ్యి!

న్యూఢిల్లీ, నవంబరు 4: భారతీయ విద్యార్థులకు కెనడా మొండిచెయ్యి చూపించింది. ఆ దేశంలోని విద్యాసంస్థల్లో చదువుకోవడానికి విద్యార్థి వీసా కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి నలుగురిలో ముగ్గురి దరఖాస్తులను ఇమిగ్రేషన్ అధికారులు తిరస్కరించారు. అధికారిక లెక్కల ప్రకారం... ఈ ఏడాది ఆగస్టులో దాదాపు 74% మంది భారత విద్యార్థుల వీసా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. 2023లో ఈ తిరస్కరణ రేటు 32% ఉంది. కాగా, గతేడాది చైనీయుల స్టడీ పర్మిట్లను 24 శాతం తిరస్కరించగా, అన్ని దేశాల వీసా దరఖాస్తులు కలిపి దాదాపు 40 శాతం నిరాకరించారు. మరోవైపు, భారత్ నుంచి కెనడా వెళ్లడానికి దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోయింది. 2023 ఆగస్టులో 20,900 మంది దరఖాస్తు చేసుకోగా, ఈ ఆగస్టులో వీరిసంఖ్య 4,515కు పరిమితమైంది. ఇదిలా ఉండగా, కొన్ని భారతీయ గ్రూపులకు జారీ చేసిన తాత్కాలిక వీసాలను మోసాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో గంపగుత్తగా రద్దు చేయాలని కెనడా భావిస్తోంది.

అమెరికాలో విమానాల 'షట్‌డౌన్'!

వాషింగ్టన్, నవంబరు 4: అమెరికాలో పౌర విమానాయనానికి 'షట్‌డౌన్' దెబ్బతగిలింది. రోజూ వందల సంఖ్యలో విమాన సర్వీసులు రద్దవుతుండటం, వేల సంఖ్యలో విమానాలు ఆలస్యంగా నడుస్తుండటంతో ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. విమానాశ్రయాల్లో భారీగా క్యూలు నిలిచిపోతున్నాయి. గత మూడు రోజుల్లో ఏకంగా 2,282 విమానాలు రద్దయ్యాయని, 16,700 విమానాలు చాలా ఆలస్యంగా నడిచాయని అమెరికా విమానాల రాకపోకలను పరిశీలించే 'ఫ్లైట్‌అవేర్' సంస్థ ప్రకటించింది. అధ్యక్షుడు ట్రంప్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సెనేట్ ఆమోదించకపోవడంతో 33 రోజులుగా 'ప్రభుత్వ ప్రతిష్ఠంభన' నెలకొంది. దీనితో ప్రభుత్వ ఉద్యోగులకు రెండో నెల కూడా వేతనాలు అందలేదు. దీనితో చాలా మంది అమెరికా ఫెడరల్ ఏవియేషన్(ఎఫ్ఏఏ) విధులకు డుమ్మా కొడుతున్నారు. ఇదిలా ఉండగా, అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్‌తో ఫెడరల్ నిధుల కొరత కారణంగా గత నెల రోజులుగా నిలిచిన హెచ్-1బీ వీసాల ప్రాసెసింగ్‌ను ఎట్టకేలకు పునరుద్ధరించారు.

ఇంగ్లిష్‌లో ఫెయిలైనందుకు అమెరికాలో 7,248 ట్రక్కు డ్రైవర్లకు ఉద్వాసన

న్యూఢిల్లీ, నవంబరు 4: అమెరికా రహదారుల భద్రతకు ప్రాధాన్యమిస్తున్న ట్రంప్ అడ్మినిస్ట్రేషన్.. ఇంగ్లీష్ భాష పరీక్షలో ఫెయిలైన 7,248 మంది ట్రక్కు డ్రైవర్లను గత నెలలో నిషేధించింది. 'ఇంగ్లీష్ మాట్లాడటంతోపాటు అర్థం చేసుకునే వారిని మాత్రమే వాణిజ్య ట్రక్కుల డ్రైవర్లుగా నియమించుకోవాలి' అని అమెరికా రవాణాశాఖ మంత్రి సియాన్ డఫ్ఫీ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ ఏడాది ఆగస్టు వరకూ 1,500 మంది ట్రక్కు డ్రైవర్లను తొలగించగా, గత నెలలో 7,000 దాటింది. భారతీయ డ్రైవర్ల వల్ల వరుసగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ట్రక్కర్ల సంఘం అంచనా ప్రకారం అమెరికా ట్రక్కు డ్రైవర్లలో 1.30-1.50 లక్షల మంది భారతీయులుంటారు. తాజాగా ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ తెచ్చిన కొత్త నిబంధనతో చాలా మందిపై ప్రతికూల ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

ఆయన్ను అమెరికా నుంచి డీపోర్ట్ చేయొద్దు

» చేయని నేరానికి 43 ఏళ్లుగా జైల్లో మగ్గిపోతున్న వేదం సుబ్రహ్మణ్యానికి యూఎస్ కోర్టుల ఊరట

న్యూయార్క్, నవంబరు 4: తాను చేయని హత్యా నేరానికి అమెరికాలో 43 సంవత్సరాలపాటు జైల్లో మగ్గిపోయి, చివరికి నిర్దోషిగా విడుదలై.. ఇప్పుడు దేశ బహిష్కరణ ముప్పును ఎదుర్కొంటున్న భారత సంతతి వ్యక్తి వేదం సుబ్రహ్మణ్యానికి ఎట్టకేలకు ఉపశమనం లభించింది. ఆయన్ను దేశం నుంచి పంపించేయాలన్న 'బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ)' ప్రయత్నాలకు రెండు న్యాయస్థానాలు చెక్ పెట్టాయి. ఇమ్మిగ్రేషన్ అప్పీళ్ల బ్యూరో ఆయన కేసును పరిశీలించాలా లేదా అని నిర్ణయించేదాకా ఆయన్ను డీపోర్ట్ చేయొద్దని ఆదేశించాయి. వేదం సుబ్రహ్మణ్యం వయసు ప్రస్తుతం 64 సంవత్సరాలు. భారతదేశంలో జన్మించిన ఆయన.. 1962లో 9నెలల వయసులో తల్లిదండ్రులతోపాటు అమెరికా వెళ్లారు. స్కూల్లో చదివేటప్పుడు.. టామ్ కిన్సెర్ అనే మరో పిల్లాడితో ఆయనకు స్నేహం కుదిరింది. 1980 డిసెంబరులో టామ్ ఉన్నట్టుండి కనపడకుండా పోయాడు. 1981 సెప్టెంబరులో టామ్ శవం దొరికింది. అతడి పుర్రె భాగంలో ఒక తూటాను గుర్తించారు. టామ్ చివరిసారి మాట్లాడింది సుబ్బుతోనేనని దర్యాప్తులో తెలియడంతో పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేశారు. ఎలాంటి సాక్ష్యాలూ లేకుండానే.. 1983 ఫిబ్రవరిలో కోర్టు ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అప్పట్నుంచీ ఆయన పెన్సిల్వేనియా జైల్లోనే ఉన్నారు. కానీ.. అన్యాయంగా జైలుపాలైన అమాయకులను విడిపించడానికి కృషి చేసే 'పెన్సిల్వేనియా ఇన్నోసెన్స్ ప్రాజెక్ట్' అనే స్వచ్ఛంద సంస్థ 2022లో ఆయన కేసును స్వీకరించడంతో అంతా మారిపోయింది. ఈ స్వచ్ఛంద సంస్థకు చెందిన లాయర్ల బృందం ఈ కేసు విచారణ సమయంలో పోలీసులు దాచిపెట్టిన ఒక నిజాన్ని బయటకు తీయడంతో ఆగస్టులో కోర్టు ఆయన శిక్షను రద్దు చేసింది. అక్టోబరు 3న సుబ్రహ్మణ్యం విడుదల కావాల్సి ఉంది. కానీ.. యూఎస్ ఇమ్మిగ్రేషన్ అధికారులు.. టామ్ హత్య కేసులో అరెస్టు కావడానికి ముందు ఆయనపై నమోదైన డ్రగ్స్ కేసునొకదాన్ని బయటకు తీసి ఆయన్ను దేశం నుంచి బహిష్కరించే(డీపోర్టేషన్) ప్రయత్నం చేశారు. కానీ, ఆయన సోదరి సరస్వతి న్యాయపోరాటం ఫలితంగా.. యూఎస్ ఇమ్మిగ్రేషన్ కోర్టు, పెన్సిల్వేనియాలోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు కూడా ఆయన డీపోర్టేషన్ ప్రక్రియను నిలిపివేశాయి.

ఉచిత చాట్‌జీపీటీ ఆరంభం

న్యూఢిల్లీ, నవంబరు 4: ప్రచారంలో భాగంగా ఉచిత 'చాట్‌జీపీటీ గో' పథకాన్ని ఓపెన్ ఏఐ సంస్థ మంగళవారం ప్రారంభించింది. దీని కింద 12నెలల పాటు ఉచితంగా చాట్‌జీపీటీ సేవలను ఉపయోగించుకోవచ్చు. రుసుములు ఏవీ లేకపోవడంతో తొలుత ఒక రూపాయిని జమ చేస్తే, దాన్ని వాపసు చేసేలా ఏర్పాట్లు చేసింది. ప్రారంభం రోజున చాలా సమస్యలు ఎదురయ్యాయని పలువురు వినియోగదారులు ఎక్స్‌లో ఫిర్యాదు చేశారు. ఒక రూపాయిని జమ చేసినా, చెల్లించాలంటూ మళ్లీ మళ్లీ మెసేజ్‌లు వచ్చాయి. యూపీఐ ద్వారా పేమెంట్ చేసే సమయంలో స్క్రీన్లు స్ట్రక్ అయ్యాయి. మొదటి రోజున ఎదురయిన ఇబ్బందులను పరిష్కరిస్తామని ఓపెన్ ఏఐ వర్గాలు తెలిపాయి.

నా బెంచ్‌ను తప్పించుకునే ఎత్తుగడ!

(మొదటి పేజీ తరువాయి)



వాదనలు విని, విచారణను ముగిస్తామని, ఆ తర్వాతే విస్తృత ధర్మాసనానికి ఇవ్వాలా? వద్దా? అన్న నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. పిటిషనర్ల న్యాయవాది అరవింద్ డాటర్ వాదనలు వినిపిస్తూ, ఐటాట్, క్యాట్ లాంటి ట్రైబ్యునళ్ల నియామకాలకు సంబంధించి ఎన్నోసార్లు వడపోతలతో ప్రతిభావంతుల జాబితా సిద్ధమైన తర్వాత హఠాత్తుగా జాబితాను పక్కన బెడుతున్నారని, తాజా ఎంపికలకు ఆదేశిస్తున్నారని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కొన్నిసార్లు కొత్త ప్రతిభావంతుల జాబితాను తయారు చేయకుండా వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న వారితో నింపేస్తున్నారని వెల్లడించారు. ప్రతిభావంతుల జాబితాలో చేర్చిన తర్వాత చాలామంది బాధ్యతలు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారని, అందువల్లే ప్రతిభావంతుల జాబితా విషయంలో స్థిరంగా ఒకే విధానం అవలంబించడం కుదరడంలేదని అటార్నీ జనరల్ వివరించారు. ఇందులో ఐదుగురు సభ్యుల విస్తృత ధర్మాసనానికి నివేదించాల్సిన అవసరం ఏముందని సీజేఐ ప్రశ్నించారు. తమకు తప్పించుకొనే ఉద్దేశం లేదని, చట్టంలోని లొసుగులను, దానివల్ల జరిగిన కొన్ని తప్పులను ఆధారంగా చేసుకొని మొత్తం చట్టాన్నే కొట్టేయడం సరికాదని అటార్నీ జనరల్ స్పష్టం చేశారు. చట్టాన్ని కొనసాగనిస్తే పిటిషనర్లు లేవనెత్తిన సాంకేతిక లోపాలను కాలక్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. ట్రైబ్యునల్ లో నియామకానికి 50 ఏళ్ల కనీస వయో పరిమితిని పెట్టడాన్ని సీజేఐ తప్పుబట్టారు. తాను 42వ ఏటే హైకోర్టు జడ్జిని అయ్యానని గుర్తు చేసుకున్నారు. హైకోర్టులకు, ట్రైబ్యునళ్లకు ఒకే అర్హత నిబంధనలు సరికాదని, రెండింటికీ భిన్నమైన అనుభవం అవసరమని అటార్నీ జనరల్ బదులిచ్చారు. సీజేఐ తదుపరి వాదనలు ఏడవ తేదీకి వాయిదా వేశారు. ట్రైబ్యునళ్ల సంస్కరణల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2020-21 మధ్యకాలంలో పలు ఆర్డినెన్స్‌లను తెచ్చింది. వాటికి న్యాయస్థానాలు కొట్టేశాయి. దాంతో 2021లో అవే నిబంధనలతో చట్టం చేసింది. ఆర్డినెన్స్‌లోని అంశాలతో రూపొందించిన చట్టం కాబట్టి సుప్రీంకోర్టు దీన్ని కూడా కొట్టేస్తుందనే అనుమానాలున్నాయి. ఈ నేపథ్యంలోనే విస్తృత ధర్మాసనం విచారణను కేంద్ర ప్రభుత్వం కోరుకుంటోంది.

బయోమెట్రిక్ హాజరు ఏర్పాటుకు ఉద్యోగుల సమ్మతి అవసరం లేదు


» వారిని సంప్రదించనంత మాత్రాన అది చట్టవిరుద్ధం కాదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టడానికి ఉద్యోగుల సమ్మతి అవసరం లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఉద్యోగులను సంప్రదించనంత మాత్రాన బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ చట్ట విరుద్ధం కాదని పేర్కొంది. ఒడిశాలోని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్(ఏ అండ్ ఈ) కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు వ్యవస్థను ప్రవేశపెట్టాలని కేంద్రం నిర్ణయించింది. 2013 జూలై 1, అక్టోబర్ 22, నవంబర్ 6 తేదీల్లో సిబ్బందికి బయోమెట్రిక్ హాజరును అమలు చేస్తామంటూ ఆ శాఖ సర్క్యులర్లు జారీ చేసింది. ఈ సర్క్యులర్లను ఉద్యోగులు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్‌లో సవాలు చేశారు. తమ అనుమతి లేకుండా ఈ నిర్ణయాన్ని తీసుకున్నారని, ఇది మాన్యువల్‌లో పేర్కొన్న నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఆ పిటిషన్‌ను ట్రైబ్యునల్ డిస్మిస్ చేసింది. ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించగా అనుకూలంగా తీర్పు వచ్చింది. హైకోర్టు తీర్పును కేంద్రం సుప్రీంలో సవాల్ చేసింది. కాగా, నిబద్ధతతో పనిచేసేవాళ్లకు బయోమెట్రిక్‌తో ఇబ్బందేంటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. హైకోర్టు తీర్పును కొట్టివేసింది.

కేంద్ర ఉద్యోగుల చివరి పనిదినం లెక్కింపులో స్పష్టత

న్యూఢిల్లీ, నవంబరు 4: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు విధుల్లో చివరి పనిదినాన్ని ఎలా లెక్కించాలన్న దానిపై కేంద్ర పెన్షన్లు, పెన్షనర్ల సంక్షేమ విభాగం తాజాగా స్పష్టత ఇచ్చింది. ఉద్యోగులు విధుల్లోంచి తప్పుకొన్న అనంతరం లభించే పెన్షన్, వారి కుటుంబానికి అందే పెన్షన్ మొత్తాన్ని నిర్ధారించేందుకు, ఇతర ప్రయోజనాలను గణించేందుకు చివరి పనిదినమే కీలకం. అయితే పదవీ విరమణ, రాజీనామా, విధుల్లోంచి తొలగించడం, సస్పెన్షన్‌లోనో, సెలవులోనో ఉండటం, మృతి చెందడం వంటి సమయాల్లో.. చివరి పని దినాన్ని ఎలా లెక్కించాలన్న దానిపై సందేహాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో స్పష్టత ఇస్తూ కేంద్ర పెన్షన్ల విభాగం ఆఫీస్ మెమొరాండం విడుదల చేసింది. కేంద్ర సివిల్ సర్వీసెస్ (పెన్షన్) నిబంధనలు-2021 ప్రకారం.. పదవీ విరమణ, రాజీనామా, విధుల్లోంచి తొలగించడం, మరణం వంటి సందర్భాల్లో ఏది ముందు జరిగితే.. దానినే చివరి పనిదినంగా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. ఇక ఉద్యోగి పదవీ విరమణ లేదా మృతి సమయంలో సెలవులో ఉన్నా, గైర్హాజరు అయినా, సస్పెన్షన్‌లో ఉన్నా.. ఆ కాలాన్ని విధుల్లో ఉన్నట్టుగానే పరిగణించి, పెన్షన్ మొత్తాన్ని నిర్ధారిస్తారని వెల్లడించింది.

అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు చెనీ కన్నుమూత



వాషింగ్టన్, నవంబరు 4: అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు, రిపబ్లికన్ మాజీ నేత డిక్ చెనీ(84) కన్ను మూశారు. న్యుమోనియాతోపాటు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చెనీ.. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ప్రకటించారు. జార్జ్ డబ్ల్యూ బుష్ హయాంలో ఉపాధ్యక్షుడిగా పనిచేసిన చెనీ.. బలమైన సంప్రదాయవాదిగా, అమెరికా చరిత్రలో శక్తివంతమైన ఉపాధ్యక్షుడిగా పేరు పొందారు. 9/11 ఉగ్రదాడులకు వ్యతిరేకంగా అమెరికా చేపట్టిన 'వార్ ఆఫ్ టెర్రర్'కు ప్రధాన రూపకర్తగా చెనీకి గుర్తింపు ఉంది. 2003లో ఇరాక్‌పై అమెరికా దాడులు చేయడంలోనూ చెనీదే కీలక పాత్ర. కాగా, అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై తీవ్ర విమర్శలు చేయడం ద్వారా డిక్ చెనీ మరోసారి వార్తల్లోకెక్కారు. దేశానికి ట్రంప్ అతిపెద్ద ముప్పు అని, ప్రజలు ఆయనను తిరస్కరించినా హింస ద్వారా అధికారంలో కొనసాగాలని చూశారని చెనీ ఆరోపించారు. దీంతో రిపబ్లికన్ పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు.

హిందూజా గ్రూప్ చైర్మన్ గోపీచంద్ కన్నుమూత



లండన్, అక్టోబరు 4: హిందూజా గ్రూపు చైర్మన్ గోపీచంద్ పి హిందూజా(85) మృతి చెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన లండన్‌లో చికిత్స పొందుతూ చనిపోయినట్లు గోపీచంద్ సన్నిహితులు తెలిపారు. వ్యాపార వర్గాల్లో జీపీగా పేరు గడించిన గోపీచంద్.. బ్రిటన్‌లోని అత్యంత సంపన్న కుటుంబానికి చెందినవారు. నలుగురు హిందూజా సోదరులలో రెండోవారైన గోపీచంద్ తన అన్న శ్రీచంద్ 2023లో చనిపోయిన తర్వాత హిందూజా గ్రూప్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 1959లో ముంబై లోని జైహింద్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ఆయన.. తర్వాత వ్యాపార రంగంలోకి ప్రవేశించారు. హిందూజా గ్రూపునకు చెందిన అశోక్ లేలాండ్ సంస్థ వాణిజ్య వాహనాల తయారీలో ప్రపంచంలోనే పేరుగాంచినది. గోపీచంద్ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సంతాపం ప్రకటించారు.

అగ్రవర్ణాల గుప్పిట్లో సైన్యం

» 10 శాతం ఉన్న వారే సైన్యాన్నీ నియంత్రిస్తున్నారు

» ఎన్నికల ప్రచారంలో రాహుల్ వివాదాస్పద వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, నవంబరు 4 : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరో వివాదానికి తెర తీశారు. బిహార్‌లోని ఔరంగాబాద్‌లో మంగళవారం ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. దేశ జనాభాలో 10% ఉన్నవారి(అగ్రవర్ణాలు) గుప్పిట్లో సైన్యం ఉందని వ్యాఖ్యానించారు. వారికే కార్పొరేట్ రంగం, బ్యూరోక్రసీ, న్యాయ వ్యవస్థలో అవకాశాలు దక్కుతున్నాయని, ఆఖరికి సైన్యాన్ని కూడా వారే నియంత్రిస్తున్నారని వ్యాఖ్యానించారు. జనాభాలో 90 శాతం ఉన్న వెనుకబడిన వర్గాలు, దళితులు, షెడ్యూలు తెగలు, మైనారిటీలు వీటిలో ఎక్కడా కనిపించరని చెప్పారు. కుల గణనతోనే ఈ వాస్తవాలు వెలుగులోకి వస్తాయని రాహుల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ తొలిసారిగా సైన్యాన్ని ఉద్దేశించి కుల ప్రస్తావన తెస్తూ వ్యాఖ్యలు చేశారు. అయితే గతంలోనూ సైన్యంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. గత ఆగస్టు నెలలో అరుణాచల్‌ప్రదేశ్‌లో మన సైనికులను చైనా సైనికులు తరిమేసి 2000 చదరపు కిమీ. భూభాగం ఆక్రమించారని వ్యాఖ్యానించి సుప్రీంకోర్టు నుంచి చీవాట్లు తిన్నారు. కాగా దేశ యువత రీల్స్ చేస్తూ కాలం గడిపేయాలని ప్రధాని మోదీ భావిస్తున్నారని బిహార్‌లోని ఔరంగాబాద్, గయాజిలలో నిర్వహించిన బహిరంగసభల్లో రాహుల్ వ్యాఖ్యానించారు. చదువు, ఉద్యోగాల గురించి యువత ప్రశ్నించకుండా వారు సోషల్ మీడియాలో మునిగిపోవాలని మోదీ కోరుకుంటున్నారన్నారు. మరో బహిరంగ సభలో మాట్లాడుతూ.. ప్రధానిది నకిలీ డిగ్రీ అని ఆరోపించారు.

రెండో దశలో 415 మంది నేరచరితులు

న్యూఢిల్లీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బిహార్ అసెంబ్లీ రెండో విడతలో పోటీ చేసేవారిలో 32% మంది నేరచరితులే. అభ్యర్థుల్లో 415 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. బిహార్ అసెంబ్లీకి రెండో దశలో 122 నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనుండగా అన్ని రాజకీయ పార్టీల నుంచి, స్వతంత్ర అభ్యర్థులు మొత్తం కలిపి 1,302 మంది పోటీ చేస్తున్నారు. వీరిలో 1,297 మంది సమర్పించిన అఫిడవిట్లను ఏడీఆర్ విశ్లేషించి ఒక నివేదికను రూపొందించింది. మంగళవారం, విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం.. అభ్యర్థులలో 341(26%) మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులున్నాయి. హత్య కేసులు 19 మందిపై, హత్యాయత్నం కేసులు 79 మందిపై, మహిళలపై దాడులకు సంబంధించి 52 మందిపై కేసులు ఉన్నాయని ఏడీఆర్ నివేదిక వెల్లడించింది.

మొదలైన 'సర్' 2.0.

నిరసనగా కోల్‌కతాలో రోడ్డెక్కిన మమత

ఈసీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న తమిళనాడు, బెంగాల్, కేరళ



సర్‌ను వ్యతిరేకిస్తూ కోల్‌కతాలో మమత నేతృత్వంలో భారీ నిరసన ప్రదర్శన

న్యూఢిల్లీ, నవంబరు 4: దేశంలోని తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో (యూటీలు) ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) రెండో విడత కార్యక్రమం మంగళవారం మొదలైంది. ఇందులోభాగంగా నెలరోజులపాటు దాదాపు 51 కోట్లమంది ఓటర్లకు ఎన్యుమరేషన్ ప్రక్రియను ఈసీ అధికారులు చేపడతారు. ఈ ప్రక్రియలో భాగం అవుతున్న రాష్ట్రాల్లో తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళల్లోని అధికార పార్టీలు 'సర్'ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దీంతో ఆ రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ వ్యతిరేకతల మధ్యనే ఈ ప్రక్రియను ఈసీ ప్రారంభించాల్సి వచ్చింది. 'సర్'ను వ్యతిరేకిస్తూ తమిళనాడులోని అధికార డీఎంకే పార్టీ సుప్రీంకోర్టును ఇప్పటికే ఆశ్రయించింది. డీఎంకే పిటిషన్ ఈ నెల 6 లేక 7 తేదీల్లో విచారణకు రానుంది. పశ్చిమ బెంగాల్‌లో 'సర్' ప్రక్రియపై టీఎంసీ అధినేత్రి, ఆ రాష్ట్ర సీఎం మమతాబెనర్జీ కోల్‌కతాలో రోడ్డెక్కారు. అర్హుడైన ఒక్క ఓటరు పేరును జాబితానుంచి తొలగించినా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని హెచ్చరించారు. దీనిని రాజకీయ ప్రేరేపిత సవరణ ప్రక్రియగా ఆమె దుయ్యబట్టారు. తన పార్టీ కార్యకర్తలతో కలిసి ఆమె మంగళవారం కోల్‌కతాలో 'సర్'కు వ్యతిరేకంగా భారీ నిరసన ప్రదర్శనను నిర్వహించారు. మైనారిటీలకు, వెనుకబడిన వర్గాలకు ఈ ప్రక్రియ వ్యతిరేకమైనదన్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలనే ఈసీ ఎంచుకోవడం వెనుక ఉద్దేశాన్ని ఆమె ప్రశ్నించారు. చివరిగా 2002లో బెంగాల్‌లో 'సర్' కార్యక్రమం నిర్వహించారు. అప్పట్లో రెండేళ్లపాటు ఈ ప్రక్రియను సాగించిన ఈసీ ఈసారి కేవలం నెలరోజులకే పరిమితం చేయడం ఏంటని నిలదీశారు.

విమాన టికెట్ల రద్దుకు చార్జీలుండవ్!

» బుకింగ్ చేసిన 48 గంటల్లోపు రద్దు చేసుకుంటే మొత్తం రీఫండ్?

న్యూఢిల్లీ, నవంబరు 4: విమాన ప్రయాణికులకు శుభవార్త..! విమాన టికెట్ల రద్దు విషయంలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని డీజీసీఏ తాజాగా ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేసింది. దీని ప్రకారం ప్రయాణికులు బుక్ చేసుకున్న 48 గంటల్లోపు తమ టికెట్లను రద్దు చేసుకోవచ్చు లేదంటే తమ ప్లాన్‌ను సవరించుకోవచ్చు. ఇందుకు ఎలాంటి అదనపు చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. దీనికోసం టికెట్ బుక్ చేసుకున్న 48 గంటలపాటు విమానయాన సంస్థలు 'లుక్ ఇన్ ఆప్షన్'ను అందించాల్సి ఉంటుంది. ఐదు లేదా అంతకంటే ఎక్కువ రోజులు ముందుగా బుక్ చేసుకున్న దేశీయ విమానాలు, 15 లేదా అంతకంటే ఎక్కువ రోజులు ముందుగా బుక్ చేసుకున్న అంతర్జాతీయ విమానాలకు ఈ నిబంధన వర్తిస్తుంది' అని డీజీసీఏ ముసాయిదా మార్గదర్శకాల్లో తెలిపింది. వీటికి ఆమోదం లభిస్తే అత్యవసర పరిస్థితుల్లో తమ ప్లాన్‌ను మార్చుకోవాలనుకునే లేదా టికెట్లను రద్దు చేసుకోవాలనుకునే ప్రయాణికులకు ప్రయోజనం కలగనుంది. రద్దు చేసుకున్న టికెట్ల డబ్బుని విమానయాన సంస్థలు నిర్ణీత గడువులోగా చెల్లించాలని డీజీసీఏ సూచించింది. దీని ప్రకారం క్రెడిట్ కార్డుతో చెల్లించిన వారికి 7రోజుల్లోగా రిఫండ్ చెల్లించాలి. కౌంటర్లలో నగదు చెల్లించి టికెట్లు కొనుగోలు చేసిన వారికి వెంటనే రిఫండ్ చెల్లించాలి. ట్రావెల్ ఏజెంట్ లేదా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా టికెట్ కొనుగోలు చేసిన వారికి 21 పని దినాల్లోగా చెల్లించాలి.

ప్రియుడిపై దాడి చేసి యువతిపై గ్యాంగ్ రేప్

» కోయంబత్తూరులో దారుణం.. ముగ్గురు నిందితుల అరెస్టు

» తప్పించుకోబోయిన దుండగుల కాళ్లపై పోలీసుల కాల్పులు

కోయంబత్తూరు, నవంబరు 4: ప్రేమికుడితో కలిసి కారులో ఉన్న ఓ యువతిపై ముగ్గురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ప్రియుడిపై దాడి చేసి ఆమెను ముళ్ల పొదల మాటుకు ఈడ్చుకెళ్లి అఘాయిత్యం చేశారు. తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగిన ఈ దారుణ ఘటనలో నిందితులను పోలీసులు ఒక్కరోజులోనే అరెస్టు చేశారు. పారిపోవడానికి ప్రయత్నించిన నిందితుల కాళ్లపై కాల్పులు జరిపి అదుపులోకి తీసుకున్నారు. కోయంబత్తూరుకు చెందిన 23 ఏళ్ల యువకుడు, డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 21 ఏళ్ల యువతి గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఆదివారం రాత్రి 11 గంటలకు కోయంబత్తూరు ఎయిర్‌పోర్ట్ వెనుకవైపునకు వీరిద్దరూ కారులో షికారుకు వెళ్లారు. మద్యం మత్తులో మోటారుసైకిల్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు.. కారు అద్దాన్ని పగులగొట్టి యువకుడిపై తీవ్రంగా దాడి చేశారు. అతను స్పృహ తప్పాక, ఆ యువతిని పక్కనే ఉన్న ముళ్లపొదల్లోకి ఈడ్చుకెళ్లి సామూహిక అత్యాచారం చేసి పారిపోయారు. సోమవారం ఉదయానికి స్పృహలోకి వచ్చిన ఆ యువకుడు మొబైల్ ఫోన్‌తో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు 5 గంటలపాటు గాలించగా.. ముళ్ల పొదల్లో స్పృహలేకుండా నగ్నంగా పడిఉన్న యువతిని గుర్తించారు. శరీరమంతా దాడికి గురైన గాయాలతో పాటు ముళ్లు గుచ్చుకుని రక్తమోడుతున్న ఆమెను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ముగ్గురు నిందితులను వెల్లకినార్‌లో అదుపులోకి తీసుకున్నారు. నిందితులను కురుప్పసామీ అలియాస్ సతీశ్ (30), అతని సోదరుడు కాళీశ్వరన్ అలియాస్ కార్తీక్ (21), వీరి దూరపు బంధువు గుణ అలియాస్ థవసి (20)గా గుర్తించామని పోలీసులు తెలిపారు.

రెండో పెళ్లిని రిజిస్టర్ చేసే ముందు మొదటి భార్య వాదన వినండి

» ముస్లిం వివాహాలపై కేరళ హైకోర్టు సూచన

కోచి, నవంబరు 4: ముస్లిం పురుషులు మొదటి భార్య ఉండగానే రెండో వివాహం చేసుకోవాలని భావించినప్పుడు అనుసరించాల్సిన విధానంపై కేరళ హైకోర్టు స్పష్టత ఇచ్చింది. రెండో వివాహాన్ని రిజిస్టర్ చేయడానికి ముందు మొదటి భార్య వాదనను తప్పకుండా వినాలని సూచించింది. మొదటి భార్యతో వివాహ బంధాన్ని కొనసాగిస్తుంటే ఆమె అభిప్రాయాన్ని తప్పకుండా తెలుసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. మొదటి భార్య బతికి ఉండగా ఆమెకు తెలియకుండా వేరే మహిళతో సంబంధం పెట్టుకోవడాన్ని ఖురాన్‌గానీ, ముస్లిం చట్టాలుగానీ అనుమతిస్తాయని అనుకోవడం లేదని న్యాయమూర్తి జస్టిస్ పి.వి.కున్హికృష్ణన్ అన్నారు. ముస్లిం పర్సనల్ చట్టం ప్రకారం పురుషుడు రెండో వివాహాన్ని చేసుకోవచ్చని, దాన్ని రిజిస్టర్ చేసుకోవాలంటే మాత్రం రాజ్యాంగపర చట్టాలను అనుసరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుత కేసులో ఓ వివాహితుడు మరో మహిళను పెళ్లి చేసుకున్నాడు. రెండో వివాహాన్ని రిజిస్టర్ చేయాలని స్థానిక అధికారులను కోరగా, మొదటి భార్య సమ్మతిలేదంటూ ఆ వినతిని తిరస్కరించారు.



యూసుఫ్‌గూడలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి; చిత్రంలో మంత్రులు పొన్నం, అజారుద్దీన్ తదితరులు

సెక్యులర్ ఓట్లను చీల్చి బీజేపీని బలపరచడమే బీఆర్ఎస్ పని

» మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సెక్యులర్ ఓట్లను చీల్చడం ద్వారా బీజేపీ ఎదుగుదలకు బీఆర్ఎస్ పాటుపడుతోందని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా కాంగ్రెస్ ఒక్కటే సెక్యులర్ పార్టీ అని, తెలంగాణలోనూ, దేశంలోనూ బీజేపీని ఓడించేది కాంగ్రెస్ మాత్రమేనని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా మంగళవారం యూసుఫ్‌గూడలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా జరిగిన మైనార్టీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం పార్టీలాగే అవకాశవాద విధానాలు బీఆర్ఎస్ అనుసరిస్తోందని విమర్శించారు. ఎక్కడైతే ప్రాంతీయ పార్టీలు బలపడతాయో అక్కడ కాంగ్రెస్ బలహీనపడి, బీజేపీ బలపడే అవకాశముందన్నారు. రాష్ట్రంలో 80శాతానికి పైగా మైనార్టీ విద్యాసంస్థలు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే మూతపడ్డాయన్నారు. ప్రజాప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడుతోందని, ఏటా రూ.4 వేల కోట్ల బడ్జెట్‌ను మైనార్టీల అభివృద్ధికోసం కేటాయించామని చెప్పారు. ఉప ఎన్నికలో మైనార్టీ ఓటర్లు నవీన్‌యాదవ్‌ను బలపరచాలని కోరారు. కాంగ్రెస్‌కు పడే ప్రతీ ఓటు లౌకిక భారత భావజాలానికి సమర్థన అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ అలీ షబ్బీర్, ఎంపీలు కడియం కావ్య, అనిల్‌కుమార్ మాజీ ఎమ్మెల్యే సంపత్ తదితరులు పాల్గొన్నారు.



యూసుఫ్‌గూడలో ప్రచారం చేస్తున్న భట్టి; చిత్రంలో మంత్రి పొన్నం, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

» గత పాలకులు పట్టించుకోలేదు: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి జరుగుతుందని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఆయన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి యూసుఫ్‌గూడలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కార్యాలయానికి చేరుకున్నారు ఎన్నికల ప్రచారంలో భాగంగా యూసుఫ్‌గూడ, మధురానగర్‌లో పర్యటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గత పాలకుల హయాంలో పేదల బస్తీల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ప్రచారంలో షబ్బీర్ అలీ, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుమ్మక్కయ్యారు

(మొదటిపేజీ తరువాయి)

అనుమతి అడిగితే రెండు నెలల నుంచి గవర్నర్ వద్ద ఫైల్ ఆగిపోయిందని ప్రస్తావించారు. కేటీఆర్‌ను అరెస్టు చేసేందుకు ఎందుకు అనుమతివ్వడం లేదని ప్రశ్నించారు. "మీ గూడుపుఠాణీ ఏంది? ఈ ఎన్నికల్లో మీరు ఆత్మహత్య చేసుకొని బీఆర్ఎస్‌ను గెలిపించాలని కుట్ర చేస్తలేరా? ఎందుకంటే రేపు బీఆర్ఎస్ బీజేపీలో విలీనమవుతుంది. ఇదీ నేను చెప్పలేదు. కేటీఆర్ సొంత చెల్లెలుచెప్పింది. విలీనానికి తాను ఒప్పుకోలేదు కాబట్టే పార్టీలో నుంచి బయటకు వెళ్లగొట్టారని చెబుతోంది. కారు స్టీరింగ్ మోదీ చేతిలో ఉంది" అని ముఖ్యమంత్రి అన్నారు. మంగళవారం రాత్రి ఆయన జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌తో కలిసి రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ నుంచి రోడ్డు షో నిర్వహించారు. శ్రీరామ్‌నగర్ క్రాస్ రోడ్డు కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించారు. "గతంలో రాష్ట్రంలో పర్యటనకు వచ్చినపుడల్లా మోదీ, అమిత్ షాలు కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్‌కు ఏటీఎంగా మారిందని, లక్షల కోట్లు కొల్లగొట్టారని చెప్పారు. కాళేశ్వరం కట్టడం, కూలడం మూడేళ్లలో జరిగిపోయింది. లక్ష కోట్లు గోదావరిలో కలిసిపోయాయి. దాని మీద వేసిన జ్యుడిషియల్ కమిషన్ కేసీఆర్, హరీశ్‌లు దోషులని, వారిపై చర్యలు తీసుకోవాలని నివేదికిస్తే ఆ విషయాన్ని అసెంబ్లీలో చర్చించి సీబీఐకి కేసు అప్పగించాం. సెప్టెంబరు ఒకటిన కేసును కేంద్రం చేతిలో పెట్టాం. అంతకుముందు కిషన్‌రెడ్డి కాళేశ్వరం కేసు మాకివ్వండి, సీబీఐకి అప్పగిస్తే 48 గంటల్లో తండ్రీకొడుకులను చంచల్‌గూడ జైలుకు పంపిస్తామన్నారు. సీబీఐకి ఇచ్చిన తర్వాత ఎందుకు అరెస్టు చేయట్లేదు?" అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

సాంప్రదాయన్ని తుంగలో తొక్కిందే బీఆర్ఎస్

ఎవ్వరైనా ఎమ్మెల్యే చనిపోతే ఆ కుటుంబానికి ఏకగ్రీవం ఇచ్చే సంప్రదాయన్ని తుంగలో తొక్కి ఉప ఎన్నిక తీసుకొచ్చిందే బీఆర్ఎస్ అని రేవంత్‌రెడ్డి అన్నారు. "పాలేరులో రాంరెడ్డి వెంకటరెడ్డి, నారాయణ్‌ఖేడ్‌లోకృష్ణారెడ్డి చనిపోయినపుడు వాళ్ల కుటుంబ సభ్యులకు టికెట్ ఇస్తే కేసీఆర్ వారికి వ్యతిరేకంగా అభ్యర్థులను నిలిపి ఓడించలేదా? తండ్రీ కొడుకులను అడుగుతున్నా? నాడు మీకో నీతి, ఈనాడు మాకో నీతా?" అని ప్రశ్నించారు. "మీ జాతికి నీతి ఉందా? ఉంటే ఆనాడు పీజేఆర్ మీద పోటీ పెట్టి



రహమత్‌నగర్ డివిజన్ రోడ్డు షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి

న్నందుకు ఎస్పీహిల్స్ కాలనీలో ముక్కు నేలకు రాయాలి. ఇక్కడి ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాత ఓట్లు అడగాలి" అన్నారు. పీజేఆర్ కుటుంబాన్ని ఏకగ్రీవం చేసేందుకు ఆనాడు చంద్రబాబు ప్రయత్నిస్తే కేసీఆర్ పోటీ పెట్టారని చెప్పారు. ఆడబిడ్డను ఆదుకోండి. కన్నీటిని తుడవాలని చెబుతున్న కేటీఆర్ తండ్రి ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని సొంత చెల్లెల్ని ఇంట్లో నుంచి గెంటేశాడన్నారు. నీచుడు, దుర్మార్గుడు, లాలూచీ ఉన్నోడు ఎవ్వడైనా ఉన్నడంటే తనేనన్నారు. "తెలంగాణను తండ్రి దోచుకున్న ఆస్తిలో చారానా వాటా సొంత చెల్లెలుకు ఇస్తే తిడుతుండా? ఇయనే మహిళా సెంటిమెంట్ గురించి మాట్లాడుతున్నారు" అని దుయ్యబట్టారు. "ఇంట్లో ఆడబిడ్డను చూసుకోలేదు. రాష్ట్రంలో రెండు కోట్ల మంది ఆడబిడ్డలు సంతోషంగా ఉంటే ఓర్వలేరు" అని వ్యాఖ్యానించారు. పదేళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఉచిత బస్సు ప్రయాణం ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. తెలంగాణ ఆడబిడ్డలు గజ్వేల్‌లో ఫామ్‌హౌస్ అడిగారా? జన్వాడలో రెండు ఎకరాలు అడిగారా? పేదలకు పదేళ్లలో రేషన్‌కార్డు ఎందుకు ఇవ్వలేదు? సన్నబియ్యం, ఉచిత కరెంటు, ఉచిత బస్సు రద్దు చేయనికి బీఆర్ఎస్‌ను గెలిపించాలా? అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

ఆ చెత్తనా కొడుకే పదేళ్లు మున్సిపల్ మంత్రి

కేటీఆర్ గల్లీలకు వచ్చి ఇక్కడ చెత్త ఏంది? మట్టి ఏందీ అంటున్నారని, ఆ చెత్తనా కొడుకే పదేళ్లు మున్సిపల్ మంత్రిగా ఉన్నారని ముఖ్యమంత్రి ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ సర్వ దరిద్రాలకు, సర్వ రోగాలకు వాడే కారణం కాదా? అని ప్రశ్నించారు. కేటీఆర్‌ను మున్సిపల్ చెత్తకుండీ దగ్గర ఒక రోజంతా కట్టేస్తే తెలుస్తుందని అన్నారు. "బలిసి బెంజి కార్లలో తిరిగిండు, కారు షెడ్డుకు పోగానే బిల్లా, రంగాలు ఆటోలో గల్లీలు తిరిగి ఏ ఇల్లు కొల్లగొడదామా? అని చూస్తున్నారు" అని వ్యాఖ్యానించారు. పదేళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, మున్సిపల్ మంత్రిగా కేటీఆర్ హైదరాబాద్‌కు ఏం తెచ్చారో చెప్పాలని అడిగారు. "శిల్పారామం కాంగ్రెస్ హయాంలో కట్టిస్తే ఈ సన్నాసి పోయి సెల్ఫీలు దిగుతుండు. హైటెక్ సిటీ మేము కడితే ఇదీ చూడు ధ్రంటూ బొమ్మలు దిగుతుండు. బొమ్మలు దిగనికి ఉన్నవా? పదేళ్ల మంత్రిగా ఏమీ తేకుండా గాడిద పళ్లు తోమినవా? మేం హైటెక్ సిటీ కడితే, ఔటర్ రింగ్ రోడ్డు వేస్తే, మెట్రో రైలు తీసుకొస్తే, అంతర్జాతీయ విమానాశ్రయం కడితే, ఐటీ, ఫార్మా కంపెనీలు తీసుకొస్తే కేసీఆర్, కేటీఆర్, హరీశ్ ఏం తెచ్చారు? జన్వాడలో వంద ఎకరాల్లో కేటీఆర్, గజ్వేల్‌లో వెయ్యి ఎకరాలో కేసీఆర్ ఫామ్‌హౌజ్ కట్టుకుండ్రు. మొయినాబాద్‌లో 50 ఎకరాల్లో హరీశ్‌రావు ఫామ్‌హౌజ్ కట్టుకుండు. కవిత శంకర్‌పల్లి దగ్గర ఫామ్‌హౌజ్‌లు కట్టుకున్నారు. ఇవన్నీ అబద్ధమని కేటీఆర్‌ను చెప్పమనండి.. ఎక్కడ్నుంచి వచ్చింది ఈ సొమ్ము? రబ్బరు చెప్పులు లేనోళ్లకు వందల ఎకరాల్లో ఫామ్‌హౌజ్‌లు ఎవ్వనయ్య జాగీరు? ఏడికెళ్లి సంపాదించిర్రు?" అని ప్రశ్నించారు.





జూబ్లీహిల్స్‌కు 4 వేల ఇందిరమ్మ ఇళ్లు

మంత్రి పొంగులేటి జిల్లాలో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని, ఎన్నికల తర్వాత ఒక్క జూబ్లీహిల్స్ నియోజక వర్గానికే 4000 ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించే బాధ్యత తనదని ముఖ్యమంత్రి ప్రకటించారు. నవీన్ యాదవ్ ఎమ్మెల్యేగా గెలవగానే మంత్రిని జూబ్లీహిల్స్‌కు తీసుకొచ్చి ఆయన సమక్షంలో బస్తీల్లో ఉండే పేదలకు ఇళ్లు ఇప్పిస్తానని చెప్పారు. డిసెంబరు 31 లోగా జూబ్లీహిల్స్ ఖబరాస్తాన్ సమస్యను పరిష్కరిస్తానన్నారు. జూబ్లీహిల్స్‌లో 30 వేల మెజార్టీతో గెలుస్తున్నామని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. మూడు సార్లు బీజేపీ ఎంపీని, మూడు సార్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గెలిపిస్తే సమస్యలు తీరలేదని, నవీన్‌యాదవ్‌ను గెలిపిస్తే జూబ్లీహిల్స్ ముఖ చిత్రం మారుస్తానని చెప్పారు. రోడ్డుషోలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.



మధురానగర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

ఓటమి భయంతోనే బీఆర్ఎస్ నకిలీ సర్వేలు

» ఉప ఎన్నికలో కాంగ్రెస్‌దే విజయం: మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి):ఓటమి భయంతోనే బీఆర్ఎస్ నకిలీ సర్వేలను ప్రచారంలోకి తెస్తోందని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా అబద్ధపు ప్రచారాలు ఎన్ని చేసినా జూబ్లీహిల్స్ ప్రజలు బీఆర్ఎస్ నేతలను నమ్మరని చెప్పారు. కల్లబొల్లి మాటలు ఇంకెన్నాళ్లు చెబుతారని నిలదీశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన మధురానగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 80 శాతం మంది ప్రజలు రోజూ కష్టపడితే తప్ప జీవనం కొనసాగించలేని పరిస్థితి ఉందన్నారు. మూడు పర్యాయాలు బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇచ్చినా.. అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఈ ఎన్నికలో ప్రజలు చాలా స్పష్టంగా ఉన్నారని, కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నమ్ముతున్నారని పేర్కొన్నారు. రేషన్ కార్డులు ఇచ్చి, పేదలకు సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని, ఈ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. ఈ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజార్టీ పొందుతారని ఆయన అన్నారు.

బూత్ స్థాయి వరకూ కార్యకర్తలను కదిలిద్దాం!

» కాంగ్రెస్ కోఆర్డినేషన్ కమిటీ నిర్ణయం

హైదరాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నిక బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా.. బూత్ స్థాయి వరకు పార్టీ కార్యకర్తలను కదిలించాలని జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ కో ఆర్డినేషన్ కమిటీ నిర్ణయించింది. చైర్మన్ గద్వాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం గాంధీభవన్లో కమిటీ భేటీ అయింది. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో ఇన్‌చార్జులు, నాయకులను సమన్వయం చేసుకుని పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని సంకల్పం తీసుకుందామన్నారు. కమిటీ కో చైర్మన్ ఈరవత్రి అనిల్ మాట్లాడుతూ ఒక్కొక్కరు ఒక్కో డివిజన్లో చురుకుగా పని చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ అనుకూల మీడియాలో నకిలీ సర్వేలు.. తప్పుడు ఆరోపణల ప్రసారాన్ని అడ్డుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ కోరారు.

ఇది సర్కారా? రౌడీ దర్బారా?

హామీలు అమలు చేయాలంటే.. పథకాలు ఆపేస్తానని బెదిరిస్తారా?

» రీయింబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే విద్యా సంస్థలను భయపెడతారా?
» పదేళ్ల అభివృద్ధి, అరాచకానికి మధ్యే పోటీ
» హైడ్రా బుల్డోజర్‌ను అడ్డుకునేది కారు పార్టీ మాత్రమే: కేటీఆర్

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నడుస్తున్నది సర్కారా? లేక రౌడీ దర్బారా అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. హామీలు అమలు చేయాలని ప్రజలు అడిగితే పథకాలు ఆపేస్తామని బెదిరించడం ఏమిటని నిలదీశారు. "ఉద్యోగ నోటిఫికేషన్లు అడిగితే నిరుద్యోగులను.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వమంటే విద్యాసంస్థల నిర్వాహకులను, రిటైర్మెంట్ ప్రయోజనాలు కావాలన్న ఉద్యోగులను.. ఇలా అందరినీ బెదిరిస్తున్నారు. నువ్వు నడుపుతున్నది సర్కారా? రౌడీ దర్బారా రేవంత్?" అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్‌కు మద్దతుగా మంగళవారం సోమాజిగూడలో కేటీఆర్ రోడ్‌షో నిర్వహించారు. తల్లిదండ్రులను బాగా చూసుకోకుంటే జీతంలో కోత పెడతానంటున్న రేవంత్.. తల్లిదండ్రుల్లాంటి రిటైర్డ్ ఉద్యోగులకు ప్రయోజనాలు ఎందుకు ఇవ్వడం లేదని కేటీఆర్ నిలదీశారు. విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించని ఈ సర్కారు జూబ్లీహిల్స్‌ను అభివృద్ధి చేస్తుందంటే ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేళ్ల అభివృద్ధికి, కాంగ్రెస్ రెండేళ్ల అరాచకానికి మధ్య పోటీ ఇదని పేర్కొన్నారు. ఇవి ఆషామాషీ ఎన్నికలు కాదని, 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలు జూబ్లీహిల్స్ వైపు చూస్తున్నారని చెప్పారు. రైతుబంధు, దళితబంధు, మైనార్టీ బంధు, బీసీ బంధు.. ఇలా అన్ని పథకాలను రేవంత్‌రెడ్డి బంద్ చేశారని.. వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల అనంతరం ఉచిత తాగునీటి సరఫరా బంద్ అవుతుందని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ, రేవంత్ మాటలు నమ్మిన విద్యార్థులు ఊరూరా తిరిగి కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం చేశారని.. కానీ రెండేళ్లలోనే అదే విద్యార్థులు కాంగ్రెస్‌కు ఓటు వేయవద్దని ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఇళ్లు కూలగొట్టుడే ఇందిరమ్మ రాజ్యం అన్నట్టు పరిస్థితి మారిందని.. హైడ్రా భూతం పేదలను బయటికి గెంటివేసి ఇళ్లను కూలగొడుతోందని కేటీఆర్ ఆరోపించారు. హైడ్రా పేదలకేనా, పెద్దలకు వర్తించదా అని ప్రశ్నించారు. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో రేవంత్‌రెడ్డి అన్న ఇల్లు, గండిపేటలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి భవనాలు ఉన్నాయని.. వారి జోలికి వెళ్లని హైడ్రా పేదల ఉసురు మాత్రం తీస్తోందని మండిపడ్డారు. బుల్డోజర్‌ను అడ్డుకునేది కారు పార్టీ మాత్రమేనని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో ఓడిపోతమని రేవంత్‌రెడ్డికి అర్థమైందని, అందుకే దొంగ ఓట్లు వేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క ఇచ్చిన హామీలు, తర్వాత హైడ్రా కూల్చివేతలు, బాధితుల ఆవేదన వీడియోలను కేటీఆర్ ప్రదర్శించారు. కాగా, బస్సు ప్రమాద మృతులను టోయింగ్ వాహనంలో తరలించడాన్ని ప్రస్తావిస్తూ.. "పేద కుటుంబాల వారికి మరణంలోనూ కనీస గౌరవం దక్కకపోవడం బాధాకరం. మృతదేహాలను తరలించేందుకు ప్రభుత్వపరంగా వాహనాలు ఏర్పాటు చేయకపోవడం దుర్మార్గం. తోపుడు బండ్లు, ట్రాక్టర్లు, చెత్తవ్యాన్లు, టోయింగ్ వాహనాల్లో మృతదేహాలను తరలించాల్సిరావడం ఆవేదన కలిగిస్తోంది" అని కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు.



సోమాజిగూడలో జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతున్న కేటీఆర్



శ్రీనగర్ కాలనీలో ప్రచారం చేస్తున్న మంత్రి దుద్దిళ్ల

జూబ్లీహిల్స్‌లో ఊపందుకున్న కాంగ్రెస్ ప్రచారం

» ఎనిమిదేళ్లు రేవంత్ రెడ్డే సీఎం: మంత్రి కోమటిరెడ్డి
» నవీన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి: డిప్యూటీ సీఎం
» వెంగళరావునగర్‌లో కాంగ్రెస్.. ఎర్రగడ్డలో సీపీఐ ఇంటింటి ప్రచారం
» బీఆర్ఎస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దు: శ్రీధర్‌బాబు
» కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇళ్లు: మీనాక్షి, మంత్రి పొన్నం

యూసుఫ్‌గూడ/ వెంగళరావు నగర్/ బంజారాహిల్స్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ప్రచారం ఊపందుకుంటోంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సహా పలువురు మంత్రులు మంగళవారం ప్రచారం చేపట్టారు. రహ్మత్‌నగర్ డివిజన్‌లోని పీజేఆర్ టెంపుల్ వద్ద జరిగిన రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎనిమిదేళ్లపాటు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోనే ప్రజా ప్రభుత్వం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పేదల సంక్షేమానికి పని చేసే కాంగ్రెస్ పార్టీనే జూబ్లీహిల్స్ ప్రజలు ఆదరిస్తారన్నారు. పేరుకే జూబ్లీహిల్స్ అయినా ఇక్కడ పేదలే ఎక్కువగా నివసిస్తున్నారని చెప్పారు. ఫామ్ హౌస్ నుంచి బయటకు రాలేని కేసీఆర్ రెండేళ్లలో అధికారంలోకి వస్తారని కేటీఆర్ చెప్పడం అర్థరహితమని కోమటిరెడ్డి పేర్కొన్నారు. కమీషన్ల కోసమే ప్రాజెక్టులు కట్టి రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల పాల్జేశారని, ఎస్ఎల్‌బీసీ వంటి మిగతా ప్రాజెక్టులు ఎందుకు ఆగిపోయాయో ఆ పార్టీ నేతలే చెప్పాలని డిమాండ్ చేశారు. మధురానగర్ కాలనీలో పార్టీ సీనియర్ నేత దేవిరెడ్డి నాగార్జున రెడ్డి కార్యాలయంలో ముఖ్య నేతలతో సమావేశమైన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వెంగళరావు నగర్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేసిన రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను విశ్వనగరంగా, ట్రాఫిక్ రహిత రాజధానిగా మార్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఎర్రగడ్డ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని కాంక్షిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. యూసుఫ్‌గూడ డివిజన్ హైలం కాలనీ, వెంకటగిరి ప్రాంతాల్లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్.. ఇంటింటా ప్రచారం చేస్తూ.. ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేస్తూ స్థానిక అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఓటేయాలని కోరారు. మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు ఇందిరమ్మ ఇల్లు, ఆ ఇంటికి విద్యుత్ వెలుగులు వచ్చాయని చెప్పారు. శ్రీనగర్ కాలనీలోని జీహెచ్ఎంసీ పార్కులో వాకర్స్‌తో కలిసి రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రచారం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలను శ్రీధర్ బాబు కోరారు. ఈ ప్రచారంలో ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, బాలూ నాయక్, వేముల వీరేశం, రాందాస్ నాయక్, కూచుకుళ్ల రాజేశ్ రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు రాయల నాగేశ్వర రావు, అన్వేశ్ రెడ్డి, నాయుడు సత్యనారాయణ, దొండపాటి వెంకటేశ్వరరావు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీ హిల్స్ నుంచే మార్పు మొదలవ్వాలి

» పాలనలో బీఆర్ఎస్, కాంగ్రెస్ విఫలం
» బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు



హైదరాబాద్ సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ పాలించే అవకాశం పొందినా.. ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయనని, ఇప్పుడు ప్రజలు బీజేపీకి ఒక అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు కోరారు. రెండు పార్టీల పాలననూ ప్రజలు చూశారని, మార్పునకు సమయం వచ్చిందని, అది జూబ్లీ హిల్స్ నుంచి ప్రారంభం కావాలన్నారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఎర్రగడ్డ డివిజన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అప్పటి సీఎం చంద్రబాబు సహకారంతో హైదరాబాద్ అభివృద్ధికి పునాదులు వేసిందన్నారు. తరువాతి ప్రభుత్వాలు దాన్ని కొనసాగించినా, ప్రస్తుత ప్రభుత్వాలు ఆ క్రెడిట్ మొత్తం తమదేనని చెప్పుకోవడం తప్పని విమర్శించారు. ఎర్రగడ్డలో రెసిడెన్షియల్ కాలనీ మధ్యలో ప్రైవేటు శ్మశానం ఏర్పాటు చేయడం అవివేకమైన, అమానుష చర్య అని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇలాంటి పనులు చేయడం ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టడమే అవుతుందన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే.. వెళ్లి కాంగ్రెస్‌లో చేరుతారు

ఇప్పటికే పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారారు.. ఏ ముఖం పెట్టుకుని జూబ్లీహిల్స్‌లో ఓట్లు అడుగుతున్నారు?

» హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌కు ఓట్లడిగే హక్కు లేదు
» జూబ్లీహిల్స్ కాంగ్రెస్‌కు.. మేయర్ పదవి ఎంఐఎంకు... ఇదీ ఆ పార్టీల ఒప్పందం
» వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వమే
» దానికి జూబ్లీహిల్స్ ఎన్నికతోనే నాంది
» ప్రచారంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/ వెంగళరావునగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే వెళ్లి కాంగ్రెస్‌లో చేరుతారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెళ్లి కాంగ్రెస్‌లో చేరారని, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని కేసీఆర్ జూబ్లీహిల్స్‌లో ఓట్లు అడుగుతున్నారని మండిపడ్డారు. ఆ రెండు పార్టీల్లో ఎవరు గెలిచినా మజ్లిస్ చెప్పినట్టే నడుచుకుంటాయని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగరడం ఖాయమని, అందుకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయంతోనే నాంది అని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా మంగళవారం సాయంత్రం వెంగళరావునగర్ డివిజన్‌లో బైక్ ర్యాలీ, బోరబండలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. హైదరాబాద్ మేయర్ పదవిని మజ్లిస్‌కు ఇవ్వాలని కాంగ్రెస్‌తో ఒప్పందం చేసుకుందని, అందుకే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు మజ్లిస్ మద్దతు ఇస్తోందని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రాగానే మజ్లిస్ ఆగడాలను అరికడతామని పేర్కొన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు వందల కోట్లు కుమ్మరించి జూబ్లీహిల్స్‌లో గెలవాలనుకుంటున్నాయని ఆరోపించారు. హామీలు నేరవేర్చని కాంగ్రెస్‌కు జూబ్లీహిల్స్‌లో ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ప్రచారానికి వచ్చే ఆ పార్టీ నాయకులను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. కాగా, బోరబండ పోచమ్మ ఆలయంలో పూజలు చేసిన కిషన్‌రెడ్డి.. అనంతరం వినాయకరావు నగర్, బంజారానగర్, స్వరాజ్‌నగర్ బస్తీలలో ఇల్లిల్లూ తిరిగి బీజేపీ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఇప్పటివరకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలన చూశారని, ఈసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు.



వెంగళరావునగర్‌లో ప్రచారం చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఉప ఎన్నిక ఫలితం రాజకీయంగా కీలకం

రాష్ట్రంలో కాంట్రాక్టులు, రాజకీయ బేరసారాలే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాథమ్యాలుగా మారిపోయాయని బీజేపీ మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకత్వం అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ప్రలోభాలు, మాయమాటలతోనే నెట్టుకొస్తోందని విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం రాజకీయంగా కీలకంగా మారబోతోందన్నారు. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ గెలిస్తే రాజీనామా చేస్తారా? అని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ సవాలు విసిరారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి ఎందుకు ఇవ్వడం లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ ప్రశ్నించారు.

7 నుంచి 'వందేమాతరం' మహోత్సవాలు

ఈ నెల 7 నుంచి 25 వరకు'వందేమాతరం-150' మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీ కె.లక్ష్మణ్ తెలిపారు. 7న దేశవ్యాప్తంగా 150 ప్రముఖ స్థలాల్లో, 150 మంది గాయకుల ఆధ్వర్యంలో 'వందేమాతరం' గేయం ఆలపిస్తారని చెప్పారు. తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, గోల్కొండ, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల్లో కార్యక్రమం ఉంటుందన్నారు. మహోత్సవాల కోసం జార్ఖండ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్‌కు తనను ఇన్‌చార్జిగా నియమించారని చెప్పారు.

వైద్యశాఖలో పదోన్నతులు

» 36 మంది సివిల్ సర్జన్లకు పోస్టింగ్‌లు

» డీఎంహెచ్‌వోలుగా ఏడుగురి నియామకం

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో 36 మంది వైద్యులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. డిప్యూటీ సివిల్ సర్జన్/సివిల్ అసిస్టెంట్ సర్జన్ హోదాలో ఉన్న వీరికి.. సివిల్ సర్జన్లుగా ప్రమోషన్ ఇచ్చింది. వీరికి పోస్టింగులు ఇస్తూ వైద్యఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందినవారిలో ఏడుగురిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు (డీఎంహెచ్‌వోలు)గా, ఐదుగురిని జాయింట్ డైరెక్టర్లుగా నియమించారు. మిగిలిన వారికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో సివిల్ సర్జన్ ఆర్ఎంవో (రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్)లుగా పోస్టింగ్ ఇచ్చారు. డీఎంహెచ్‌వోలుగా నియమితులైన వారిలో ముదిలి వసంతరావు, కె.లలితాదేవి, బి.మల్లీశ్వరి, డి.రామారావు, డి.స్వర్ణకుమారి, రాథోడ్ తుకారాం, పి.వెంకటరమణ ఉన్నారు. జేడీలుగా బి.విజయనిర్మల, సి.హెచ్. అరుణ్‌కుమార్, కె.ఎస్.పద్మశ్రీ, వెంకటరమణ స్వామి, ప్రభు దయాకిరణ్ నియమితులయ్యారు. ఇదిలా ఉండగా.. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ సేవల విభాగంలో ముగ్గురు డిప్యూటీ డైరెక్టర్ల (అడ్మినిస్ట్రేషన్)కు జేడీ(అడ్మినిస్ట్రేషన్)లుగా పదోన్నతి లభించింది. వీరిలో ఎన్.కృష్ణవేణి, శ్వేతా ముంగా, బి.మంజునాథ్ నాయక్ ఉన్నారు.

పులుల లెక్కింపులో వలంటీర్లకు అవకాశం

» వన్యప్రాణుల సంరక్షణ అధికారి ఈలు సింగ్ వెల్లడి

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అటవీ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో నిర్వహించే 'అఖిల భారత పులుల లెక్కింపు-2026' కార్యక్రమంలో ఆసక్తి గల వలంటీర్లు పాల్గొనవచ్చని వన్యప్రాణుల సంరక్షణ అధికారి ఈలు సింగ్ మేరు వెల్లడించారు. వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(డెహ్రాడూన్), నేషనల్ టైగర్ కన్సర్వేషన్ అథారిటీ సంయుక్తంగా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయి. తెలంగాణలో సుమారు 26 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో పులుల సమాచారాన్ని సేకరించనున్నారు. కాగా, పులుల లెక్కింపులో పాల్గొనాలనుకునే వలంటీర్లకు 18-60 సంవత్సరాల వయస్సు ఉండాలి. రోజుకు 10-12 కి.మీ అడవుల్లో నడిచే సామర్థ్యంతో పాటు తక్కువ సౌకర్యాలతో దూరప్రాంత క్యాంపుల్లో ఉండగలగాలి. వారికి ఎటువంటి పారితోషికం చెల్లించరు. అయితే, వసతి, రవాణా సదుపాయాలను కల్పిస్తారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 22 వరకు అటవీ శాఖ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంది.

పేపర్ లీకేజీతో సంబంధం లేదు

» కేసు కొట్టివేయండి.. హైకోర్టుకు బండి సంజయ్ వినతి

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కమలాపూర్‌లో జరిగిన పదో తరగతి పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో అక్రమంగా తనపై పెట్టిన కేసు కొట్టివేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ హైకోర్టును కోరారు. ఈ విషయమై ఆయన పెట్టుకున్న క్వాష్ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ జరిపింది. సంజయ్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. పరీక్ష ప్రారంభమైన చాలా సమయం అయిన తర్వాత పేపర్ లీకయినట్టు ఆరోపణలు వచ్చాయని, ఆ సమయంలో ఆయన ఘటనా స్థలంలో లేరని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను వచ్చేవారానికి వాయిదా వేసింది.

మంత్రి శ్రీధర్ బాబు నిర్దోషి

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకున్నారంటూ 2017లో ప్రస్తుత మంత్రి శ్రీధర్‌బాబు, మరో 300 మందిపై నమోదైన కేసు కొట్టివేయాలని కోరుతూ దాఖలైన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ ముగించింది. ఈ కేసులో శ్రీధర్‌బాబును ట్రయల్ కోర్టు నిర్దోషిగా ప్రకటించడంతో ఈ నిర్ణయం తీసుకొంది.

రూ.3.81 కోట్ల మోసం కేసులో ఈడీ చార్జిషీట్

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)ను రూ.3.81 కోట్లు మోసం చేసిన కేసు దర్యాప్తులో భాగంగా పృథ్వీ సోలార్ పవర్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ ఎండీ శ్రీనివాస రాజుపై ఈడీ చార్జిషీట్ దాఖలు చేసింది. బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈడీ హైదరాబాద్ జోనల్ అధికారులు ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ (పీఎంఎల్‌ఏ) 2002 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. దర్యాప్తులో భాగంగా హైదరాబాద్‌లోని పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టులో తాజాగా చార్జిషీట్ (ప్రాసిక్యూషన్ కంప్లైంట్) దాఖలు చేసినట్లు ఈడీ వర్గాలు తెలిపాయి.

ఎకరానికి 25 క్వింటాళ్ల మక్కల కొనుగోళ్లు

» సేకరణ పరిమితి పెంచాలి.. మార్క్‌ఫెడ్‌కు తుమ్మల ఆదేశం

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎకరానికి 25 క్వింటాళ్ల చొప్పున మక్కలు సేకరించాలని మార్క్‌ఫెడ్ అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఇప్పటివరకు ఎకరానికి 18.5 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేస్తుండగా.. వ్యవసాయశాఖ అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు మక్కల సేకరణ పరిమితిని పెంచినట్లు ఆయన తెలిపారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేకపోయినా.. రైతులకు కనీస మద్దతు ధర చెల్లించాలనే ఉద్దేశంతో రూ. 2,500 కోట్లు కేటాయించామని తుమ్మల తెలిపారు. కాగా, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేస్తున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు. జిన్నింగ్ మిల్లుల్లో నెలకొన్న సమస్యలపై సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తాతో ఆయన మంగళవారం ఫోన్లో మాట్లాడారు. మరోవైపు.. రైతులు వరి, పత్తి పంటలకు బదులుగా పామాయిల్ సాగు చేపట్టాలని తుమ్మల సూచించారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వివిధ జిల్లాలకు చెందిన రైతులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల రైతులకు మంత్రి తుమ్మల భూసార పరీక్ష పత్రాలు పంపిణీ చేశారు.

రూ.1000 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1000 కోట్ల అప్పు తీసుకున్నది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళవారం నిర్వహించిన ఈ-వేలం ద్వారా రుణాన్ని సేకరించింది. 7.45 శాతం వార్షిక వడ్డీ, 32 ఏళ్ల కాల పరిమితితో ఈ రుణాన్ని తీసుకున్నది. రాష్ట్రంతో కలిపి దేశంలోని ఏడు రాష్ట్రాలు రూ.11,600 కోట్ల మేర అప్పులు తీసుకున్నాయి.

1,037 మంది ఔట్‌సోర్సింగ్ పీఎస్‌ల కొనసాగింపు

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో 1,037 మంది ఔట్‌సోర్సింగ్ పంచాయతీ సెక్రటరీలను కొనసాగించడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈమేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. 01.04.2025 నుంచి 31.03.2026 వరకు ఏడాది పాటు విధుల్లో కొనసాగవచ్చని తెలిపింది.

ప్రజాసేవకు దక్కిన గౌరవం

» విశిష్ట ఫెలోషిప్ అవార్డు స్వీకరించిన భువనేశ్వరి

» హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ హోదాలో గోల్డెన్ పీకాక్ అవార్డు కూడా..

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి 2 ప్రతిష్ఠాత్మక అవార్డులు స్వీకరించారు. లండన్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్(ఐవోడీ) సంస్థ నుంచి ఈ అవార్డులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి చంద్రబాబు కూడా హాజరయ్యారు. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ హోదాలో డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్-2025 అవార్డును భువనేశ్వరి స్వీకరించారు. ప్రజా సేవ, సామాజిక ప్రభావం అంశాల్లో విశిష్ట సేవలు అందించినందుకుగాను ప్రతిష్ఠాత్మక ఐవోడీ ఈ అవార్డు అందజేసింది. హెరిటేజ్ ఫుడ్స్‌కు ఎక్స్‌లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో గోల్డెన్ పీకాక్ అవార్డును ప్రకటించగా.. హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ హోదాలో ఈ అవార్డును కూడా ఆమె స్వీకరించారు. జాతీయస్థాయిలో ఎఫ్ఎంసీజీ విభాగంలో హెరిటేజ్ ఫుడ్స్‌ను ఎక్స్‌లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారు.

ఎస్ఎల్‌బీసీ సొరంగానికి..

టైగర్ రిజర్వ్ అడ్డంకి లేనట్టే!

(మొదటి పేజీ తరువాయి)

హెలీబార్న్ ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ విధానం ద్వారా మినరల్స్, షీర్ జోన్స్, వాటర్ బాడీస్ ఎక్కడున్నాయో తెలుసుకోవడానికి సర్వే చేపట్టింది. సోమవారం నాగర్‌కర్నూలు జిల్లా మన్నెవారిపల్లి ఔట్‌లెట్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి సర్వేను పరిశీలించారు. సర్వే నివేదిక అందిన తర్వాత ప్రభుత్వం ఏ విధంగా టన్నెల్ నిర్మాణాన్ని కొనసాగిస్తుంది? అనే ఆసక్తి అందరిలో కలుగుతోంది. ఎందుకంటే.. ఆ ప్రాంతంలో టైగర్ రిజర్వ్ ఉండటం, గత టీబీఎం విధానంలో ఇన్‌లెట్ అండ్ ఔట్‌లెట్ మాత్రమే ఉండి ఆడిట్‌లు లేకపోవడంతో డీబీఎం పద్ధతిలో చేస్తే కొన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి.

అవేంటంటే..

సాధారణంగా మైన్స్‌లో పేలుళ్లు జరిపినప్పుడు కనీసం 500 మీటర్ల వరకూ బ్లాస్టింగ్ వేవ్స్ ప్రసారం అవుతాయి. ఇది ఉపరితలంపై ఉన్న పర్యావరణానికి, జంతుజాలానికి ఇబ్బందులు కలిగించవచ్చు. అందునా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాంతం పూర్తిగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో ఉన్న నేపథ్యంలో.. ఎలాంటి పర్యావరణ ఇబ్బందులు లేకుండా టన్నెల్ పూర్తికి న్యూ ఆస్ట్రేయిన్ టన్నెలింగ్ మెథడ్ (ఎన్ఏటీఎం)ను ఉపయోగించాలని నిపుణులు చెబుతున్నారు. అయితే ఇందులో మకింగ్ తరలించడానికి ప్రస్తుతం ఉన్న కన్వేయర్ బెల్టు విధానాన్నే ఉపయోగిస్తారా? లేక ఒకటి రెండు చోట్ల ఆడిట్‌లు ఏర్పాటు చేస్తారా? అనే విషయంలో స్పష్టత రాలేదు. ఎన్ఏటీఎం పద్ధతిలో రెండు విధాలుగా మకింగ్ తరలించడానికి అవకాశం ఉంది. టన్నెల్ ప్రాంతంలో బ్లాస్టింగ్ పాత పద్ధతిలో కాకుండా కేవలం 4 మీటర్ల డయాలో వేవ్స్ వచ్చేలా బ్లాస్టింగ్ చేయడం ఒక పద్ధతి. ప్రస్తుతం ఉన్న టన్నెల్ చుట్టుకొలత 9.2 మీటర్లు కాగా.. డీబీఎం పద్ధతిలో గుర్రం డెక్క ఆకారంలో 10 మీటర్ల డయాలో చేపట్టనున్నారు. దీంతో.. అక్కడ బ్లాస్టింగ్ చేయడం వల్ల 400 మీటర్ల నుంచి 500 మీటర్ల పైన ఉన్న అటవీప్రాంతానికి, జంతుజాలానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని నిపుణులు అంటున్నారు. బ్లాస్టింగ్ తర్వాత మకింగ్ మొత్తం తీసివేసి వెంటనే స్టీల్ జాలీలను అమర్చి షాట్‌క్రీట్ వేసి, రాక్‌బోల్టులను అమర్చుతారు. బ్లాస్టింగ్‌కు సంబంధించి.. ఏప్రిల్‌లోనే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్‌తో కమిటీ ఏర్పాటు చేసి ప్రణాళికలు తీసుకుంటున్నారు. అలాగే.. టన్నెల్ వెళ్తున్న మార్గంలో షీర్ జోన్లు, జలవనరులు ఉన్నట్లు సర్వేలో తేలితే.. తవ్వకం సమయంలో అలాంటి సున్నిత ప్రదేశాలు వచ్చినప్పుడు అలైన్‌మెంట్‌ను క్రాస్ సెక్షన్ చేసుకొని టన్నెల్ పూర్తిచేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

సర్వే నివేదిక ముఖ్యం..

టన్నెల్ తవ్వకాన్ని పునఃప్రారంభించాలంటే ప్రస్తుతం చేపట్టిన హెలీబార్న్ ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ జియో ఫిజికల్ సర్వే నివేదిక చాలా ముఖ్యం. సర్వే సోమవారం ప్రారంభం కాగా వారం రోజుల్లో పూర్తి చేసి.. ఆ తర్వాత 15 రోజుల్లో 3డీ మ్యాపింగ్ నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్టు సమాచారం. సర్వేలో భాగంగా.. హెలికాప్టర్ ద్వారా 26 మీటర్ల డయా ఉండి 500 కేజీల బరువు ఉన్న మ్యాగ్నెటిక్ లూప్‌తో విద్యుదయస్కాంత తరంగాలను భూమిలోకి పంపిస్తున్నారు. లోపల ఉన్న మినరల్స్, వాటర్ బాడీస్, షీర్ జోన్స్ నుంచి వచ్చే ప్రతిస్పందన తరంగాలను రికార్డు చేసి నివేదిక రూపొందిస్తారు. మొత్తం టన్నెల్ పరిధిలోని 44 కిలోమీటర్ల పొడుగు, 500 మీటర్ల లోతు దాకా ఈ సర్వే ద్వారా మ్యాపింగ్ చేస్తారు. ఈ సర్వే ఆధారంగానే టన్నెల్ అలైన్‌మెంట్, తవ్వకం విధానాన్ని నిర్ణయించే అవకాశం ఉంటుంది.

3డీ మ్యాప్ రూపంలో సర్వే నివేదిక

ప్రస్తుతం చేస్తున్న హెలీబార్న్ ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ జియో ఫిజికల్ సర్వేను వారంలో పూర్తి చేసి.. ఆ తర్వాత 15 రోజుల్లోగా నివేదికను పూర్తిగా 3డీ మ్యాప్ రూపంలో అందజేస్తాం. భూమి లోపల 500 మీటర్ల వరకూ మినరల్స్, షీర్ జోన్స్, వాటర్ బాడీస్ ఏమున్నాయి అనే విషయం ఈ సర్వేలో వెల్లడవుతుంది. ఈ సర్వే వివరాలు చాలా కచ్చితత్వంతో ఉంటాయి.

- డాక్టర్ సత్యనారాయణ,
చీఫ్ సైంటిస్ట్, ఎన్‌జీఆర్ఐ



సీఎం రేవంత్‌ను కలిసి మంత్రి అజారుద్దీన్

అజారుద్దీన్‌కు మైనారిటీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖలు

శాఖలు కేటాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మహ్మద్ అజారుద్దీన్‌కు ప్రభుత్వం శాఖలు కేటాయించింది. రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖలను ఆయనకు కేటాయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఇప్పటివరకు మైనారిటీ సంక్షేమ శాఖ.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వద్ద, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ.. సీఎం రేవంత్‌రెడ్డి వద్ద ఉండేవి. అజారుద్దీన్ మంత్రిగా అక్టోబరు 31న ప్రమాణస్వీకారం చేసిన సంగతి తెలిసిందే.

రోడ్లపై గుంతలు ఉంటే ప్రమాదాలు జరగవు

వాహనాలు కూడా మెల్లగా వెళ్తాయి

ఎంత మంచిగుంటే.. ఎక్కువగా ప్రమాదాలు

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'రోడ్లపై గుంతలు ఉంటే ప్రమాదాలు జరగవు.. వాహనాలు కూడా మెల్లగా వెళతాయి.. కానీ, రోడ్లు ఎంత మంచిగా ఉంటే అంత ఎక్కువగా ప్రమాదాలు జరుగుతాయి' అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా చేసిన జాప్యం వల్లే హైదరాబాద్-బీజాపూర్ రహదారి విస్తరణ ఆలస్యమైందని ఆరోపించారు. బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం నాటి బస్సు ప్రమాదానికి బీఆర్ఎస్సే కారణమని ధ్వజమెత్తారు. 2016లోనే హైదరాబాద్-చేవెళ్ల- బీజాపూర్ జాతీయ రహదారిని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, కానీ.. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం భూసేకరణ చేయలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకుల రియల్ ఎస్టేట్ దాహానికి సామాన్యులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేవెళ్ల ప్రాంతంలో ఒక ఎంపీ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని పేర్కొన్నారు.

అందరూ కలిసి నన్ను ఫూల్‌ని చేస్తున్నారు!

» అదనపు కలెక్టర్ల వ్యవస్థను రద్దు చేస్తే సరిపోద్ది

» రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్

» 22ఏ జాబితాల తయారీలో సిబ్బంది నిర్లక్ష్యంపై తీవ్ర అసహనం

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలోని నిషేధిత భూముల జాబితా (22ఏ) తయారీలో అదనపు కలెక్టర్ల నిర్లక్ష్య వైఖరిపై రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అందరూ కలిసి తనని ఫూల్‌ను చేస్తున్నారని, అదనపు కలెక్టర్ల వ్యవస్థ రద్దు చేస్తే సరిపోతుంది అంటూ ఆయన వ్యాఖ్యలు చేశారని రెవెన్యూ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. 22ఏ భూముల జాబితా సమగ్రంగా లేదని గుర్తించిన లోకేష్ కుమార్.. ఆ అంశంపై అదనపు కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.." మీరంతా నన్ను ఫూల్‌ని చేస్తున్నారు. చెప్పింది వినడం లేదు. మీరు ఇలా చేస్తే రెవెన్యూ ముఖ్య కార్యదర్శిగా నేను ఫెయిల్యూర్ అయినట్టే. మిమ్మల్ని నమ్మి పబ్లిక్ డొమైన్‌లో ఆ జాబితా పెట్టి ఉంటే పరువు పోయేది" అంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారని సమాచారం. రంగారెడ్డి వంటి కీలకమైన జిల్లాలో కనీసం జాబితాల పరిశీలన చేయకుండా, క్షేత్రస్థాయి వాస్తవాలతో సంబంధం లేకుండా, 600 గ్రామాలు ఉంటే అరకొరగా జాబితాలు ఇచ్చి అన్ని పూర్తి చేశామని చెప్పడంపై మండిపడ్డారని తెలిసింది. కామారెడ్డి, ఆదిలాబాద్, వికారాబాద్ జిల్లాలతోపాటు సుమారు 10 జిల్లాల్లో 22ఏ జాబితాలను సక్రమంగా తయారు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం. ఇక, సీసీఎల్ఏ ఇచ్చిన సాఫ్ట్‌వేర్‌లోని లోపాలను అవకాశంగా చేసుకొని కొందరు అధికారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండానే 22ఏ జాబితాలను అప్‌లోడ్ చేసిన, ఒక గ్రామానికి సంబంధించిన వివరాలు అప్‌లోడ్ చేసి మొత్తం అన్ని గ్రామాల వివరాలు ఇచ్చినట్లు చూపిన అధికారులను.. ఇదేం పద్ధతి.. అంటూ మందలించారని చెబుతున్నారు. ఓ దశలో అదనపు కలెక్టర్ల వ్యవస్థను రద్దు చేయాలని, అలా చేస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారని తెలిసింది. కోర్టు తీర్పుల తర్వాత గతంలో 22ఏ నుంచి తొలగించిన భూములను మళ్లీ 22ఏ జాబితాలో ఉన్నట్లు చూపడం వంటి వాటిని లోకేష్ కుమార్ తీవ్రంగా పరిగణించినట్టు చెబుతున్నారు. అయితే, గతంలో కలెక్టర్లు 22ఏ నుంచి మినహాయింపులు ఇచ్చిన భూములను ముట్టుకోవద్దని చెప్పినా పట్టించుకోకుండా ఆర్డీవోలు, తహసీల్దార్లు తమ ఇష్ట ప్రకారం జాబితాలు పంపడం వల్లే పరిస్థితి గందరగోళంగా తయారైందని అదనపు కలెక్టర్లు వివరించినట్లు తెలిసింది.

'సిగాచి' మృతులకు రూ.కోటి ఇచ్చారా?

ప్రమాద ఘటన బాధ్యులను అరెస్టు చేయలేదేం?.. రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

» నిపుణుల నివేదికపై 2 వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయండి: హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో మృతిచెందిన, గాయపడిన బాధితుల కుటుంబాలకు పరిశ్రమ యాజమాన్యం తరఫున ఇస్తామన్న రూ.కోటి పరిహారం ఇచ్చారా? బాధితులకు ఇప్పటివరకు ఎంత పరిహారం అందజేశారు? ప్రస్తుతం పరిశ్రమ ఎవరి అధీనంలో ఉంది? అని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అలాగే నిపుణుల కమిటీ చేసిన సిఫారసులపై అఫిడవిట్ సమర్పించాలని ఆదేశించింది. ప్రమాదానికి కారకులైన యాజమాన్య ప్రతినిధులను ఇంతవరకు అరెస్టు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో మృతులకు న్యాయం చేయడంతోపాటు దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదిస్తూ.. ఘటన జరిగి 4 నెలలు పూర్తి కావస్తున్నా దర్యాప్తు మందకొడిగా కొనసాగుతోందని తెలిపారు. పరిహారం సైతం పూర్తిగా అందలేదని, ఈ కేసులో ఇప్పటివరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ రజినీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. దర్యాప్తు కొనసాగుతోందని, పోలీసులు 192 మంది సాక్షులను విచారించారని చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.25-40 లక్షల వరకు పరిహారం అందజేసినట్టు వివరించారు. గత వారమే నిపుణుల కమిటీ నివేదిక సమర్పించిందని.. అది ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు. ప్రమాదంలో పరిశ్రమ ఉపాధ్యక్షుడు కూడా మృత్యువాత పడ్డారన్నారు. నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా ఏయే చర్యలు తీసుకోవాలన్నదానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. విచారణను రెండు వారాలపాటు వాయిదా వేయాలని కోరారు. ఆలోగా ప్రభుత్వ నిర్ణయంతోపాటు నిపుణుల కమిటీ నివేదికను కోర్టుకు సమర్పిస్తామని తెలిపారు. ప్రస్తుతం పరిశ్రమ ఎవరి అధీనంలో ఉందని సీజే ప్రశ్నించగా.. రాష్ట్ర పరిశ్రమల శాఖ అధీనంలో ఉందని ఏఏజీ చెప్పారు. కంపెనీ ప్రాంగణాలను కార్మిక శాఖ సీజ్ చేసిందన్నారు. రూ.కోటి పరిహారంపై సిగాచి యాజమాన్యమే స్పందించాల్సి ఉందని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. నిపుణుల కమిటీ నివేదికపై అఫిడవిట్ సమర్పించడానికి ప్రభుత్వానికి రెండు వారాల గడువు ఇచ్చింది. ఆ అఫిడవిట్‌లో దర్యాప్తు పురోగతితో పాటు మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి ఇప్పటివరకు చెల్లించిన నష్ట పరిహారం వివరాలను వెల్లడించాలని ఆదేశించింది. తదుపరి విచారణను 27కు వాయిదా వేసింది.



రాయదుర్గంలో డ్యుయిష్ బోర్స్ జీసీసీ

వచ్చే రెండేళ్లలో వెయ్యి మందికి ఉద్యోగాలు

» జర్మనీ కాన్సుల్ జనరల్ బృందం

» మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ విజ్ఞప్తి

» ఫిన్‌టెక్ గ్లోబల్ కమాండ్ సెంటర్‌గా హైదరాబాద్: మంత్రి శ్రీధర్ బాబు



సీఎం రేవంత్‌రెడ్డితో జర్మనీ కాన్సుల్ జనరల్, కంపెనీ ప్రతినిధులు

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డ్యుయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా రాయదుర్గంలో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను మంగళవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్, కంపెనీ ప్రతినిధులతో కూడిన బృందం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసింది. డ్యుయిష్ బోర్స్ జీసీసీతో వచ్చే రెండేళ్లలో వెయ్యి మందికి ఉద్యోగాలు దక్కుతాయని జర్మనీ బృందం సీఎంకు వివరించింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ జీసీసీ కోసం హైదరాబాద్‌ను ఎంచుకున్న జర్మనీ బృందానికి ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని, అందుకు ప్రజా ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలిచి అన్ని రకాలుగా సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లో ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. తెలంగాణ విద్యార్థులకు జర్మన్ భాష నేర్పించాలని, ఇందుకోసం హైదరాబాద్‌లో జర్మనీ టీచర్లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ రంగాల్లో జర్మనీ కంపెనీలు పెట్టుబడులు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో డ్యుయిష్ బోర్స్ సీఐవో/సీవోవో డాక్టర్ క్రిస్టోఫ్ బోమ్, అమితదేశాయ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, హైదరాబాద్ ఫైనాన్షియల్ టెక్నాలజీ(ఫిన్‌టెక్)కి గ్లోబల్ కమాండ్ సెంటర్‌గా అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాయదుర్గంలో డ్యుయిష్ బోర్స్ జీసీసీని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు స్తంభంలా ఉన్న డ్యుయిష్ బోర్స్ హైదరాబాద్‌ను ఎంచుకోవడం అంతర్జాతీయ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రంలోని నైపుణ్యం కలిగిన మానవ వనరులపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. హైదరాబాద్‌ను ఇంక్యుబేషన్ హబ్‌గా మాత్రమే కాకుండా "గ్లోబల్ ఆవిష్కరణ పవర్ హౌస్"గా మార్చేందుకు ప్రత్యేక గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభిస్తామని వెల్లడించారు. మరోపక్క, కృత్రిమ మేధకు సంబంధించిన ఆవిష్కరణల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టడమే లక్ష్యంగా తెలంగాణ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేశామని మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం ప్రకటించారు. 2035 నాటికి ప్రపంచంలోని 20 అతి పెద్ద ఏఐ హబ్‌లలో తెలంగాణకు స్థానం కల్పించడమే ఈ హబ్ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.

సీఎంతో అమెజాన్ వెబ్ సర్వీస్ ప్రతినిధుల భేటీ

అమెజాన్ వెబ్ సర్వీస్ ప్రతినిధుల బృందం మంగళవారం సీఎం రేవంత్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయింది. తెలంగాణలో అమెజాన్ డేటా సెంటర్ పనులు, విస్తరణకు సంబంధించిన అంశాలను వారు ప్రస్తావించగా.. పెట్టుబడుల విషయంలో ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయం ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు. సమావేశంలో అమెజాన్ వెబ్ సర్వీస్ డేటా సెంటర్ గ్లోబల్ హెడ్ కెర్రీ పర్సన్, ఇన్ఫ్రా పబ్లిక్ పాలసీ డైరెక్టర్ విక్రమ్ శ్రీధరన్, అనురాగ్ కిల్నాని పాల్గొన్నారు.

క్యూబా రాయబారితో మంత్రి శ్రీధర్ బాబు భేటీ

ద్వైపాక్షిక సహకారం ద్వారా నైపుణ్యాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకొని ఉమ్మడి పురోగతి వైపు అడుగులు వేద్దామంటూ క్యూబాకు మంత్రి శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు సచివాలయంలో మంగళవారం తనను కలిసిన క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ మార్సన్ అగులేరా, ఫస్ట్ సెక్రటరీ మిక్కీ డియాజ్ పెరెజ్‌తో ఆయన మాట్లాడారు. తెలంగాణ-క్యూబా మధ్య సత్సంబంధాలను పెంపొందించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వారికి చెప్పారు. తెలంగాణతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని క్యూబా రాయబారి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

బనకచర్ల, ఆల్మట్టిపై సుప్రీంకు!

కేసులు వేసేందుకు తెలంగాణ సన్నద్ధం

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పోలవరం-బనకచర్ల అనుసంధానంతో పాటు కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపును అడ్డుకోవడానికి సుప్రీంకోర్టును ఆశ్రయించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఆల్మట్టి ప్రాజెక్టుపై ఇప్పటికే సుప్రీంకోర్టులో ఒక కేసు ఉంది. తాజాగా మరో ఇంటర్‌లొక్యూటరీ అప్లికేషన్(ఐఏ) వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆల్మట్టి డ్యాంలో 524.256 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేసేలా పనులను 2002 నాటికే కర్ణాటక సర్కారు నిర్మాణం పూర్తి చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో 519.06 మీటర్ల ఎత్తు మేరకే(129.72 టీఎంసీ) నీటిని నిల్వను పరిమితం చేసింది. ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంపు పనులు పూర్తి చేశామని, నీటి కేటాయింపులు చేయకపోతే ఆ పనులకు చేసిన వ్యయం వృథా అవుతుందని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఎదుట కర్ణాటక ప్రభుత్వం వాదించింది. ఆ వాదనతో ఏకీభవించిన ట్రిబ్యునల్ అప్పర్ కృష్ణా ప్రాజెక్టుకు గతంలో బచావత్ ట్రిబ్యునల్ 75% లభ్యత ప్రాతిపదికన కేటాయించిన 173 టీఎంసీలను కొనసాగిస్తూ, 65% లభ్యత ఆధారంగా మరో 130 టీఎంసీలను కేటాయించింది. 524.256 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేసుకోవడానికి అనుమతి ఇస్తూ 2013, నవంబరు 29న కేంద్రానికి తుది నివేదిక ఇచ్చింది. దాన్ని ఉమ్మడి ఏపీ, మహారాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో సవాలు చేశాయి. దాంతో బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తుది నివేదికను అమలును సుప్రీంకోర్టు నిలిపేసింది. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ సైతం ఈ కేసులో ప్రతివాదిగా చేరింది. 524.256 మీటర్ల ఎత్తువరకు నీళ్లు నిల్వ చేస్తే ముంపునకు గురయ్యే 20 గ్రామాలు, బాగల్‌కోట మున్సిపాల్టీలో 11 వార్డుల ప్రజలకు పునరావాసంతో పునర్‌నిర్మాణం కోసం 75,663 ఎకరాల భూసేకరణకు రూ.70 వేల కోట్లను మంజూరు చేస్తూ కర్ణాటక మంత్రివర్గం గత సెప్టెంబరు 17న నిర్ణయం తీసుకుంది. కేసు పరిష్కారం కాకముందే కర్ణాటక ఆల్మట్టి ఎత్తు పెంపునకు ముందుకు వెళ్తుండటాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టు మరో ఇంటర్‌లొక్యూటరీ అప్లికేషన్ దాఖలుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

పోలవరం-బనకరచర్ల అనుసంధానంపై..

తమ అభ్యంతరాలను పట్టించుకోకుండా ఏపీ ప్రభుత్వం పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు డీపీఆర్ రూపకల్పన కోసం టెండర్లను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ ఇప్పటికే కేంద్ర జలశక్తి శాఖతో పాటు కృష్ణా బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం ఫిర్యాదు చేసింది. కేంద్ర జల వనరుల సంఘం(సీడబ్ల్యూసీ) మార్గదర్శకాల ప్రకారం ప్రాజెక్టు డీపీఆర్ తయారీతో పాటు అవసరమైన పరిశోధనలు, కేంద్రం నుంచి చట్టపరమైన అనుమతులు పొందడానికి సహకారం కోరుతూ ఏపీ రాష్ట్ర జల వనరుల శాఖ గత నెల 7న టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. పోలవరం నుంచి బనకచర్లకు 200 టీఎంసీల గోదావరి జలాలను తరలించే ప్రాజెక్టుకి అనుమతి కోసం సీడబ్ల్యూసీకి గత మే 22న పీఎఫ్ఆర్(ప్రీ ఫీజిబులిటీ రిపోర్టు)ను ఏపీ సమర్పించింది. దీనిపై తెలంగాణ సహా బేసిన్ పరిధిలోని ఇతర రాష్ట్రాలు, గోదావరి, కృష్ణా బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ)తో పాటు స్వయంగా సీడబ్ల్యూసీ ఈ ప్రతిపాదనలపై తీవ్ర ఆక్షేపణ తెలిపాయి. పర్యావరణ అనుమతి కోసం దరఖాస్తు చేయడానికి నిర్వహించాల్సిన పర్యావరణ ప్రభావ మదింపు(ఈఐఏ)కి నియమ, నిబంధనలు(టీవోఆర్) జారీ చేయాలని ఏపీ చేసుకున్న దరఖాస్తును కేంద్ర అటవీ, పర్యావరణ శాఖలోని నిపుణుల మదింపు కమిటీ గత జూన్ 30న తోసిపుచ్చింది. గోదావరిలో వరద జలాల లభ్యత, అంతర్రాష్ట అనుమతి తర్వాతే టీవోఆర్ కోసం దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. అయినా, ఈ ప్రాజెక్టు డీపీఆర్ విషయంలో ఏపీ ముందుకెళ్లడం, అడ్డుకునేందుకు కేంద్రం చర్యలు తీసుకోకపోవడంతో సుప్రీంకోర్టులో కేసు దాఖలు ఒక్కటే మార్గమని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. సుప్రీంకోర్టులో కేసు వేయడం ద్వారా ఆ ప్రాజెక్టుకు పరోక్షంగా చట్టబద్ధత కల్పించినట్లవుతుందని, కేసును సుప్రీం స్వీకరిస్తే ఏ వేదికల్లోనూ వ్యతిరేకించడానికి అవకాశం లేకుండా పోతుందని జలవనరుల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేసు వేయడం విపక్షం వేసిన ఉచ్చులో చిక్కుకోవడమేనని అభిప్రాయపడుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.